www.velthuru.com
RNI TEL TEL/ 2019 / 78609
రంగారెడ్డి
VELTHURU TELUGU DAILY
# వెలుతురు
తెలుగు దినపత్రిక
శనివారం 21 జూన్ 2025
సంపుటి :07 సంచిక : 25 , పేజీలు : 12 వెల:రూ.5/-



## గ్రూప్ 1పై చివరిదాకా న్యాయపోరాటం చేయండి

మీ సమస్య పరిష్కారమయ్యేదాకా అండగా ఉంటా

గ్రూప్ 1 అభ్యర్థులకు హామీనిచ్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్ వెలుతురు జూన్ 20:**
గ్రూప్ 1 పరీక్షల్లో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ ఆందోళనలు నిర్వహిస్తున్న అభ్యర్థులకు కేంద్ర

# బనకచర్లపై ఎపి సిఎంతో చర్చలకు సిద్ధం

- జలవివాదాల పరిష్కారానికి ముందుంటాం
- ఎపితో కలసి వెళ్లాలన్నదే మా సిద్ధాంతం
- ఇరు రాష్ట్రాల మధ్య వివాదాలు కోరుకోవడం లేదు
- 23న కేబినేట్‌లో చర్చించి ఎపిని చర్చలకు ఆహ్వానిస్తాం
- బిఆర్ఎస్ హయాంలోనే బనకచర్ల కోసం జీవోలు
- ఆనాడు మాట్లాడని హరీష్ ఇవ్వాళ మాట్లాడడంలో అర్థం లేదు
- ఢిల్లీలో మీడియాతో ఇష్టాగోష్టిలో సిఎం రేవంత్ రెడ్డి

*బనకచర్ల అంశం గురించి కూర్చొని మాట్లాడుకుంటే వివాదం ఉండదని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఎపి సిఎం చంద్రబాబుతో కలసి మాట్లాడేందుకు తనకు అభ్యంతరం లేదన్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బనకచర్ల-గోదావరి ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబుతో చర్చలకు సిద్ధమని ప్రకటించారు. 23న కేబినెట్ భేటీలో దీనిపై చర్చిస్తామని అన్నారు. ఎపి సిఎంను తామే ఆహ్వానిస్తామని కూడా అన్నారు.*



**న్యూఢిల్లీ,జూన్20( వెలుతురు):**
'ఏపీ.. కేంద్రానికి పీఎఫ్‌ఆర్ ఇవ్వడం వల్లే వివాదం మొదలైంది. పీఎఫ్‌ఆర్ ఇచ్చేముందే తెలంగాణతో చర్చించి ఉంటే వివాదం ఉండేదికాదు. ఆంధ్రప్రదేశ్ ప్రీ ఫీజిబులిటి రిపోర్ట్ (పీఎఫ్‌ఆర్) ఇచ్చిన వెంటనే కేంద్రం స్పందిస్తోంది. బనకచర్లపై కేంద్రం అన్ని రకాల చర్యలకు సిద్ధమైంది. ఇద్దరు సీఎంలు కూర్చుని ప్రాజెక్టుల వారీగా సమస్యలపై చర్చిద్దాం. ఒక రోజు కాదు నాలుగు రోజులైనా చర్చిద్దాం. రాష్ట్రాలమధ్య జలవివాదాలు చర్చల ద్వారానే పరిష్కారమవుతాయన్నారు. న్యాయ, సాంకేతిక అంశాలను పరిశీలిద్దాం. వివాదాల పరిష్కారంలో నాకెలాంటి భేషజాలు లేవు. ఇద్దరు వ్యక్తులు కాదు.. రాష్ట్రాల మధ్య వ్యవహారం ఇది. విభజనచట్టం ప్రకారం ప్రాజెక్టుల్లో మార్పులు చేస్తే చెప్పుకోవాలి. విభజన చట్టం ప్రకారం గతంలో సీఎంల స్థాయిలో చర్చలు జరిపాం. అనేక అంశాలను సీఎం స్థాయిలో చర్చించాం' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 'తెలుగువారి మధ్య అనవసరమైన సమస్యలు ఉండొద్దు. పైన, కింద ఉన్న రాష్ట్రాలతో వివాదం కోరుకోవట్లేదు. కింది రాష్ట్రంగా ఏపీకి హక్కులు ఉన్నాయంటున్నారు. అదే రకమైన హక్కులు తెలంగాణకు కూడా ఉంటాయి. ఈనెల 23న రాష్ట్ర కేబినెట్ సమావేశం ఉంది. కేబినెట్‌లో బనకచర్లపై చర్చిస్తాం. ఒక అడుగు ముందుకేసి మేమే ఏపీని చర్చలకు పిలుస్తాం. మోదీ సీట్లో కూర్చోవాలంటే చంద్రబాబు సపోర్టు కావాలి. చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావాలంటే గోదావరి నీటిని తరలించాలి. విభజన చట్టంలో పోలవరానికి మాత్రమే అనుమతి ఉంది. బనకచర్ల అనేది పోలవరానికి అనుబంధ



## పేదలకు విద్యా వైద్యం అందేలా చిత్తశుద్ధితో పనిచేయాలి

- ప్రభుత్వ ఆసుపత్రుల పై నమ్మకం కలిగేలా వైద్య సేవలు అందించాలి
- చింతల్ బస్తి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, యునాని ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ
- అటెండెన్స్ రిజిస్టర్, ల్యాబ్, మెడిసిన్ స్టోర్ పరిశీలన
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలి
- ఆస్పత్రులు, పాఠశాలలు, హాస్టల్స్, శానిటేషన్ పై జిల్లా కలెక్టర్, కమిషనర్, తాను ఆకస్మికంగా తనిఖీలు చేస్తాం
- గైర్హాజరైన ఏఎన్ఎం లపై చర్యలు తీసుకోవాలి
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



## అర్చకుల జీవితాల్లో ఆశలు నింపిన మంత్రి కొండా సురేఖ

- 18 మంది ఉద్యోగులకు అర్చక సంక్షేమ నిధి ట్రస్టు ద్వారా గ్యాట్యూటీ, మెడికల్ సాయం చెల్లింపు
- రూ. 32 లక్షల చెక్కును అర్చక, ఉద్యోగులకు అందజేసిన మినిస్టర్ కొండా సురేఖ
- రిటైర్ అయిన ఉద్యోగులను సన్మానించిన దేవాదాయ శాఖ మంత్రి
- తమకు కొండంత సాయం చేశారని మంత్రికి ధన్యవాదాలు తెలిపిన ఉద్యోగులు

## యోగాతో యోగ్యత వస్తుంది

- ఎల్బీ స్టేడియం యోగాలో వెంకయ్యనాయుడు
- కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తదితరులు



## విశాఖ చేరుకున్న ప్రధాని మోడీ

- విమానాశ్రయంలో గవర్నర్, చంద్రబాబు స్వాగతం



**విశాఖపట్నం,జూన్ 20( వెలుతురు)**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం విశాఖకు చేరుకున్నారు. అంతర్జాతీయ యోగాలో పాల్గొనేందుకు ఒడిశా నుంచి నేరుగా విశ్వాఖకు వచ్చారు. విమానాశ్రయంలో ఆయనకు గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ

## అంధ విద్యార్థుల గీతాలాపన

- భావోద్వేగంతో కంటతడి పెట్టిన రాష్ట్రపతి ముర్ము



## ఇంగ్లీష్ వద్దనడం పేదలను చులకన చేయడమే

- వారిని ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర
- ఇంగ్లీష్ ఒక వారధిలాంటి భాష మాత్రమే
- అమిత్ షా వ్యాఖ్యలకు ఎక్స్ వేదికగా రాహుల్ కౌంటర్



**న్యూఢిల్లీ,జూన్20( వెలుతురు):**
ఇంగ్లీష్ మాట్లాడే వాళ్లు త్వరలోనే సిగ్గుపడాల్సి వస్తుందని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ శుక్రవారంనాడు తప్పుపట్టారు. దేశంలోని పేద పిల్లలను ఉన్నత విద్యకు దూరం చేసేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తున్నాయని అన్నారు. 'ఇంగ్లీష్ అనేది డ్యామ్ కాదు, ఒక బ్రిడ్జి. ఇంగ్లీష్ అంటే సిగ్గు కాదు, పవర్. ఇంగ్లీషు అనేది ఒక చైన్ కాదు, చైన్‌లను బ్రేక్ చేసే పరికరం.

## పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

- ప్రతి గ్రామం పేదవారికి ఇళ్లు వచ్చేలా కృషి
- ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందించిన మంత్రి వివేక్



**సిద్దిపేట,జూన్20( వెలుతురు):**
పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. ప్రతి ఇందిరమ్మ ఇంటికి తమ ప్రభుత్వం రూ.5లక్షలు ఇస్తోందని అన్నారు. సిద్దిపేట జిల్లాకు 12వేల

## బలమైన అభివృద్ధి దిశగా బీహార్ పయనం

- ఆటవిక రాజ్యం నుంచి బీహార్‌ను బయటపడేశాం
- 55,000 కిలోమీటర్ల మేర గ్రామీణ రోడ్లు వేశాం
- 1.5 కోట్ల ఇళ్లకు విద్యుత్, 26 కోట్ల మందికి మంచినీటి సరఫరా
- పేదలకు మరో మూడుకోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తాం
- మళ్లీ ఆటవిక రాజ్యాన్ని రాకుండా అడ్డుకోవాలి
- బీహార్ పర్యటనలో ప్రజలకు ప్రధాని మోడీ పిలుపు



**పాట్నా,జూన్20( వెలుతురు):**
బీహార్‌ను ఆటవిక రాజ్యంలోకి నెట్టిన ఘనత కాంగ్రెస్, ఆర్జేడీలదేనని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శలు గుప్పించారు. ప్రజలే ఆటవిక పాలనకు చరమగీతం పాడారని, ఇప్పుడు ఎన్డీయే హయాంలో బీహార్ బలమైన అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు. బీహార్‌లోని సివాన్‌లో శుక్రవారంనాడు జరిగిన బహిరంగ సభలో ప్రధాని మాట్లాడుతూ, రాష్ట్రం దశాబ్దాలుగా పేదరికంలో మగ్గడానికి, కార్మికుల వలసలకు కాంగ్రెస్, ఆర్జేడీలే కారణమని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న బిహార్‌లో తాజాగా మరోసారి పర్యటించిన మోదీ.. కాంగ్రెస్, ఆర్జేడీ కూటమిపై నిప్పులు చెరిగారు. బిహార్‌ను 'లైసెన్స్ రాజ్' సుదీర్ఘ కాలం పేదరికంలోనే ఉంచిందని, ఇందులో దళితులే అతిపెద్ద బాధితులుగా మారారని



## ఒడిశాలో నవశకం ప్రారంభం అయ్యింది

- ఏడాది పాలనలో ఎంతో మార్పు కనిపిస్తోంది
- రూ.18,600 కోట్ల విలువైన 105 ప్రాజెక్టులకు ప్రారంభం
- జగన్నాధుడి కోసం ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించా
- ఒడిశా పర్యటనలో ప్రధాని మోడీ

**భువనేశ్వర్,జూన్ 20( వెలుతురు):**
ఒడిశాలో మొదటిసారిగా ఏర్పడ్డ బీజేపీ ప్రభుత్వం సుపరిపాలన, ప్రజా సేవలతో విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసిందని.. ఇది ఎంతో ప్రత్యేకమైన రోజని ప్రధాని మోడీ అన్నారు. ఈ వార్షికోత్సవం కేవలం ప్రభుత్వ వార్షికోత్సవం మాత్రమే కాదని.. ఇది సుపరిపాలన స్థాపన వార్షికోత్సవమని అభివర్ణించారు. ఏడాదిలో ప్రజలకు సుపరిపాలన అందించిన ముఖ్యమంత్రి మోహన్

## సినిమా డైలాగులు హాలు వరకే బాగుంటాయి

- జనారణ్యంలో అవి మాట్లాడితే కుదరదు
- శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా జగన్ పర్యటన
- ప్రజలు ఓ కంటకనిపెట్టి ఉండాలన్న డిప్యూటి సిఎం



**అమరావతి,జూన్20( వెలుతురు):**
అప్రజాస్వామిక ధోరణిలో మాట్లాడే వారిని ప్రజలు ఓ కంట కనిపెట్టాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. అసాంఘిక శక్తులపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని హెచ్చరించారు. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ సీఎం జగన్ సినిమా డైలాగుల

(మొదటి పేజీ తరువాయి..)

## పేదలకు విద్యా వైద్యం అందేలా
# చిత్తశుద్ధితో పనిచేయాలి



హైదరాబాద్ వెలుతురు జూన్ 20:

పేదలకు విద్య వైద్యం కచ్చితంగా అందేలా రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తుందని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం చింతల్ బస్తి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , యునాని ఆస్పత్రులను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్ తో పాటు మెడికల్ స్టోర్ లో మందుల నిల్వ, క్యాడర్ స్ట్రెంత్, డాక్టర్ల పనితీరుపై పబ్లిక్ హెల్త్ నర్స్ శకుంతల ను అడిగితెలుసుకున్నారు. వర్షాకాలం మొదలైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. విధులకు గైర్హాజరైన ఏఎన్ఎంలపై చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో ఉన్న ఏఎన్ఎం లకు ఫోన్ చేసి ఎక్కడున్నారు ఏ వీధిలో వైద్య సేవలు అందిస్తున్నారు ఆ ఆ ఇంటి యజమానితో వారితో మాట్లాడించాలని ఏఎన్ఎం లను సూచించగా వారు సత్వరమే స్పందించి ఇంటి యజమానితో మంత్రి మాట్లాడించారు. మంత్రి వారితో మాట్లాడుతూ వైద్య సేవలు సరిగా అందిస్తున్నారా, మందులు ఇస్తున్నారా, ఏఎన్ఎంలు సరిగా విధులు నిర్వహిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. వైద్యశాలకు వచ్చే రోగులకు చికిత్స అనంతరం మెడిసిన్ అందించాలని అలాగే గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు లకు కచ్చితంగా వైద్యం అందించాలని సూచించారు. ఆస్పత్రిలో మెడికల్ ఆఫీసర్, సిబ్బందిని నియమించడం జరుగుతుందని అన్నారు. ఓపీ వార్డులో ఔట్ పేషెంట్ రిజిస్టర్ ను పరిశీలించి ఓపి వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని ఏరియా ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందులు కొరత లేకుండా చూడాలని అలాగే వైద్య అధికారులు, ఏఎన్ఎం లు క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది, ప్రశంసనీయమైనదని పేదలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. జిల్లాలో ప్రతివారం పాఠశాలలు, ఆస్పత్రులు, హాస్టల్స్ ను జిల్లా కలెక్టర్, జిహెచ్ఎంసి కమిషనర్, జిల్లా ఇన్చార్జ్ మంత్రి తాను ఆకస్మికంగా తనిఖీలు చేస్తామని సానిటేషన్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు . పేదలకు నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించాలనేదే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.ఈ కార్యక్రమంలో పి హెచ్ ఎన్ సూపర్వైజర్ శకుంతల, కార్పొరేటర్ విజయ రెడ్డి, వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ 1పై చివరిదాకా న్యాయపోరాటం చేయండి

మంత్రి బండి సంజయ్ కుమార్ అండగా నిలిచారు. గ్రూప్ 1 అభ్యర్థులు చేస్తున్న న్యాయ పోరాటానికి మద్దతిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై న్యాయ పోరాటం చేయాలని సూచించారు. న్యాయ పోరాటంలో పూర్తిగా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. శుక్రవారం రోజున పలువురు గ్రూప్ 1 అభ్యర్థులు కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయానికి విచ్చేసి కేంద్ర మంత్రిని కలిశారు. గ్రూప్ 1 పరీక్షల్లో జరిగిన అక్రమాలను వివరించారు. ఉర్దూ మీడియంలో మెటీరియల్ అందుబాటులో లేనప్పటికీ ఆ మీడియంలో పరీక్షలు రాసిన వారిలో సింహభాగం అర్హులుగా ప్రకటించారని వాపోయారు. ఒకే సెంటర్ లో పరీక్ష రాసిన వారే ఎక్కువగా అర్హత సాధించడంపట్ల అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ విషయంలో తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని, అండగా నిలవాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ గ్రూప్ 1 పరీక్షల్లో అక్రమాలు జరిగిన విషయంపై జరుగుతున్న పోరాటంలో పూర్తిగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కష్టపడి చదువుకున్న అభ్యర్థులు మాత్రమే ఉద్యోగాలకు అర్హులని, అక్రమాలకు తావివ్వకుండా పరీక్షలు నిర్వహించాలన్నదే తమ అభిమతమని చెప్పారు. ఈ విషయంలో వాస్తవాలు నిగ్గు తేలి అర్హులైన అభ్యర్థులకు న్యాయం జరిగే వరకు న్యాయస్థానాల్లో పోరాడాలని సూచించారు. ఈ విషయంలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

### అంధ విద్యార్థుల గీతాలాపన

డెహ్రాడూన్,జూన్20( వెలుతురు):

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వేదికపైనే భావోద్వేగానికి గురయ్యారు. కంట తడి పెట్టారు. రాష్ట్రపతి తన 67వ పుట్టినరోజు సందర్భంగా డెహ్రాడూన్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు అంధ విద్యార్థులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ గీతాలు ఆలపించారు. ఈ క్రమంలోనే ద్రౌపది ముర్ము భావోద్వేగానికి లోనయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఉత్తరాఖండ్‌లో మూడు రోజుల పర్యటనకు వచ్చిన రాష్ట్రపతి డెహ్రాడూన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ విజువల్లీ హ్యాండీక్యాప్డ్ డిసేబిలిటీ (ఎన్ఐఈపీవీడీ)ని సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలను ఉద్దేశించి మాట్లాడుతూ, పిల్లలు ఎంతో అందంగా పాడుతుంటే భావోద్వేగానికి గురయ్యారని చెప్పారు. 'కన్నీళ్లు ఆగలేదు. పిల్లలు చాలా చక్కగా పాడారు. ఇది వారి హృదయం లోతుల్లోంచి వచ్చిన పాట' అని అన్నారు. పుట్టుకతోనే వైకల్యంతో పుట్టిన వారిలో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని, వారిలో ఆత్మవిశ్వాసం నింపి ముందుకు తీసుకువెళ్లే ఒకనాటి నిశ్చయంగా వారు సక్సెస్ అవుతారని రాష్ట్రపతి అన్నారు. వైకల్యంతో ఉన్న పిల్లల సాధికారత, సమాన అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం పథకాల రూపకల్పన జరుగుతోందని చెప్పారు. వైకల్యంతో పుట్టిన పిల్లల సాధికారత కోసం పని చేస్తున్న ఎన్ఐఈపీవీడీని అభినందించారు. ఉత్తరాఖండ్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్ సింగ్ (రిటైర్డ్), ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ థామి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### విశాఖ చేరుకున్న ప్రధాని మోడీ

సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు. శనివారం విశాఖ ఆర్కే బీచ్ రోడ్డులో జరిగే యోగాంధ్ర కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొననున్నారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి ఐఎన్ఎస్ డేగాకు చేరుకుని, అక్కడ నుంచి నౌకాదళ అతిథిగృహానికి వెళ్లి రాత్రికి అక్కడే బసచేస్తారు. 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఉదయం ఆర్కే బీచ్‌లో నిర్వహించే యోగాసనాల్లో పాల్గొంటారు. కార్యక్రమాలు ముగిసిన తర్వాత ఉదయం 11.50 గంటలకు దిల్లీకి తిరుగు పయనమవుతారని సమాచారం.

### యోగాతో యోగ్యత వస్తుంది

హైదరాబాద్,జూన్20( వెలుతురు):

యోగా చేస్తే యోగ్యులు అవుతారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు తెలిపారు. ఎల్బి స్టేడియంలో జరిగిన యోగా కౌంట్‌డౌన్ కార్యక్రమంలో భాగంగా వెంకయ్యనాయుడు మాట్లాడారు. మానసిక శక్తులను ఏకం చేసేది యోగా అని ప్రశంసించారు. విశ్వమంతా పరిపూర్ణ ఆరోగ్యంతో, శాంతితో ముందుకు సాగాలన్నదే యోగ దినోత్సవ సంకల్పమని స్పష్టం చేశారు. యోగాకు మతం లేదు జాతి లేదని, యోగా మన జీవన విధానమని తెలియజేశారు. ప్రపంచంలోనే అద్భుత సాహసం ఆపరేషన్ సింధూర్ అని కొనియాడారు. ఒకే భూమి? ఒకటే ఆరోగ్యం కోసం యోగ అని అనే సంకల్పంతో ఈ ఏడాది యోగ దినోత్సవాన్ని జరుపుకోవడం సంతోషంగా ఉందని, మనమంతా ఇదే సంకల్పాన్ని తీసుకుని వసుధైవ కుటుంబ భావనతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మంది యోగ మార్గాన్ని సాధన చేస్తూ ముందుకు సాగుతున్నారని, విదేశీయులంతా యోగ మార్గాన్ని తలకెత్తుకుని ముందుకు సాగుతుంటే, ఈ నేల మీద పుట్టిన మనం యోగ మార్గానికి ఇంకెంత గౌరవం ఇవ్వాలో ఒక్కసారి ఆలోచించుకోవాలని, యోగ మార్గాన్ని అనుసరించవలసిందిగా వెంకయ్యనాయుడు కోరారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, వెంకయ్యనాయుడు.. కిషన్‌రెడ్డి, భూపతిరాజు శ్రీనివాసవర్మ, సినీనటులు కుష్బూ, మీనాక్షి చౌదరి హాజరయ్యారు.

## అర్చకుల జీవితాల్లో
## ఆశలు నింపిన మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్ వెలుతురు జూన్ 20:

దేవాదాయ శాఖలో కొన్ని సంవత్సరాల తరబడి పని చేస్తున్న అర్చకులు, ఉద్యోగుల జీవితాల్లో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆశలు నింపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాయాలయాల్లో పని చేస్తున్న అర్చకుల దీర్ఘకాలిక కోరికను నెరవేర్చారు. అన్ని ఆలయాల్లో సుదీర్ఘ కాలంగా సేవలు అందిస్తున్న అర్చక, ఉద్యోగ సంక్షేమ నిమిత్తం ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేశారు. అయితే, గురువారం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎండోమెంటు డైరెక్టర్ వెంకటరావు తదితర అధికారులతో అర్చక, ఉద్యోగ సంక్షేమ నిధి చెక్ ను అందజేశారు. 18 మంది ఉద్యోగులకు అర్చక సంక్షేమ నిధి ట్రస్టు ద్వారా గ్యాట్యూటీ, మెడికల్ సాయం అందజేశారు. రూ. 32 లక్షల





చెక్కును ఉద్యోగులకు మినిస్టర్ కొండా సురేఖ ఇచ్చారు. వీడివీడిగా వారికి ఆర్డర్ కాపీలు అందజేశారు. అనంతరం రిటైర్ అయిన ఉద్యోగులను మంత్రి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ... అర్చక, ఉద్యోగుల సంక్షేమం తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు. ఈ సంక్షేమ ట్రస్టు ద్వారా దేవాదాయ శాఖ పరిధిలో గల సహాయ కమీషనర్ స్థాయి వరకు గల దేవాలయాలలో పని చేసే సుమారు 13,700 మంది అర్చకులు, ఇతర ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని ఆమె చెప్పారు. అర్చకులు, ఇతర ఉద్యోగులకు మరణానంతరము లేదా రిటైర్మెంట్ గ్రాట్యూటి ఇవ్వడం జరుగుతుందన్నారు. ధూపదీప నైవేద్య అర్చకులకు మరణానంత రము చెల్లించు గ్రాట్యూటి నిర్ధారించి నట్టు చెప్పారు. మరణానంతరము చెల్లించు ఎక్స్ గ్రేషియా, అంతిమ సంస్కారాల ఖర్చుల నిమిత్తము చెల్లింపు ఈ నిధి ఉపయోగపడు తుందన్నారు. ఈ నిధి కింద ఉద్యోగులకు.... మెడికల్ రీయింబర్స్ మెంట్, వివాహ నిమిత్త పథకం, ఉపనయన పథకం, గృహ నిర్మాణ, కొనుగోలు మరియు మరమ్మత్తుల నిమిత్త పథకం, విద్యా పథకం, విధులు నిర్వహించలేని వికలాంగులైన ఉద్యోగుల కు ఆర్థిక సహాయ పథకం అందజేయడం జరుగుతుం దన్నారు.

### దేవాదాయ శాఖ మంత్రి సురేఖమ్మకు రుణపడి ఉంటాం: అర్చక, ఉద్యోగులు

ఏండ్ల తరబడి పెండింగ్ ఉన్న సమస్యను తీర్చినందుకు మంత్రి కొండా సురేఖకు ధన్యవాదాలు. మంత్రి తమకు కొండంత సాయం చేశారు. వివిధ పథకాలలో రెగ్యులర్ అర్చకులు, ఇతర ఉద్యోగులకు మరణానంతరము లేదా రిటైర్మెంట్ గ్రాట్యూటి పథకానికి .28.05.2025 రోజున అర్చక సంక్షేమ బోర్డు ద్వారా గ్రాట్యుటీ రూ 4.00 లక్షల నుండి రూ?8.00 లక్షలకు పెంచడం హర్షణీయం. ఈ గ్రాట్యుటీ మొత్తమును సదరు ఉద్యోగి యొక్క బ్యాంకు ఖాతాలో ఏక మొత్తములో వారి సర్వీసు కాలమునకు లోబడి చెల్లించడం చాలా సంతోషకరమన్నారు. ఎవరైనా అకాలం చనిపోతే, అంతిమ సంస్కారాల ఖర్చుల నిమిత్తం రూ20,000/- ల నుండి రూ 30,000/- లకు పెంచడం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

# బనకచర్లపై ఎపి సిఎంతో చర్చలకు సిద్ధం

ప్రాజెక్టు. బనకచర్లపై తెలంగాణ అభిప్రాయం తప్పక తీసుకోవాల్సిందే. 2016, 2018లో ఏపీ సర్కారు రెండు జీవోలు ఇచ్చింది. ఏపీ జీవోల ఆధారంగా వ్యాప్కోస్ 150 పేజీల నివేదిక ఇచ్చింది. గోదావరి–పెన్నా అనుసంధానంలో బనకచర్ల ఒక భాగం. 86 రోజుల్లో 400 టీఎంసీలు తరలించేలా బనకచర్ల డిజైన్ చేశారు. గోదావరిలో 968 టీఎంసీలు వాడే వెసులుబాటు తెలంగాణకు ఉంది. కేటాయించింది వాడుకునేందుకు అవకాశం ఇవ్వట్లేదు. కేటాయింపులు వాడుకునే అవకాశం ఇవ్వక పోవడంతోనే వివాదం. కోర్టుకు వెళ్లడం కంటే ముందుగా చర్చించుకోవడం మంచిది. ఈ వివాదం పరిష్కారానికి ఎలాంటి డెడ్‌లైన్ లేదు' అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్రం ఏపీతో వివాదాలు కోరుకోవట్లేదని.. కానీ ఎవరి కోసమో మా హక్కులు వదులుకోబోమని తేల్చి చెప్పారు. జూన్ 23న కేబినెట్ భేటీ నిర్వహించి.. ఇందులో బనకచర్ల ప్రాజెక్టు గురించి చర్చిస్తామన్నారు. ఆ తర్వాత అవసరమైతే మేమే ఒక అడుగు ముందుకేసి బనకచర్ల ప్రాజెక్టుపై ఏపీ గవర్నమెంట్‌ని చర్చలకు ఆహ్వానిస్తామన్నారు. చర్చల ద్వారానే జల వివాదాలకు పరిష్కారం లభిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పొరుగు రాష్ట్రాలతో తెలంగాణ అనవసరమైన వివాదాలను కోరుకోవడం లేదని.. పైన ఉన్న కర్ణాటకతో సత్సంబంధాలు కొనసాగిస్తున్నట్లే ఏపీతోనూ మంచి రిలేషన్ కొనసాగించుకోవాలనేది మా విధానమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ మళ్లీ తెలంగాణ సెంటిమెంటును అడ్డంపెట్టుకుని రాజకీయం చేయాలని చూస్తోందని.. ఇప్పుడు గోదావరి జలాల ఇష్యూని చచ్చిపోయిన బీఆర్ఎస్ సంజీవనిలా వాడుకోవాలని ప్రయత్నిస్తోందని విమర్శించారు. తెలంగాణకు సాగునీటిలో విషయంలో అన్యాయం చేసిందే కేసీఆర్, హరీష్ రావు అని ఫైర్ అయ్యారు. బనకచర్ల ప్రాజెక్టుకు బీజం పడిందే 2016 బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అని గుర్తు చేశారు. 2016–2018లో బనకచర్ల ప్రాజెక్ట్ నిర్మాణం కోసం సర్వే చేయాలని ఏపీ ప్రభుత్వం జీవోలు ఇచ్చిందని.. అప్పుడు తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు అభ్యంతరం చెప్పలేదు..? ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా ఎందుకు కోర్టులను ఆశ్రయించలేదని ప్రశ్నించారు. గోదావరి వరద జలాలను ఏపీకి తరలించుకుపోయేందుకు అపెక్స్ కౌన్సిల్లో అప్పటి సీఎం కేసీఆర్ ఆమోదం తెలిపారని అన్నారు. కేసీఆర్, హరీష్ రావు చెప్పే అబద్దాలకు దేవుడు కూడా ఆశ్చర్యపోతాడని, నేనేనా వీళ్లను సృష్టించిందని షాక్ అవుతాడని ఎద్దేవా చేశారు. హరీష్ రావు అతి తెలివితో అసహనంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. హరీష్ రావు తాటి చెట్టులా పెరిగాడు గానీ సరియైన నాలెడ్జి లేదన్నారు. నీటి జలాల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగడానికి ప్రధాన కారకుడు హరీష్ రావు అని ఆరోపించారు. ఇప్పుడు ప్రధాని మోడీకి చంద్రబాబు నాయుడు అవసరం. ఏపీలో మళ్ళీ ఎన్నికల్లో గెలిచేందుకు చంద్రబాబుకు గోదావరి వరద జలాల అవసరం. అలాగే తెలంగాణలో పార్టీని బతికించుకోవడానికి బీఆర్ఎస్?కు బనకచర్ల ఇష్యూ అవసరం. వీరంతా కలిసి మమ్మల్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. కేబినెట్ ఆమోదంతోనే కాళేశ్వరం డిజైన్లు రూపొందించారన్న బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ వ్యాఖ్యలకు తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కిషన్ రెడ్డికి ట్యూషన్ మాస్టర్ కేసీఆర్.. కేటీఆర్‌కు లైజనింగ్ ఆఫీసర్ కిషన్ రెడ్డి అని సీఎం రేవంత్ సెటైర్ వేశారు.

## ఇంగ్లీష్ వద్దనడం పేదలను
## చులకన చేయడమే

ఇండియాలోని పేద పిల్లలు ఇంగ్లీష్ చదువుకోవడం బీజేపీ, ఆర్ఎస్ఎస్‌కు ఇష్టం లేదు. వాళ్లను ప్రశ్నించేవారు ఉండకూడదని వారు కోరుకుంటున్నారు. తమతో సమానంగా ఎదగడం కూడా వారికి ఇష్టం లేదని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రతిరోజూ ఇంగ్లీష్ మాట్లాడవద్దని, హిందీలో మాట్లాడమని చెబుతుం టారని, అయితే ఆర్ఎస్ఎస్, బీజేపీలోని పిల్లల మాత్రం ఇంగ్లీషు విద్యకు వెళ్తుంటారని, దీని వెనుక కారణమేమిటని రాహుల్ ప్రశ్నించారు. ఎందుకంటే పేద పిల్లలు బోర్డ్ రూముల్లోకి ఎంటర్ కారాదని, అధిక వేతనాలతో కూడిన ఉద్యోగాలు రాకూడదని వారు కోరుకుంటున్నారని అన్నారు. వాళ్లు ఇంగ్లీషు స్కూళ్లకు వెళ్లి కాంటాక్టులు పెంచుకుంటారని, పేద పిల్లలకు మాత్రం తలుపులు మూసేస్తారని ఆక్షేపణ తెలిపారు. సాధికారతకు మాతృభాషతో పాటు ఇంగ్లీష్ చాలా అవసరమని, ఇంగ్లీష్ విద్య విద్యార్థులకు ఆత్మవిశ్వా సాన్ని, ఉపాధిని కల్పిస్తుందని రాహుల్ అన్నారు. దేశంలోని ప్రతి భాష ఆత్మవంటిదని, సంస్కృతి, నాలెడ్జికి ప్రతీక అని అన్నారు. భాషాభివృద్ధి జరగాలని, అదే సమయంలో ప్రతి ఒక్క పిల్లవాడికి ఇంగ్లీష్ బోధించాలని అన్నారు. అప్పుడే ప్రపంచంతో భారత్ పోటీ పడగలుగుతుందని, ప్రతి ఒక్క పిల్లవాడు సమానావకాశాలు పొందగలడని రాహుల్ స్పష్టం చేశారు. తన ఎక్స్ అకౌంట్‌లో హిందీ భాషలో రాహుల్ గాంధీ ఈ పోస్టు చేశారు. ప్రతి భారతీయ భాషకు ఆత్మ, సంస్కృతి, జ్ఞానం ఉన్నాయని, వాటిని ఆదరించాలని, అదే సమయంలో ప్రతి చిన్నారికి ఇంగ్లీష్ భాషను నేర్పాలన్నారు. ప్రపంచంతో పోటీపడాలంటే ఇండియాకు ఇదో మార్గమని, ఇది ప్రతి పిల్లవాడికి సమాన అవకాశం కల్పిస్తుందన్నారు.

# బలమైన అభివృద్ధి దిశగా బీహార్ పయనం

ఆరోపించారు. రాష్ట్రంలోని సివాన్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఆయన.. ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా సాగుతుందన్నారు. ఎన్డీయే హయాంలో సాధించిన కీలక విజయాలను ప్రధాని ప్రస్తావిస్తూ, 55,000 కిలోమీటర్ల మేర గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేశామని, 1.5 కోట్ల ఇళ్లకు విద్యుత్ ఇచ్చామని, 26 కోట్ల మందికి పైపుల ద్వారా తాగునీటిని అందించామని చెప్పారు. బీహార్‌ను ఆటవిక రాజ్యంగా మార్చిన వారు తమ తప్పిదాలను పునరావృతం చేయాలనుకుంటున్నారని, మీ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రధాని హెచ్చరించారు. పేదలకు మరో మూడు కోట్ల ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రధాని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రజలే తన కుటుంబ సభ్యులనీ, కుటుంబంలోని ఏ ఒక్కరూ కడగండ్లపాలు కాకుండా చూస్తామని, వారి కోసం రేయింబవళ్లూ శ్రమిస్తామని, తమ కల నిజమయ్యేంత వరకూ విశ్రాంతి తీసుకునేది లేదని చెప్పారు. 'బిహార్‌ను ఎన్డీయే అభివృద్ధి చేస్తుందనడానికి మర్హౌరా రైలు ఫ్యాక్టరీ ఓ ఉదాహరణ. ఇప్పుడు ఆఫ్రికాలోనూ బిహార్‌కు ప్రశంసలు వస్తాయి. ఆర్జేడీ, కాంగ్రెస్‌లు పట్టించుకోని సరన్ జిల్లాలోనే ఈ రైల్వే ప్రాజెక్టు కొనసాగుతోంది. తయారీ, ఎగుమతుల్లో ఈ జిల్లా ఇప్పుడు ప్రపంచ పటంలో స్థానం సంపాదించుకుంది. బిహార్ అభివృద్ధిని సుదీర్ఘకాలంగా 'జంగిల్ రాజ్' అడ్డుకుంది. కానీ, ఇప్పుడు బిహార్‌లో తయారైన ఇంజిన్ ఆఫ్రికన్ రైలుకు శక్తినిస్తుంది' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అని మా ప్రభుత్వం చెబుతుంటే.. ఆర్జేడీ, కాంగ్రెస్‌లు మాత్రం 'పరివార్ కా సాత్' అంటూ వారి కుటుంబ శ్రేయస్సుకే ప్రాధాన్యం ఇస్తున్నాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. దేశంలో పేదరికానికి కాంగ్రెస్ 'లైసెన్స్ రాజ్' కారణమన్నారు. నేతల కుటుంబీకులు ధనవంతులు కాగా.. సామాన్యులు మాత్రం పేదలుగానే మిగిలిపోయారన్నారు. రానున్న రోజుల్లో మూడు కోట్ల ఇళ్లు నిర్మిస్తామన్నారు. ప్రజాసేవ చేయకుంటే తాను ప్రశాంతంగా నిద్రపోలేనని.. రాత్రి–పగలు ప్రజల కోసమే పని చేస్తానని వ్యాఖ్యానించారు. బీహార్ స్వాతంత్య్ర సమరయోధుల గడ్డ అని ప్రశంసించారు. భారతదేశం గ్లోబల్ పవర్‌గా ఎదగడంలో బీహార్ కీలక భూమిక వహిస్తోందని చెప్పారు. భారతదేశం శీఘ్రగతిన పురోగమిస్తుండటంపై ప్రపంచ దేశాలు ఎంతో ఆసక్తిగా చూస్తున్నాయని, త్వరలోనే ప్రపంచలోని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ నిలువనుందని వారు బలంగా నమ్ముతున్నారని చెప్పారు. సందర్భంగా పలు హౌసింగ్, వాటర్, రైల్, పవర్, మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగాల్లోని పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపన చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన–అర్బన్ కింద 6,600 మంది లబ్దిదారులకు తాళం చెవులు అందజేశారు. పీఎంఏవై–యూ లబ్దిదారులకు తొలి విడత ఇన్‌స్టాల్‌మెంట్‌గా రూ.536 కోట్లు విడుదల చేశారు. మర్హౌరా ప్లాంట్‌లో తయారైన లోకోమోటివ్‌ను జెండా ఊపి ప్రారంభించారు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఒడిశాలో నవశకం ప్రారంభం అయ్యింది

మాఝి, ఆయన మొత్తం బృందాన్ని అభినందిస్తున్నానని అన్నారు. కాగా, 2024 జూన్ లో జరిగిన ఒడిషా అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. నవీన్ పట్నాయక్ నేతృత్వంలోని బీజేడీని మట్టికరిపించి.. ఒడిషా రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా అక్కడ బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది.భాజపా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన రాష్ట్రాల్లో సామాజిక ఆర్థిక అభివృద్ధి విషయంలో నవశకం ప్రారంభమైందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. బిహార్ నుంచి ఒడిశా పర్యటనకు వెళ్లిన ఆయన.. రూ.18,600 కోట్ల విలువైన 105 ప్రాజెక్టులను ప్రారంభించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాని మాట్లాడారు. సుపరిపాలన, ప్రజాసేవలో ఒడిశాలోని భాజపా ప్రభుత్వం విజయవంతంగా ఒక ఏడాది పూర్తి చేసుకుందని చెప్పారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆహ్వానాన్ని తాను సున్నితంగా తిరస్కరించానని ప్రధాని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. 'జీ7 సదస్సు కోసం కెనడా వెళ్లినప్పుడు ట్రంప్ ఫోన్ చేశారు. వాషింగ్టన్ మీదుగా వెళ్లాలని సూచించారు. విందులో పాల్గొని



చర్చించుకుందామని పిలిచారు. జగన్నాథుడి పుణ్యభూమికి వెళ్లడం నాకు ముఖ్యమని చెప్పా. ఆయన ఆహ్వానాన్ని సున్నితంగా తిరస్కరించా'అని చెప్పారు. పూరీ జగన్నాథ ఆలయంలోని రత్న భాండాగారాన్ని తెరవాలన్న ప్రజల డిమాండ్‌ను భాజపా ప్రభుత్వం నెరవేర్చిందని మోదీ చెప్పారు. కాంగ్రెస్ పాలనలో భారత్‌లో సుపరిపాలనకు చోటు లేకపోయిందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఒడిశా అవినీతి కేంద్రంగా నిలిచిందన్న ప్రధాని.. మౌలిక సదుపాయాల కల్పనలో అప్పటి ప్రభుత్వం విఫలమైందన్నారు. చాలా ప్రాంతాలు అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచాయని, క్రమంగా వాటిని అభివృద్ధి చేసేందుకు భాజపా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా రూ.18,600 కోట్ల విలువైన 105 అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. 'ఒడిశా విజన్ డాక్యుమెంట్'ను ఆవిష్కరించారు. అలాగే పలు కొత్త రైళ్లను ప్రారంభించారు. ఒడిశా పర్యటన అనంతరం.. ప్రధాని విశాఖకు రానున్నారు. రాత్రి అక్కడే బస చేసి, శనివారం ఉదయం ఆర్కే బీచ్‌లో నిర్వహించబోయే యోగా కార్యక్రమంలో పాల్గొననున్నారు.

## జ్యోతినగర్ శ్రీవెంకటేశ్వర బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న బండి సంజయ్ దంపతులు



**కరీంనగర్ వెలుతురు జూన్ 20:**
కరీంనగర్ జ్యోతినగర్ లోని శ్రీమహాలక్ష్మీ గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న స్వామివారి పంచమ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కొద్దిసేపటి క్రితం వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. సతీసమేతంగా స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య పూజారులు బండి సంజయ్ దంపతులకు ఆశీర్వచనం అందించారు. స్థానిక కార్పొరేటర్ బండి రమణారెడ్డితోపాటు పలువురు బీజేపీ నాయకులు ఈ బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్నారు.


## నిరుద్యోగుల విద్యార్థి గర్జనలో పాల్గొన్న బోయపల్లి నాగరాజు గౌడ్



**హైదరాబాద్ వెలుతురు జూన్ 20:**
శుక్రవారం రోజున ఇందిరా పార్క్ లో జరిగిన నిరుద్యోగుల విద్యార్థి గర్జనలో పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య మరియు కరీంనగర్ నిజామాబాద్ మెదక్ ఆదిలాబాద్ గ్రాడ్యుయేట్స్ contested అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ మరియు వరంగల్ నల్లగొండ ఖమ్మం గ్రాడ్యుయేట్ contested అభ్యర్థి రాకేష్ రెడ్డి నిరుద్యోగ జేఏసీ పాలకూరి అశోక్, అశోక్ నగర్ ఉన్న నిరుద్యోగులు డాక్టర్ మాడుగుల నరసింహ మరియు వివిధ సంఘాల నేతలు బిసి సంఘాలు నేతలు పాల్గొనడం జరిగింది మరియు వివిధ జర్నలిస్టులు మరియు విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## కెసిఆర్ హయాంలో మరో అక్రమం

- సిఎం, మంత్రుల ఆదాయపన్ను చెల్లింపులు
- ప్రత్యేకంగా 917 జీవో విడుదల




**హైదరాబాద్,జూన్ 20( వెలుతురు):**
బిఆర్ఎస్ హయాంలో జరిగిన మరో అక్రమం వెలుగులోకి వచ్చింది. సలహాదారులకు సంబంధించిన ఐటి చెల్లింపును ప్రభుత్వ ఖజానానుంచే చేయడం బయటపడింది. ఆనాటి సిఎం కెసిఆర్ ఆదేశాలతో ప్రత్యేక జీవో విడుదల చేశారు. ఎక్కడైనా ఉద్యోగికి ప్రభుత్వం లేదా పనిచేస్తున్న సంస్థ జీతం ఇస్తుంది. దానిపై కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను విధిస్తుంది. కానీ కేసీఆర్ గవర్న్ మెంట్ లో ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ సలహాదారులకు జీతం ఇవ్వడంతోపాటు వారు కట్టాల్సిన ఐటీని కూడా ప్రభుత్వమే కట్టడం హాట్ టాపిక్ గా మారింది. ఇందుకోసం బీఆర్ఎస్ అధినేత, అప్పటి సీఎం కేసీఆర్ సర్కారు ఏకంగా ఓ జీవోనే జారీ చేసింది. ఆ జీవోను రహస్యంగా ఉంచడం గమనార్హం. 2016 మార్చి 25వతేదీన జీఓ ఆర్టీ నంబరు 917 ను రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీని ప్రకారం ప్రజాధనంతో సీఎం, మంత్రుల ఐటీ చెల్లింపులకు ప్రజాధనాన్ని వెచ్చిస్తూనే ఉన్నారు. నిధుల కొరతతో నీరసించినా.. సీఎం, మంత్రులు, సలహాదారుల ఐటీ మాత్రం ప్రభుత్వం కడుతూనే ఉంది. 2015-16 వ సంవత్సరానికి గాను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి సలహాదారులు, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆదాయపు పన్ను కింద రూ.22.51లక్షలు జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్టుమెంట్ చెల్లించింది. 2016వ సంవత్సరంలో అప్పటి సీఎం కేసీఆర్ ఆదాయపు పన్ను కింద రూ. 15.39 లక్షలు వెచ్చించారు.అప్పటి ప్రభుత్వ సలహాదారులు ఆర్ విద్యాసాగర్ రావు రూ.79 వేలు, ఏకే గోయల్ రూ.2.5 లక్షలు, ఎం రామ లక్ష్మణ్ కు రూ.93వేలు, బీవీ పాపారావుకు రూ.24వేలు, కేవీ రమణాచారికి రూ. రూ.27 లక్షలు, జీఆర్ రెడ్డికి రూ.75 వేలు, అప్పటి ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ ఐటీ చెల్లింపులకు రూ. 1.6 లక్షల ప్రజాధనాన్ని రాష్ట్రప్రభుత్వం వెచ్చించింది. ఇతర రాష్ట్రాల్లో సీఎం, మంత్రులు, సలహాదారుల ఐటీ చెల్లింపులు ప్రజాధనంతో చేయడం లేదు. తెలంగాణలోనే ఇది ఇంప్లిమెంట్ కావడం గమనార్హం. మంత్రుల ఐటీ చెల్లింపులు చేయరాదని హర్యానా, మధ్య ప్రదేశ్, పంజాబ్, ఛత్తీస్ ఘడ్, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాలు నిర్ణయించాయి. దీంతో మంత్రులు, సీఎం వారి ఐటీని వారి సొంత డబ్బుతో చెల్లిస్తున్నారు. దీని వల్ల ప్రజాధనం వ్యర్థం కావడం లేదు. దీనిపై సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ హైకోర్టులో పిల్ దాఖలు చేసింది

## బాసర ట్రిపుల్ ఐటిలో నేటితో దరఖాస్తులకు నేడు చివరితేదీ

**బాసర,జూన్ 20( వెలుతురు):**
బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సులో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువు జూన్ 21 చివరి తేదీతో ముగియనుంది. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొఫెసర్ ఏ. గోవర్ధన్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు 18,775 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ఆయన సూచించారు. జూలై 4న ప్రవేశ ఫలితాలు విడుదల చేయబడతాయి. జూలై 7న మొదటి విడత కౌన్సిలింగ్ ప్రారంభమవుతుంది. ఆర్జీయూకేటీ అందించే ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌కు రాష్ట్రం నలుమూలల నుంచి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. విద్యార్థులకు ఉచిత నివాస విద్య, ఆధునిక ప్రయోగశాలలు, నైపుణ్య అభివృద్ధి కేంద్రాలు వంటి అనేక వసతులు కల్పిస్తూ, ఈ విశ్వవిద్యాలయం విశిష్టతను చాటుకుంటోందని పేర్కొన్నారు.

# భద్రకాళి అమ్మవారి బోనాలు తాత్కాలికంగా వాయిదా

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ప్రకటన
- రాజకీయ విభేదాలను అమ్మవారికి ముడిపెట్టి ఇబ్బందులు సృష్టిస్తారనే నిర్ణయం

**హైదరాబాద్ వెలుతురు జూన్ 20:**
ప్రతిష్టాత్మకంగా వరంగల్ భద్రకాళి అమ్మవారికి బోనాలు నిర్వహించేందుకు గతంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. అయితే, ఇటీవల భద్రకాళి బోనాలకి సంబంధించి కొంతమంది నుంచి అభ్యంతరాలు వెలువడిన నేపథ్యంలో, పలు మాధ్యమాల్లో ఈ విషయంపై తప్పుడు వార్తలు ప్రచురితమైన దృష్ట్యా, ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని అనుకున్నట్లు స్పష్టం చేశారు. ప్రస్తుతం స్థానికంగా నెలకొన్న రాజకీయ విభేదాలను... పవిత్రమైన అమ్మవారికి ముడిపెట్టి కొంతమంది ఉద్దేశపూరితంగా ఇబ్బందులు సృష్టిస్తారమో అని... ఈ కార్యక్రమంలోకి అసాంఘిక శక్తులను ప్రేరేపించి గొడవలు సృష్టిస్తారన్న అనుమానంతో తాత్కాలికంగా బోనాలు నిర్వహణ రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా, భద్రకాళి అమ్మవారి



టెంపుల్ పరిధిలో శాఖాహార బోనాలే ఉంటాయని స్థానిక ఈఓ, వేదపండితులు, ప్రభుత్వం పలుమార్లు పునర్ఘాటించారని అన్నారు. ఆగమ శాస్త్రం ప్రకారమే, వేద పండితుల నిర్ణయం మేరకు భద్రకాళి టెంపుల్ లో నిర్వహించాలని అనుకున్నమాన్నారు. అయితే, కొంతమంది మాంసాహారంతో బోనాలు నిర్వహిస్తున్నట్టు చెప్పడంతో ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్ళాయని చెప్పారు. రాజకీయాల కోసం భక్తుల మనస్సుల్లో తప్పుడు భావాలు నింపడం సహేతుకం కాదన్నారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి సురేఖ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. 22వ తారీఖు భద్రకాళి అమ్మవారి టెంపుల్ లో నిర్వహించాలన్న బోనాలను తాత్కాలికంగా రద్దు చేయాలని భావించినట్టు వివరించారు. స్థానిక ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని... భక్తులకి ఎటువంటి ఇబ్బందులు కలగొద్దని ఈ నిర్ణయం తీసుకున్నామని, భద్రకాళి అమ్మవారి బోనాల నిర్వహణపై సంప్రదింపులు జరిపిన అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా భక్తులకు తెలియజేయదలచినది - అమ్మవారి పట్ల నిష్కల్మషమైన భక్తి, సంప్రదాయాల పరిరక్షణ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. కొంతమంది ప్రచారం చేసిన సమాచారం వల్ల ఏర్పడిన అపోహలకు తావులేదన్నారు. భద్రకాళి అమ్మవారి విశిష్టతను పెంపొందించేందుకు, ప్రభుత్వం వేద పండితుల సలహా మేరకు, ప్రజాప్రతినిధుల సూచనల ఆధారంగా తగిన సమయంలో బోనాలను వైభవంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉందన్నారు.

## రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం...

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కి నోటీసులిచ్చేందుకు సిద్ధమైన సిట్

శుక్రవారం రోజున సాయంత్రం కేంద్ర మంత్రికి ఫోన్ చేసిన సిట్ అధికారులు

మీ ఫోన్ ట్యాప్ అయ్యిందని వెల్లడించిన అధికారులు

విచారణకు సిద్ధంగా ఉండాలని కోరిన పోలీసులు

కేంద్ర మంత్రి వాంగ్మూలం తీసుకునేందుకు సమయం కోరిన పోలీసులు

షెడ్యూల్ చూసుకుని టైం చెబుతానన్న కేంద్ర మంత్రి



నేడో, రేపో నోటీసులు జారీ చేయనున్న పోలీసులు

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారాన్ని తొలుత తెరపైకి తీసుకొచ్చిన నేత బండి సంజయ్

కేసీఆర్ పాలనలో ఫోన్లను ట్యాప్ చేస్తున్నారంటూ పలుమార్లు ఆరోపించిన బండి సంజయ్

కుటుంబ సభ్యుల, వ్యక్తిగత సిబ్బంది, ప్రదాన అనుచరుల ఫోన్లను ట్యాప్ చేశారని పేర్కొన్న సంజయ్

కేసీఆర్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో అనేక ఉద్యమాలు, ఆందోళనా కార్యక్రమాలు నిర్వహించిన సంజయ్

బీజేపీ కార్యక్రమాలను భగ్నం చేసేందుకు బండి సంజయ్ తోపాటు కుటుంబ సభ్యుల, వ్యక్తిగత సిబ్బంది ఫోన్లను ట్యాపింగ్ చేసిన గత ప్రభుత్వం

ఫోన్ ట్యాపింగ్ ద్వారా సమాచారం తెలుసుకుని అర్ధరాత్రి సంజయ్ నివాసంపై దాడి చేసి టెన్త్ పేపర్ లీక్ పేరుతో అరెస్ట్ చేసిన పోలీసులు

కరీంనగర్ ఎంపీ ఆఫీసులో 317 జీవో సవరణ దీక్ష జరగకుండా నిలువరించేందుకు శతవిధాలా ప్రయత్నించి భంగపడ్డ పోలీసులు

రాజకీయంగా ఎదుర్కోలేక ఫోన్ ట్యాప్ తో తనను దెబ్బతీసేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారని పలుమార్లు సభల్లో, మీడియా వేదికల ద్వారా ఆరోపించిన బండి సంజయ్

భార్యాభర్తల సంభాషణలను కూడా ట్యాప్ చేసి నీచానికి ఒడిగట్టిందన్న సంజయ్

బండి సంజయ్ చెప్పిందంతా నిజమేనంటున్న సిట్ వర్గాలు

వందలాది మంది ఫోన్లు ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు నిర్ధారణ

సాక్షిగా బండి సంజయ్ వాంగ్మూలం తీసుకునేందుకు సిద్ధమైన పోలీసులు

బండి సంజయ్ వాంగ్మూలంపై సర్వత్రా నెలకొన్న ఆసక్తి

కరీంనగర్ వెలుతురు జూన్ 20:

# పోలవరంతో భద్రాచలం మునక

- రాముడు తెలంగాణలో..భూములు ఎపిలో
- ఎపిలో కలిపిన ఐదూళ్లు వెంటనే వెనక్కి ఇచ్చేయాలి
- తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత డిమాండ్

**హైదరాబాద్,జూన్20( వెలుతురు):**
పోలవరం నిర్మాణంతో భద్రాచలం పూర్తిగా మునిగిపోవడం ఖాయమని, అందుకే తాము పోలవరం ప్రాజెక్టు నిర్వహణ అంశాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే వ్యతిరేకించామని భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. అప్పట్లో తాము సుప్రీంకోర్టుకు వెళ్లి ఆపే ప్రయత్నం చేసినా ప్రాజెక్టు ఆగలేదని తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏపీ ప్రభుత్వం నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణకు ముంపుపై శుక్రవారం సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ జాగృతి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో కలిపిన గ్రామాల్లో ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలని, పురుషోత్తపట్నం, గుండాల, ఎట్టపాక, కన్నాయగూడెం, పిచ్చుకలపాక గ్రామాలు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆమె అన్నారు.పోలవరం వల్ల భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు ఏర్పడిందన్నారు. ఏపీలో కలిపిన పురుషోత్తపట్నంలో భద్రాచలం రాములవారి మాన్యం వెయ్యి ఎకరాలు ఉందని, ఆ వెయ్యి ఎకరాల దేవుడి మాన్యం ఆంధ్రాకు పోయిందన్నారు. దేవుడేమో తెలంగాణలో ఉన్నాడని.. అక్కడ




పట్టించుకునే పరిస్థితి లేక దేవుడి మాన్యం అన్యాక్రాంత మవుతోందన్నారు. దేవుడి మాన్యాన్ని పరిరక్షించాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. పోలవరం ముంపుపై సంయుక్త సర్వే నిర్వహించాలని కవిత అన్నారు.ఈ నెల 25న ప్రగతి ఎజెండా పేరిట ఏపీ, తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్ గడ్ సీఎంలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న సమావేశంలో ఈ అంశాన్ని చర్చించాలని, ఐదు గ్రామాలను వెనక్కి తీసుకొచ్చేలా సీఎం రేవంత్ రెడ్డి కేంద్రంపై ఒత్తిడి చేయాలని కవిత అన్నారు. కరకట్టల ఎత్తు పెంచుకుంటేనే భవిష్యత్తులో కూడా ఐదు గ్రామాలకు రక్షణ ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. లేదంటే ఎప్పుడైనా భారీ వరదలు వస్తే అన్ని గ్రామాలు మునిగిపోతాయన్నారు. అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టును ఆపే ప్రయత్నంలో తెలంగాణ జాగృతి సుప్రీం కోర్టును ఆశ్రయించిందన్నారు. 2014లో ప్రధాని మోదీ మొట్ట మొదటి క్యాబినెట్ సమావేశంలో ఏడు మండలాలను ఏపీలో కలపడానికి ఆర్డినెన్స్‌ను ఆమోదించి తెలంగాణకు అన్యాయం చేశారని విమర్శించారు. ఆ ఏడు మండలాలను అన్యాయంగా ఏపీలో కలిపారన్నారు. లోయర్ సిలేరు విద్యుత్తు ప్రాజెక్టును కూడా ఏపీకి అప్పజెప్పారని... బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసి చంద్రబాబు ఏడు మండలాలను తీసుకున్నారని విమర్శించారు. ఇది విభజన చట్టానికి, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని అప్పుడే పార్లమెంటులో మేము గళమెత్తామన్నారు. కేసీఆర్ బంద్‌కు పిలుపునిచ్చినా కేంద్రానికి చీమకుట్టినట్టుగా లేదన్నారు. పోలవరం స్పిల్ వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచుకోవడం వల్ల తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని, భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదంలో ఉందని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు సామర్థ్యం 36లక్షల క్యూసెక్కుల నుంచి 50లక్షల క్యూసెక్కులకు పెంచుకుంటూ పోవడంతో ముంపు పెరిగిపోతోంది. మానవీయ కోణంలో ఆలోచించి పరిష్కారం చేయాల్సిన అవసరముంది. పురుషోత్తమపట్నం, గుండాల, ఎటపాక, కన్నాయిగూడెం, పిచుకులపాడు గ్రామపంచాయతీ లను వెనక్కి ఇవ్వాలి. ఈ నెల 25న ప్రగతి ఎజెండా పేరిట 4 రాష్ట్రాల సీఎంలతో ప్రధానమంత్రి మోదీ నిర్వహిస్తున్న సమావేశంలో ఆ ఐదు పంచాయతీలను తిరిగి తెలంగాణకు ఇస్తున్నట్లు ప్రకటించాలని కవిత డిమాండ్ చేశారు.

## కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరాం

- పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్

**హైదరాబాద్,జూన్ 20( వెలుతురు):**
మాజీ ఎమ్మెల్సీ, మంత్రి కొండా సురేఖ భర్త కొండా మురళి వ్యాఖ్యలపై నివేదిక కోరామని, డీసీసీ పరిశీలకుడి నుంచి నివేదిక వచ్చాక స్పందిస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కొండా మురళి పరకాల సీటుపై రేవూరి ప్రకాశ్ రెడ్డిపై ఘాటు వ్ఆయఖ్యలు చేశారు. ఇకపోతే సంబంధం లేని పంచాయతీ ఎన్నికలపై రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడటం సరికాదని ఆయనకు సూచించినట్టు తెలిపారు. న్యాయస్థానంలో ఉన్న అంశంపై పొంగులేటి మాట్లాడటంపై తాను అభ్యంతరం



వ్యక్తం చేసినట్టు వివరించారు. పార్టీ కార్యకర్తలను ఉత్సాహపరిచేందుకు మాట్లాడిన మాటలే తప్ప వేరే ఉద్దేశం కాదని పొంగులేటి చెప్పినట్లు వివరించారు. న్యాయస్థానం తీర్పు తర్వాతనే పంచాయతీ ఎన్నికలు ఉంటాయని పీసీసీ అధ్యక్షుడు స్పష్టం చేశారు. మంత్రులైనా, ఎమ్మెల్యేలైనా తమ పరిధిలో లేని అంశాలను మాట్లాడవద్దని సూచించారు. ఇతరుల శాఖల్లో ఎవరూ జోక్యం చేసుకోవద్దని స్పష్టం చేశారు. విధానపరమైన అంశాల విషయంలో పార్టీపరంగా చర్చించి, మంత్రి మండలిలో నిర్ణయం తీసుకున్న అంశాలపై మాట్లాడితే ఎలాంటి అభ్యంతరం ఉండదని వివరించారు. అలా కాకుండా అంతర్గతంగా మాట్లాడుకున్న అంశాలను మీడియాతో మాట్లాడవద్దని మాత్రమే తాను చెప్పినట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గం ఉప ఎన్నికలో తానే అభ్యర్థిని అని అజహరుద్దీన్ మాట్లాడటంలో తప్పు లేదన్న మహేశ్‌కుమార్‌గౌడ్.. గతంలో పోటీ చేసినందున తిరిగి తననే పోటీలో నిలుపుతారన్న భావనతో చెప్పి ఉంటారని అభిప్రాయపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయాలన్న కృతనిశ్చయంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లు వివరించారు.

# సంపాదకీయం..

## ఆరోగ్య ప్రదాయిని యోగా !

నవ్వించడం యోగం..నవ్వకపోవడం రోగం అన్నారు. నవ్వుకూడా ఓ ఆరోగ్య ప్రక్రియ అని అందరూ తెలుసుకోవాలి. ఇకపోతే యోగా అన్నది భారతీయ జీవన విధానంలో ఉన్న ప్రాచీన ప్రక్రియ. ఇది శాస్త్రీయంగా రుజువు చేయబడింది. యోగాను పరిచయం చేసిన మనదేశం..ఇప్పుడు అంతర్జాతీయ యోగాను కూడా జరుపుకునేలా చేసింది. మనావులు ఎక్కడ ఉన్నా, ఏ స్థితితలో ఉన్నా యోగా వల్ల అనేకానేక రుగ్మతలను నిర్మూలించవచ్చు. యోగాతో శరీరం క్రమపద్ధతిలో మార్పు చెందడమే గాకుండా, జీర్ణప్రక్రియయతో పాటు, నాడీ వ్యవస్థను అదుపులో ఉంచుతుంది.. ఓ రకంగా చెప్పాలంటే యోగా అలవర్చుకున్న వారికి వారి శరీరం చెప్పినట్లుగా నడుచుకుంటుంది. విజ్ఞానశాస్త్ర ప్రకారం యోగా అంటేపరిపూర్ణ జీవనసార విధానం. భారతదేశం చేసిన ప్రయత్నంతో ఐక్యరాజ్యసమితి జూన్ 21న అంతర్జాతీయ యోగగా దినోత్సవంగా గుర్తించింది. దీంతో యోగాకు ప్రాధాన్యంతో పాటు, అంతర్జాతీ యంగా దీనిని ఆచరించే వారి సంఖ్య పెరిగింది. యోగా అనేది 5వేల సంవత్సరాల నుండి భారతదేశంలో ఉన్న జ్ఞానం యొక్కఅంతర్భాగంగా గుర్తించారు. యోగా చేస్తున్న వారిలో మానసిక, ఆరోగ్య సమస్యలు ఉండవని నిరూపితం అయ్యింది. నిత్యం యోగా చేసిన వారు ఆనందంగాను, ఉత్సాహంగానూ ఉండడాన్ని గమనించ వచ్చు. యోగ సూత్రాలను సరళంగా, వివరంగా, అందరికి అందుబాటులోనికి తీసుకురావటమే లక్ష్యంగా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అత్యంత లాభాన్ని నిజజీవితంలో ఎలా అనుభవించగలం అన్న అంశం మీద ఇది కేంద్రీకృతమై ఉంటుంది. ఆరోగ్య సమస్యలు గాని, భావావేశాలు గాని, వ్యక్తిగత జీవితం పైన ప్రభావాన్ని చూపుతుంటాయి. అలాంటి వారు యోగా సాధన ద్వారా ఉపశమనం పొందవచ్చని నిరూపింతం అయ్యింది. జీవన సరళిలో చిన్న చిన్న మార్పులతో సమస్యలని సహజంగానే అధిగామించడం సాధ్యమనికూడా తెలుసుకోవచ్చు. నిత్యంయోగా చేస్తూ ఆనందమయ జీవితం పొందడానికి ప్రతి ఒక్కరూ కనీసం ఓ అరగంటయినా కేటాయిస్తే మంచి ఫలితం దక్కవచ్చు. ఏటా అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జరుపుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించేందుకు ప్రయత్నంగా భావించాలి. యోగాతో మనస్సు, శరీరం అదుపులో ఉంటుందని కూడా నిరూపితం అయ్యింది. ఇది వేల ఏళ్లుగా ఈ ప్రక్రియ సాగుతోంది. అందుకే ఐక్యరాజ్యసమితి మన వినతిని గుర్తించి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రకటించింది. జూన్ 21నే యోగా దినోత్సవం జరుపుకోవడానికి గల కారణం ఆరోజు ఉత్తరార్ధ గోళంలో అత్యధిక పగటి సమయం కావడమే. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో ఆ రోజుకు ప్రత్యేకత కూడా ఉంటుంది. ఎక్కువ పగటి సమయం ఉన్న రోజుగా గుర్తింపుపొందడంతో అదేరోజును అంతర్జాతీయ యోగా దినోత్సవం గా జరుపుకోవాలని ఐక్యరాజ్యసమితికి ప్రధాని మోదీ సూచించారు. యోగా దినోత్సవం అందుబాటులోకి వచ్చాక దీనిని ఓ కార్యక్రమంగగా కాకుండా నిరంతర ప్రక్రియగా ఆచరించడం మొదల య్యింది. అనేక దేశాలు, దీనిని ఆరోగ్యంలో భాగంగా అమలు చేస్తున్నాయి. ముస్లిం దేశాలు సైతం దీని ప్రాధాన్యాన్ని గుర్తించాయి. దీర్ఘకాలిక రోగాలను సైతం అదుపు చేసే అవకాశం యోగా ద్వారా లభించగలదు. చాలా మంది యోగా అంటే శారీరక వ్యాయామము, కేవలం కొన్ని శారీరిక కదలికలు ,ఇంకా శ్వాస పక్రియ అని మాత్రమే అనుకుంటారు. నిజానికి మానవుని అనంత మైన మేధాశక్తి , ఆత్మశక్తిల కలయికగా నిరూపితం అయ్యింది. మానవుల ఆరోగ్యాన్ని,శరీరాన్ని, మనసును అదుపులో పెట్టుకునేలా రూపొందించిన అద్భుత ప్రక్రియ యోగ. ఇది ఎంతో ప్రాచీన కాలం నాటిది. రుషుల సాధనతో యోగా ప్రక్రియను రూపొందించారు. ఇది ప్రపంచానికి భారతదేశం అందించిన మహత్తర ప్రక్రియ. యోగాతో మనిషి శరీరం, మనస్సు, ఆరోగ్యం అదుపులో ఉండగలవు. దీనిలోజ్ఞాన యోగము (తత్వశాస్త్రము ), భక్తి యోగము , రాజ యోగం మరియు కర్మ యోగములు ఉన్నాయి. యోగాసనాలు అంటే రాజయోగ పక్రియలో పైన చెప్పిన యోగాలన్నిటిలో సమతౌల్యాన్ని , ఏకత్వాన్ని తీసుకువస్తాయి. యోగా అనేది ఆరోగ్యకరమైన శక్తిని పుంజుకునే ఆనందకర మైన అనుభూతి. ఇది సులభమైన, కష్టతర మైన శ్వాసపక్రియతో కూడుకున్నటువంటి పక్రియ. దీనిద్వారా శారీరక , మానసిక సమతౌల్యం ఏర్పడు తుంది. ఇది ఒక బహుముఖ ప్రజ్ఞానాన్నికలిగించే కార్యక్రమం. ఇందులో యోగాసనాలు, శ్వాస పక్రియ, యోగాకి సంబంధించిన జ్ఞానము. ఇంకా ధ్యానము పొందుపరుచబడి ఉంటాయి. శరీరం సౌష్టవంగా ఉండేందకు కూడా యోగా ఉపయోగపడుతుందిం. ఇది నేర్చుకునే విద్యార్థులకు తమను తాము ఇంటి వద్ద నే చేసుకోవచ్చు. ఇది క్రోతగా నేర్చుకునేవారికి,రోజు సాధన చేసుకునేవారికీ అన్నిరకముల వయసుల వారికి ఉపయోగ పడుతుంది. చేసేవారి జీవన విధానములో ఎన్నో గొప్ప మార్పులు చోటుచేసుకున్నాయి. దీర్ఘ కాలికమైన అనారోగ్యాల నుండి బయట పడ్డారు. నెర్చుకునే వ్యక్తులు వారి అనుభూతులని వివవరించారు. వారు ఎంతో సంతోషంగా, ఆతురత తగ్గి,ఓర్పు పెరిగి,కుశల బుద్ధి కలిగి, పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతున్నారు. ఇందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. యోగాలో ఉన్న అద్భుత మేమంటే యోగాసనాలు శరీరానికి ధృడత్వాన్ని, శక్తిని ఇస్తాయి. అందుకే పెద్దవారైన, చిన్నవారైన, ధృడంగాఉన్నవారైన,లేనివారైన ఆసనాలు వేయడానికి ఇష్టపడతారు. సాధన చేస్తున్న కొద్ది ఆసనాల వెనకాల ఉన్న అంతరార్థం బాగా అవగాహనకు వస్తుంది. ఆసనంలో ఉంటూనే బాహ్యా కరమైన శారీరక క్రమం నుంచి అంతరంగిక పరివక్రుత అనుభూతిలోకి వస్తుంది. యోగ ద్వారా గర్భిణుల ఆరోగ్యం కుదుట పడి, టెన్షన్‌ల నుంచి బటపడుతున్న తీరు చూస్తున్నాం. అలాగే ఎన్నోరకాల మానసిక రుగ్మతలకు యోగా ద్వారా పరిష్కారం దక్కుతోంది. యోగ మన జీవితంలోని అంతర్భాగమే. యోగ అనేది ఒక్కొక్క రకంగా అర్థమవుతుంది. యోగాలో ప్రధానమైనది ప్రాణాయామం. అనగా ఒకరి శ్వాస మీద పట్టు సాధించడం. ఇంకా శ్వాసను పీల్చే శక్తిని పెంచడం. సరైన శ్వాస పక్రియ శరీరంలోని అధిక ప్రాణవాయువును రక్తంలోనికి, మెదడులోనికి ప్రసరింపచేసి ప్రనసక్తిని పెంపొందిస్తుంది. ప్రాణాయామం అనేక యోగాసనాలు వేయటంలో దోహదపడుతుంది. ఈ రెండింటి సమ్మేళనము ప్రాణాయామం. యోగాసనాలు శరీరానికి మనస్సుకు స్వఛ్చతను, వ్యక్తిగత అనుసాసనాన్ని ఇస్తాయి. ప్రాణాయామం మెళకువ మనలను లోతైన లేదా ఘాధమైన ధ్యానములోనికి తీసుకువెళుతుంది. అందుకే విధిగా అంతా యోగాను అలవాటు చేసుకుంటే ఉత్తమమైన జీవన విధానం అలవడుతుంది.

# పాఠశాల స్థాయిలోనే యోగాకు ప్రణాళిక రావాలి

- పిల్లలకు యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభ్యం
- ఆరోగ్యకరమైన సమాజానికి ఇది ఎంతో అవసరం

**న్యూఢిల్లీ,జూన్20( వెలుతురు):**



ఆరోగ్యవంతమైన సమాజం కోసం పాఠశాలస్థాయి నుంచే యోగాను అలవాటు చేయాలన్న డిమాండ్ ఉంది. ప్రైవేట్ పాఠశాలల్లో ఇప్పుడిప్పుడే దీనిని ఓ క్లాస్‌గా గుర్తించి అలవాటు చేస్తున్నారు. సరస్వతీ శిశుమందిర్ లాంటి వాటిలో ఇది తప్పనిసరిగా ఉంటోంది. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వాలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాల్సి ఉంది. ఆట పాటలు, యోగాసనాలతో పిల్లల్లో మానసిక ఆరోగ్యం నింపేందుకు ముందుకు రావాల్సి ఉంది. క్రీడాంశాల్లో యోగగాను జోడించి అనేక ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నాయి. ప్రతి ఏటా విద్యాశాఖ ఉపాధ్యాయులకు పాఠ్యాంశాలపై పట్టు సాధించేందుకు అవసరమైన వృత్తి నైపుణ్యాలను అందిస్తోంది. ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించి మారిన పాఠ్యాంశాల ఆధారంగా బోధన తీరు మెరుగపడేలా చర్యలు తీసుకుంటుంది. ఎన్నో ఏళ్లుగా వ్యాయామ ఉపాధ్యా యులకు ఎలాంటి శిక్షణ తరగతులు లేవు. మారుతున్న కాలానుగుణంగా విద్యార్థుల ఆరోగ్యం, ఇతర అంశాలపై దృష్టిసారించలేక పోతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన విద్యాశాఖ వ్యాయామ ఉపాధ్యాయులకు నాలుగు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించింది. యోగా, ఆరోగ్యం, కరాటే, మానసిక అంశాలపై తర్ఫీదునిచ్చారు. విద్యార్థులకు ఆత్మస్థైర్యం పాఠాలు బోధించేలా చర్యలు చేపట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా వసతులు కరవయ్యాయి. ప్రార్థన చేసేందుకు స్థలం కొరత పీడిస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. ఏడాదిలో స్వాతంత్య, గణతంత్య వేడుకల సమయంలో తప్ప క్రీడా పోటీల ఊసేలేదు. ఆసక్తి ఉన్నా విద్యార్థుల్లో ప్రతిభ కనుమరుగవుతోంది. అప్పడప్పుడు మండల, జిల్లా స్థాయి పోటీలకు తప్ప రాష్ట్ర, దేశ స్థాయిలో గుర్తింపు కరవైంది. సగానికిపైగా పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలుగా దర్శనమిస్తున్నాయి. ఫలితంగా ప్రతిభావంతులైన విద్యార్థులు ప్రాధాన్యం లేక నిరాశకు గురవుతున్నారు. ఇన్నాళ్లుగా ఈ అంశాలకు దూరమైన పిల్లలకు సంపూర్ణత చేకూర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. మానసిక వికాసం, శరీర దారుఢ్యంతోపాటు మెదడు చురుకుదనంతో ఉండేలా సమగ్ర నిరంతర మూల్యాంకనం విధానంలో భాగంగా వ్యాయామ విద్యను తప్పనిసరిగా అమలు చేయాలని నిర్ణయించారు. యోగా, ఆత్మరక్షణ కోసం కరాటే, క్రీడలు, ఆర్యోగంతో సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తును చక్కదిద్దుకుంటారు. ఆటలతోపాటు వ్యక్తిగత ఆరోగ్య పాఠాలు బోధించాలి. క్రీడల్లో ఉత్తేజపూరితంగా తర్ఫీదు ఇచ్చేలా శిక్షణ ఇవ్వాలి.. ప్రతి రోజు వ్యాయామ, ఆరోగ్య విద్యను అమలు చేసేందుకు ప్రణాళికలు చేపట్టాలి. యోగాకు ప్రతి రోజు ఓ పీరియడ్ కేటాయించాలని సూచిస్తున్నారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రోజువారీగా నిర్ణయించిన ప్రణాళికను అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలి. క్రీడా మైదానాలను సిద్ధం చేయాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్న డిమాండ్లు ఉన్నాయి. ఇతర దేశాల్లో బాల్య దశలోనే ఆరోగ్యం, మానసిక ఉల్లాసాన్ని అందిస్తున్నారు. మన దగ్గర ఆటలాడు కోవాలనే ఆసక్తి ఉన్నా ఆట స్థలం కరువే...ప్రతిభ ఉన్నా శిక్షకుడి సేవలు దూరమే...ఎలాంటి శిక్షణ లేకున్నా ఏకలవ్యులా పలు పోటీల్లో విద్యార్థులు సత్తాచాటుతున్నారు. సగానికిపైగా పాఠశాలల్లో వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ...మరికొన్నిటికి పోస్టుల మంజూరు లేదు...విద్యార్థుల్లో మానసిక పరిపక్వత లోపిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడా వసతులు ఆందోళన కల్గిస్తున్నాయి. క్రీడా మైదానాలు లేని చోట సమీపంలో అందుబాటు లో ఉన్న స్థలాలను ఎంపిక చేసుకుని తీసుకోవాలి. సగానికిపైగా ఖాళీలు ఉండటంతో వీటిని భర్తీ చేయాలి.

క్రీడాకారుల ప్రయోజనం కోసం ఆట వస్తువులు, ఇతర వసతులు కోసం నిధులను కేటాయించాలి. విద్యాక మిటీ సభ్యులను భాగస్వాములను చేసి ప్రజా విరాళాలతో ముందుకుసాగేలా ప్రతిపాదనలు తయారు చేసుకోవాలి. ఉన్నత పాఠశాలల్లో వ్యాయామ విద్య అమలు చేస్తున్నప్పటికీ ప్రాథమికస్థాయిలో లేకపోవడం అన్యాయమే. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామ విద్యను పకడ్బందీగా అమలు చేస్తుండగా ప్రైవేటు పాఠశాలల పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకమే. పలు పాఠశాలలకు క్రీడా వసతులు లేవు. పాఠశాలల గుర్తింపునకు ముందు కనీస వసతులు ఉంటేనే అనుమతి పత్రం ఇవ్వాలి. నిబంధనలు పాటించకుండానే అనుమతులు ఇవ్వడంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ప్రార్థన చేసుకునేందుకూ స్థలం లేకపోవడం గమనార్హం. ప్రైవేటు పాఠశాలల్లో కూడా వ్యాయమ విద్య పక్కాగా అమలు చేస్తే క్రీడా వెలుగులు అందుతాయి.

# విశాఖ తీరంలో యోగోత్సవం

- నేడు ప్రధాని మోడీ సమక్షంలో అంతర్జాతీయ యోగా
- 6 కిలోమీటర్ల పొడవున యోగా విన్యాసాలకు ఏర్పాట్లు
- సుమారు పది వేల మంది పోలీసుల మోహరింపు

**విశాఖపట్టణం,జూన్20( వెలుతురు):**



ఈ నెల 21న విశాఖ వేదికగా జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల నిర్వహణకు రంగం సిద్ధం అయ్యింది. ప్రధాని మోడీ ఈ వేడుకలకు హాజరు కానుండడంతో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. దాదాపు 5 లక్షల మందితో గిన్నిస్‌బుక్ రికార్డు నెలకొల్పేలా ఏర్పాట్లు చేశారు. అందుకే అంతర్జాతీయ యోగా సందర్భంగా ప్రభుత్వం విపరీత ప్రచారం చేస్తోంది. 26 కిలోమీటర్ల మేర సాగే ఈ వేడుకలకు సుమారు ఎనిమిది వేల బస్సుల్లో జన సమీకరణకు పూనుకుంటోంది. ఇప్పటికే ఈ యోగాంధ్ర కోసం విశాఖ సాగర తీరం మెత్తాన్ని భద్రతా కారణాల రీత్యా మూసివేశారు. అత్యంత అట్టహాసం, ఆర్భాటంతో యోగా డేను నిర్వహించి గిన్నిస్ బుక్‌లోకి ఎక్కాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. టిడిపి, బిజెపి, జనసేన రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఏడాది తర్వాత యోగా పేరుతో విశాఖ కేంద్రంగా నిర్వహిస్తున్న ఈ భారీ యోగా డేకు భారీగా ప్రచారం చేపట్టారు. ఈ నేపథ్యంలో విశాఖ నగరం మీదుగా ప్రయాణాలు సాగించాలనుకునేవారు, రోజువారీ పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్లే కార్మికులు చాలా మంది తమ ప్రయాణాలను గురువారం మానుకున్నారు. శనివారం ఐదు లక్షల మంది నగరానికి ఒకేసారి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందన్నది ఊహించుకుంటేనే భయంగా ఉందని అంటున్నారు. విఐపిలు ఆశీనులయ్యే కాళీమాత టెంపుల్ నుంచి పార్క్ హోటల్ వరకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు కనిపిస్తున్నాయి. జనం యోగా చేసే ప్రాంతాల్లో టాయిలెట్లు, మంచినీరు, ఆహార ఏర్పాట్లను చేశారు. యోగాంధ్ర పేరుతో ఏర్పాట్లు, పది వేల మందితో పోలీస్ బలగాల మోహరింపు తదితరాలతో పరిపాలన అంతా సాగర తీరానికే రాష్ట్ర ప్రభుత్వం పరిమితం చేసింది. ట్రాఫిక్ డైవర్షన్ చేసి ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్న ప్రధాని మోడీ శుక్రవారం సాయంత్రం విశాఖలోని ఐఎన్ఎస్ డేగాకు చేరుకోనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాయంత్రం ఆరు గంటలకు ఐఎన్ఎస్ డేగాకు చేరుకుంటారు. తూర్పునౌకాదళం గెస్ట్‌హౌస్‌లో ప్రధాని బస చేస్తారు. 21న ఉదయం 6.25 గంటలకు ప్రధానిని చంద్రబాబు రిసీవ్ చేసుకుంటారు. ఏడు గంటల నుంచి 8.30 గంటల వరకూ బీచ్‌రోడ్డులో జరిగే యోగా డే వేడుకల్లో అంతా పాల్గొంటారు. విశాఖపట్నం ఎయు కన్వెన్షన్ హాలు నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాలు వరకు యోగా వాక్‌థాన్ నిర్వహించారు. ఇందులో మంత్రులు డోలా వీరాంజనేయ స్వామి, సత్యకుమార్ యాదవ్, సవిత పాల్గొన్నారు. విశాఖ వేదికగా ఈ నెల 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని, సాగరతీరంలో సరికొత్త రికార్డు సృష్టించేందుకు సహకరించాలని మంత్రులు కోరారు. స్పెషల్ సిఎస్ ఎమ్‌టి.కృష్ణబాబు మాట్లాడుతూ.. మూడు దశల్లో యోగాపై పోటీలు నిర్వహించామని, 25 లక్షల మందికి సర్టిఫికెట్లు జారీ చేశామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 126 మంది విజేతలుగా నిలిచారని, వారంతా ప్రధాని, ముఖ్యమంత్రితో పాటు ప్రధాన వేదికలో యోగాసనాలు వేస్తారని పేర్కొన్నారు.

# మన నేరెళ్లను మనమే మరిచామా?

- మిమిక్రీ కళకు ప్రాణం పోసిన వేణుమాధవ్
- ప్రపంచానికి ప్రతిభను చాటిన మహనీయుడు

**వరంగల్,జూన్20( వెలుతురు):**



మిమిక్రీ అనే కళను ప్రపంచానికి పరిచయం చేసి, దానిని ఐక్యరాజ్య సమితి వరకు తీసుకెళ్లిన ధీశాలి మన నేరెళ్ల వేణుమాధవ్ ధన్యజీవి. అంతటి మహానుభావుడు ఓ సామాన్యుడిలా మన కళ్లముందే నడయాడి మనలను వీడి వెళ్లారు. జూన్ 19న ఆయన వర్ధంతి. అయితే 19న పెద్దగా ఆయనను ఎవరూ పట్టించుకోలేదు. స్మరించుకోలేదు. ఆయన ప్రేమించి, ప్రవచించిన మిమిక్రీని సజీవంగా మనకందించారు. మిమిక్రీ ఉన్నన్నాళ్లు నేరెళ్ల వేణుమాధవ్ మనకు సాక్షాత్కరిస్తూనే ఉంటారు. వరంగల్ నుంచి ప్రారంభమైన నేరెళ్ల వేణుమాధవ్ మిమిక్రీ ప్రస్థానం ఐరాస వరకు వెళ్లిందంటే తెలుగువారిగా మనకన్న గర్వించేవారు ఉండరు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కాలంలోనే అమెరికాలో ప్రదర్శనకు అవకాశం రావడంతో ఆయన పేరు దేశ వ్యాప్తంగా మార్మోగినప్పుడు తెలుగువారి గుండెలు మరింత పులకించి ఉంటాయి. ఆనాటి ఘటనలు తలుచుకుంటే నేటికీ మనం పులకించకుండా ఉండలేం. ఓ కళను సృష్టించిన స్రష్ట ఆయన. దానిని శబ్దప్రక్రియగా ఓ సబ్జక్టుగా రూపొందించి భావి తరాలకు మార్గం చూపారు. అయినా పురాణాల్లోనే ఇలాంటి చాతుర్యం ఉందని, అదంత భగవత్ కృప అని చెప్పుకుని, తన గొప్పతనమేమీ లేదని చెప్పుకోవడం ఆయన ఉదాత్తకు తార్కాణం. తనకు అబ్బిన మిమిక్రీ కళను ప్రపంచ వ్యాప్తంగా సుమారు 30 దేశాల్లో ప్రదర్శనలుగా ఇవ్వడం ఒక ఎత్తయితే 1971లో ఐక్యరాజ్య సమితిలో ప్రపంచ ప్రముఖుల గొంతులను అనుకరించి ప్రపంచం దృష్టినీ ఆకర్షించడం మరొక ఎత్తు. తన గొంతులో వెయ్యి గొంతుకలను పలికించడం ద్వారా మిమిక్రీ కళను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కళాకారుడు తెలుగువాడయినందుకు... భారతీయుడైనందుకు మనమంతా గర్వపడాలి. పదో ఏటలోనే మిమిక్రీ కళపై మక్కువ పెంచుకున్న నేరెళ్ల తన ఆశయం మేరకు మిమిక్రీపైనే దృష్టి సారించి దానిని జగద్విఖ్యాతం చేయకుండా ఉండివుంటే ఇవాళ మిమిక్రీ అన్నది ప్రపంచానికి తెలిసేది కాదు. ఆయన జీవితం ఓ పాఠం. ఆధునిక తరానికి ఓ సక్సెస్ స్టోరీ. పోతన పుట్టిన ఓరుగల్లులో పుట్టిన మట్టిబిడ్డగా వేణుమాధవ్ తన గళం బలంతో ప్రపంచాన్ని శాసించారు. తొలితరం నటుడైన చిత్తూరు నాగయ్య స్వరాన్ని అనుకరించడం ద్వారా తన కళా ప్రస్థానానికి బాటలు వేసుకున్నది మొదలు ఆయన గొంతుకలో ఎందరి గొంతుకలు ఇమిడి పోయాయో చెప్పలేం. మహామహులే ఆయన గొంతుకకు పాదా క్రాంతులయ్యారు. ఉపాధ్యాయ వృత్తి చేపట్టినా..తనకు గుర్తింపు తెచ్చిన మిమిక్రీని మాత్రం వదలకుండా పెనవేసుకుని పోయారు. అలా మొదలైన ప్రస్థానం పది వేల ప్రదర్శనల వరకు కొనసాగిందంటే ఆయన పట్టుదల ఎంతటిదో అర్థం చేసుకోవచ్చు. మిమిక్రీకి ఏమాత్రం గుర్తింపు లేని రోజుల్లోనే ఆ కళపై మక్కువ పెంచుకుని దానికి అర్థం పరమార్థం చెప్పి ప్రపంచానికి పరిచయం చేసిన వ్యక్తి మన వేణు మాధవ్ ధన్యజీవి. ఆయన ప్రతిభాపాటవాలను గుర్తించిన భారత ప్రభుత్వం 2001లో పద్మశ్రీ పురస్కారాన్ని అందజేసింది. కాకతీయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్లు ఇచ్చి సత్కరించాయి. వివిధ రాష్టాల్లో( ఆయన లెక్కలేనన్ని పురస్కారాలు, సత్కారాలు అందుకున్నారు. తిరుపతిలో అభిమానుల నుంచి గజారోహణ సత్కారం అందుకున్నారు.

## కెసిఆర్‌ను విలన్ చేసే యత్నంలో హరీష్

- నీళ్లతో రాజకీయం చేసిన పార్టీ బిఆర్ఎస్
- జగన్‌తో కుమ్మక్కయి కృష్ణ జలాలకు తిలోదకాలు
- భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్




**హైదరాబాద్,జూన్20( వెలుతురు):**

బీఆర్ఎస్ నేత హరీష్ రావు వాళ్ల మామ.. మాజీ సీఎం కేసీఆర్‌ను విలన్ చేసే ప్రయత్నం చేస్తున్నారని ఎంపీ చామల కిరణ్ కుమార్ ఆరోపించారు. నీళ్ళు అనే పదంతో బీఆర్ఎస్ రాజకీయం చేసిందని, బీఆర్ఎస్ నేతలు బేసిక్ నాలెడ్జ్‌తో ప్రాజెక్టులు కడితే బాగుండేదని అన్నారు. కాళేశ్వరం కూలిన తర్వాత తెలంగాణ ప్రజలకు నీళ్ల సంగతి పూర్తిగా అర్థమైందని, 2016 సీడ్ల్యూసీ మీటింగ్‌లో కేసీఆర్ ఏం మాట్లాడారో చెప్పాలన్నారు. కేసీఆర్‌కు ఉన్న అపరజ్ఞానం వల్లే కాళేశ్వరం కూలేశ్వరం అయిందని విమర్శించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడారు. జగన్ రెడ్డితో నాలుగు సార్లు మంతనాలు జరిపి తెలంగాణ నీళ్లకు అన్యాయం చేసింది కేసీఆర్ అని, హరీష్ రావు వైఖరి వల్లే ఏపీ నేతలు బనకచర్లకు నీళ్ళు తరలించుకుందామనే ఆలోచన చేశారని చామల కిరణ్ అన్నారు. గోదావరి జలాలపై గొంతు చించుకునే బీఆర్ఎస్ నేతలు.. కృష్ణా జలాలపై ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. హరీష్ రావుకు కంటెంట్ కంటే ఎక్కువ ఆవేశమే ఉందని, బీఆర్ఎస్ నేతలు సీఎం కుర్చీలో రేవంత్ రెడ్డిని చూడలేక పోతున్నారని అన్నారు. నదీ జలాలు ఎవరి అయ్యా జాగీరు కాదని హరీష్ రావు తెలుసుకోవాలన్నారు. నీళ్ళ అంశంపై తనకు, కేసీఆర్‌కు తప్పా ఎవరికీ ఏం తెలియదని హరీష్ అనుకుంటున్నారని, తెలంగాణ నీటిని ఏపీకి ధారాదత్తం చేసిందే కేసీఆర్ అని చామల కిరణ్ ఆరోపించారు. హరీష్ రావు ఇరిగేషన్ మంత్రిగా ఉన్నప్పుడే ఈ పంచాయితీ మొదలైందన్నారు. బనకచర్ల విషయంలో కేంద్రం వినకపోతే సుప్రీంకోర్టు మెట్లు ఎక్కుతామని ప్రకటించిన సీఎం రేవంత్ రెడ్డి కమిట్‌మెంట్ అర్థం చేసుకోవచ్చునని అన్నారు. బనకచర్లపై ఏకగ్రీవ తీర్మాణం చేద్దామని అనుకునే సమయానికి ఆల్ పార్టీ మీటింగ్ నుండి బీఆర్ఎస్ ఎంపీ వాకౌట్ చేసారన్నారు. బేస్ వదిలి దోచుకునే ప్రయత్నం చేశారు కాబట్టే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టారన్నారు. బేసిక్స్ కాదు తమకు ఎథిక్స్ ఉన్నాయి కాబట్టే ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టారని ఎంపీ చామల కిరణ్ అన్నారు.

## మహిళా ప్రొఫెసర్ల సమస్యలను పరిష్కరించాలి

- ప్రభుత్వానికి మహిళా మెడికల్ ప్రొఫెసర్ల వినతి

**హైదరాబాద్,జూన్ 20( వెలుతురు):**

మహిళా ప్రొఫెసర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మెడికల్ కాలేజీ మహిళా ప్రొఫెసర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా పాలనలో మెడికల్ కాలేజీ మహిళా ప్రొఫెసర్ల మొర ఎవరూ ఆలకించడం లేదని వాపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు రాగానే మాండేటరీ ట్రాన్స్‌ఫర్లు అంటూ ఉస్మానియా, గాంధీ, కాకతీయ మెడికల్ కాలేజీల ప్రొఫెసర్లను చెట్టుకు ఒకరిని పుట్టకు ఒకరిని ట్రాన్స్‌ఫర్ చేశారని తెలిపారు. గత 4-11 సంవత్సరాలుగా మహబూబ్ నగర్, నిజామాబాద్, అదిలాబాద్, సిద్దిపేట, సూర్యాపేట, నాగర్ కర్నూల్, వనపర్తి, జగిత్యాల, నల్గొండ మెడికల్ కాలేజీల్లో, ఒకే చోట పని చేస్తున్న ప్రొఫెసర్లను హెల్త్ సెక్రటరీ, ఆరోగ్య శాఖ మంత్రి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తమ భర్తలు మానసికంగా వేధిస్తున్నారని, ట్రాన్స్‌ఫర్లు లేని ఉద్యోగం ఏంటని అని అవహేళన చేస్తున్నారని వాపోయారు. మహిళా ప్రొఫెసర్లు ఉదయం పది గంటల నుండి రాత్రి 7:30 వరకు హెల్త్ సెక్రటరీ ఆఫీస్ ముందు నిలబడినా అపాయింట్ మెంట్ ఇవ్వలేదని పేర్కొన్నారు. మనం ప్రజా పాలనలో ఉన్నామా లేక తాలిబన్ల పాలనలో ఉన్నామా అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్య శాఖ మంత్రికి విన్నవించినా ఫలితం లేదని తెలిపారు. మిగతా చాలా శాఖల్లో బదిలీలు అవసరం లేకపోవచ్చు, కానీ మెడికల్ కాలేజీల్లో ప్రొఫెసర్లకు మాత్రం బదిలీలు అత్యవసరమన్నారు.

## నగరంలోని పారామౌంట్ కాలనీలో పోలీసులు కార్డన్ సెర్చ్

- వీసా గడువు ముగిసినా ఇక్కడే తిష్టవేసిన విదేశీయులు
- 18మంది అక్రమంగా ఉంటున్నట్లు గుర్తించిన పోలీసులు
- వారిని డిపోర్ట్ చేస్తామని ప్రకటించిన సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ

**హైదరాబాద్,జూన్20( వెలుతురు):**

హైదరాబాద్ నగరంలోని పారామౌంట్ కాలనీలో శుక్రవారం తెల్లవారు జామున పెద్దఎత్తున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించడంతో ఉద్రిక్తత నెలకొంది. అక్రమ చట్టవ్యతిరేక కార్యకలాపాలు, విదేశీయుల అక్రమ నివాసాలపై ఆధారంగా పోలీసులు ఈ ఆపరేషన్ చేపట్టారు. సుమారు 150 మంది పోలీసులు తెల్లవారుజాము 3 గంటల సమయంలో ఈ కాలనీని చుట్టుముట్టి సోదాలు ప్రారంభించారు. లా అండ్ ఆర్డర్, టాస్క్ ఫోర్స్, హెచ్ఎన్‌యూ, ఏఆర్ విభాగాలకు చెందిన పోలీసులు ఈ తనిఖీలలో పాల్గొన్నారు. ఈ సెర్చ్‌లో నైజీరియా, ఇథియోపియా, కెన్యా, సోమాలియా దేశాలకు చెందిన వలసదారులు పెద్దఎత్తున ఉన్నట్లు గుర్తించారు. వీరిలో చాలామంది భారతదేశం వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా నివసిస్తూ ఇల్లీగల్ కార్యకలాపాల్లో భాగం అవుతున్నట్లు పోలీసుల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తనిఖీల్లో మొత్తం 18 మంది విదేశీయులు వీసా గడువు ముగిసినప్పటికీ అక్రమంగా జీవిస్తున్నట్లు గుర్తించారు. వారిని గుర్తించిన పోలీసులు త్వరలోనే డిపోర్ట్ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సోదాల సందర్భంగా డాక్యుమెంట్లు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 50కి పైగా బైకులు, 5 కార్లను పోలీసులు సీజ్ చేశారు. అంతేకాక, గుట్టుచప్పుడు కాకుండా నడిపిస్తున్న బెల్ట్ షాపులు, హుక్కా సెంటర్లను గుర్తించి పెద్ద ఎత్తున మద్యం బాటిళ్లు, గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. మద్యం అక్రమ నిల్వలు బయటపడటంతో, స్థానికంగా నడుస్తున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలపై మరింత దృష్టి పెట్టనుని పోలీసులు అన్నారు. ఈ సందర్భంగా సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ చంద్రమోహన్ మాట్లాడుతూ, 'పారా మౌంట్ కాలనీలో కార్డన్ సెర్చ్‌తో పాటు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించాం. వీసా గడువు ముగిసినా ఇక్కడే ఉండిపోయిన విదేశీయులను గుర్తించాం. వారి వివరాలు సేకరించి, త్వరలోనే డిపోర్ట్ చేయనున్నాం. మాదకద్రవ్యాల విషయంలో మేము చాలా సీరియస్‌గా ఉన్నాం. ఈ సెర్చ్‌లో డ్రగ్స్ లభించలేదు. కానీ భవిష్యత్‌లో ఇలాంటి కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటాం' అని తెలిపారు. ఈ కార్డన్ సెర్చ్‌తో నగరంలోని ఇతర అనుమానస్పద ప్రాంతాల్లో కూడా ఇలాంటి తనిఖీలు జరపనున్నట్లు పోలీసులు సంకేతాలు ఇస్తున్నారు. విదేశీయుల పేరుతో జరుగుతున్న అక్రమ కార్యకలాపాలపై పూర్తిస్థాయిలో పట్టు సాధించేందుకు ఇది ఒక ముందడుగుగా మారింది.

# కేసీఆర్, కేటీఆర్ లను వెంటనే అరెస్ట్ చేయాలి

- ఔటర్ టెండర్లలో రూ.7,380 కోట్ల అవినీతి జరిగినా పట్టించుకోరా..?
- ఐఆర్బీ ఇన్ ఫ్రా సంస్థకు కాంట్రాక్టు ఇవ్వడమే పెద్ద స్కామ్
- బాండ్ల ద్వారా బీఆర్ఎస్ క్విడ్ ప్రోకో
- కైటెక్స్ కాంట్రాక్టులోనూ అక్రమాలు
- ప్రజాధనం లూటీ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- ఏసీబీకి బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ విజ్ఞప్తి





**హైదరాబాద్ వెలుతురు జూన్ 20:**

ఔటర్ రింగ్ రోడ్డు టోల్ లీజు టెండర్లు మరియు కైటెక్స్ గార్మెంట్స్ యూనిట్ల ఏర్పాటులో భారీగా అవినీతి జరిగినా పట్టించుకోరా...? అని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ప్రశ్నించారు.మేరకు హైదరాబాద్ బంజారాహిల్స్ లోని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)డీజీని కలిసి...కేసీఆర్ , కేటీఆర్ లతో పాటు బీఆర్ఎస్ కు చెందిన ఇతర ముఖ్యనేతలపై వెంటనే కేసు నమోదు చేసి త్వరితగతిన విచారణ జరపాలని కోరారు. అనంతరం ఆయన ఏసీబీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ...ఔటర్ టోల్ టెండర్ పొందిన ఐఆర్బీ ఇన్ ఫ్రా సంస్థ నుంచి, కైటెక్స్ గార్మెంట్స్ నుంచి బీఆర్ఎస్ పార్టీకి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో పెద్ద మొత్తంలో నిధులు అందాయని పేర్కొన్నారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్.. క్విడ్ ప్రోకోకు పాల్పడటం ద్వారా అధికారాన్ని దుర్వినియోగం చేశారని తెలిపారు. ఐఆర్బీ ఇన్ ఫ్రా సంస్థకు 30 ఏళ్లపాటు ఔటర్ టోల్ వసూళ్లను అప్పగించడం పెద్ద కుంభకోణం అని, ఇందులో రూ.7,380 కోట్ల అవినీతి జరిగిందని అన్నారు. నిర్వహణ ఖర్చు ఎక్కువ అయ్యే ప్రాంతాన్ని హెచ్ఎండీఏ పరిధిలో ఉంచి, ఆదాయం వచ్చే మార్గాన్ని ఐఆర్బీ ఇన్ ఫ్రా సంస్థకు కట్టబెట్టారని తెలిపారు. 2023 ఏప్రిల్ 27న ఐఆర్బీకి ఔటర్ టోల్ కాంట్రాక్ట్ దక్కితే.. 2023 జూలై 4న ఐఆర్బీ సంస్థ రూ.25 కోట్ల ఎలక్ట్రోరల్ బాండ్లు కొనుగోలు చేసి బీఆ రఎస్ పార్టీకి ఇచ్చిందని, వారం రోజుల్లోనే ఆ డబ్బును బీఆర్ఎస్ విత్ డ్రా చేసుకుందని వివరించారు. తద్వారా క్విడ్ ప్రోకో చోటుచేసుకుందని పేర్కొన్నారు. వరంగల్, రంగారెడ్డి జిల్లాలో కైటెక్స్ గార్మెంట్స్ యూనిట్ల ఏర్పాటు విషయంలోనూ ఇలాగే క్విడ్ ప్రోకో జరిగిందన్నారు. 2023 జూన్ 16న వరంగల్ కైటెక్స్ కంపెనీ రూ.15 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు కొంటే.. మర్నాడే బీఆర్ఎస్ పార్టీ వాటిని ఎన్ క్యాష్ చేసుకుందని వెల్లడించారు. రంగారెడ్డి జిల్లాలోనూ కైటెక్స్ కంపెనీ 2023 సెప్టెంబరు 12న రూ.10 కోట్ల ఎలక్ట్రోరల్ బాండ్లు కొనుగోలు చేసి బీఆర్ఎస్ పార్టీకి ఇవ్వగా, అక్టోబరు 16న ఆపార్టీ వీటిని ఎన్ క్యాష్ చేసుకుందని చెప్పారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని, వేల కోట్ల రూపాయల ప్రజాధనం లూటీ చేసిన కేసీఆర్, కేటీఆర్ పై వెంటనే కేసులు నమోదు చేసి త్వరితగతిన విచారణ జరిపి అరెస్ట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు గోటూరి రవీందర్ గౌడ్, వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు గూడుషా, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, కొత్తకోట మండల అధ్యక్షులు అంజన్న యాదవ్, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రేనట్ల మల్లేష్ ,చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షులు ముత్యాల వినోద్ సాగర్, మ్యాదరి రాజ, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పుడు ప్రచారాలు పైశాచిక ఆనందాలు

- నైతికత లేని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- బిఆర్ఎస్ హయాంలో చితికిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన రేవంత్ రెడ్డి
- కెటిఆర్ తీరుపై మండిపడ్డ టీపీసీసీ నేత డాక్టర్ ప్రసాద్ సాగరపు



**హైదరాబాద్, వెలుతురు జూన్ 20 :**

తెలంగాణ రాష్ట్రానికి పదేళ్ల పాటు మంత్రిగా పనిచేసిన కల్వకుంట్ల తారక రామారావు కాంగ్రెస్ పాలన కంటిలో నలుసులా పరిణమించిందని టీపీసీసీ నేత డాక్టర్ ప్రసాద్ సాగరపు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ పదునైన పద ప్రయోగాలతో మాటల గారడీతో తెలంగాణ యాసతో, అనేక రకాల మాండలికాలతో తెలంగాణ ప్రజలను మత్తులో ముంచే విధంగా గమ్మత్తుగా మాట్లాడుతుంటాడని అన్నారు. తెలంగాణలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నా అవి కల్వకుంట్ల గడీల్లోనే పుట్టాయనే భ్రమలను కల్పిస్తుంటారన్నారు. ఎలాంటి అభివృద్ధైనా బీఆర్ఎస్ తోనే సాధ్యం అనే బిల్డప్ కేటీఆర్ ఇచ్చుకుంటారని విమర్శించారు. అందుకే కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని కేటీఆర్ జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. గులాబీ హయాంలో చితికి పోయిన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహర్నిషలు శ్రమిస్తున్నారు. దావోస్ వరల్డ్ ఎకనమిక్ ఫోరంలో పాల్గొని హైదరాబాద్ నగరంలో అనేక పరిశ్రమల స్థాపనకు అవకాశం కల్పించారు. సీఎం రేవంత్ రెడ్డి పరిశ్రమల స్థాపనతో రాష్ట్ర ఆదాయం పెరగడంతో పాటు యువతకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్న సత్సంకల్పంతో సీఎం రేవంత్ రెడ్డి శక్తి వంచన లేకుండా శ్రమిస్తున్నారని అన్నారు. ఇందులో భాగంగా హైదరాబాద్ లో వివిధ పారిశ్రామిక సంస్థల ఏర్పాటుకు ఒప్పందాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకుందన్నారు. అందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలను పట్టుకుని నకిలీ ఒప్పందాలుగా అభివర్ణించే కుటిల ప్రయత్నం కేటీఆర్ అండ్ టీం చేస్తున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం దిగ్గజ కంపెనీలతో ప్రతిష్టాత్మక ఒప్పందాలు చేసుకుందన్నారు. అందులో మన్ కిన్ బయో, స్వచ్ఛ్ బయో, వాల్ష్ కర్రా, యంత్రా టెక్ కంట్రోల్స్ వంటి అంతర్జాతీయ కంపెనీలతో ఎమ్ఓయూ లు కుదుర్చుకుందన్నారు. విధి విధానలు తొలి దశలోనే ఉన్న తరుణంలో ఊరూపేరూ లేని కంపెనీలుగా అభివర్ణిస్తూ తప్పుడు ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో ప్రజాధరణ పొందుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి కేటీఆర్ తట్టుకోలేకపోతున్నట్టు తెలుస్తోందన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందడం, పరిశ్రమలు నెలకొల్పడం, ఆదాయ వనరులు పెంపొందించుకోవడం కేటీఆర్ కు ఏమాత్రం గిట్టని అంశంగా తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ఎక్కడ ప్రగతి పథంలో దూసుకెళుందోననే అభద్రతా భావంలో కేటీఆర్ కొట్టుమిట్టాడుతున్నట్టు తెలుస్తుందన్నారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాల పట్ల గానీ, డైనమిక్ పరిపాలన పట్ల గానీ కేటీఆర్ ఆందోళన పడుతున్నట్టు తెలుస్తోందన్నారు.

# సన్న వడ్ల బోనస్ కూడా బోగసే

- ఇంకా విడుదల కాని రూ. 1,161 కోట్లు బోనస్ మొత్తం
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు



**హైదరాబాద్,జూన్ 20( వెలుతురు):**


సన్న వడ్ల బోనస్ కూడా బోగస్ అయింది.. సన్న వడ్ల బోనస్‌పై సన్నాయి నొక్కులేనా అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. యాసంగిలో సన్నాల కొనుగోలు పూర్తయినా రూ. 1,161 కోట్లు బోనస్ ఇంకా విడుదల చేయకపోవడం దుర్మార్గం అని మండిపడ్డారు. 4.01 లక్షల మంది రైతుల నుంచి 23.22 లక్షల టన్నుల సన్నాలు సేకరించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బోనస్ చెల్లించలేదు. రాష్ట్రంలో పొద్దు తిరుగుడు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. సన్ ఫ్లవర్ కొనుగోలు పూర్తయి 75 రోజులు దాటినా కూడా రైతుల ఖాతాలో డబ్బులు జమ కాకపోవడం రైతుల పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి అద్దం పడుతున్నది. ఒక సిద్దిపేట జిల్లాలోనే 50 శాతం రైతులకు డబ్బులు ఇవ్వలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సన్‌ఫ్లవర్ రైతుల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. పంట కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వేస్తామని ప్రగల్బాలు పలికిన మంత్రి గారు. రెండు నెలలు దాటినా ఇప్పటికీ రైతుల ఖాతాలో డబ్బులు జమ కాకపోవడం శోచనీయం. వెంటనే రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 1,116 కోట్ల సన్నాల బోనస్ డబ్బులతో పాటు సన్ ఫ్లవర్ రైతులకు పంట కొనుగోలు డబ్బులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. రైతులను గోస పెట్టడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటుగా మారింది. ప్రతీచోట రైతులు రో÷-డడెక్కే పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల ముందు అబద్ధపు హామీలు, గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన మీరు, పాలన కూడా అదే అబద్దాలతో నడిపిస్తున్నారు. అడుగడుగునా ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం బయటపడుతోంది. రుణమాఫీ 50 శాతం రైతులకి కూడా అందలేదు. పోయిన వానకాలం రైతు భరోసా ఎగ్గొట్టారు. యాసంగిలో రైతు భరోసా సగం మందికి కూడా ఇవ్వలేదు. ఎన్నికల ముందు 15 వేల రైతు భరోసా అని చెప్పి మాట తప్పి 12,000కి పరిమితం చేశారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా అని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు. రైతు కూలీల పరిస్థితి అయితే అధోగతే. ఎన్నికల హామీల్లో అన్ని పంటలకు బోనస్ అని చెప్పి రైతులను మభ్యపెట్టి ఇప్పుడేమో సన్నాలకి పరిమితం చేసి ఆ సన్నాలకు కూడా ఎగనామం పెట్టారు అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా, యాసంగిలో కొనుగోలు చేసిన సన్నాలకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం బోనస్ చెల్లించకపోవడం రైతులను వంచించడమే. ఎంతో కష్టపడి పంట పండించినా, అది ప్రభుత్వ కొనుగోళ్లు లేక దళారుల పాలవుతోంది. కొనుగోలు చేసిన పంటలకు డబ్బులు ఇవ్వకపోవడంతో ప్రభుత్వం రైతులను మరింత దయనీయ స్థితికి నెడుతున్నది. యాసంగిలో బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తే తప్ప కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాని దుస్థితి. ఈ ప్రభుత్వ చేతగానితనం, నిర్లక్ష్యం కారణంగా రాష్ట్ర రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు అని హరీశ్‌రావు మండిపడ్డారు. పంట పెట్టుబడి సహాయం అందించడంలో వైఫల్యం. పండించిన పంటకు గిట్టుబాటు ధర కేటాయించడంలో వైఫల్యం. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో వైఫల్యం. ధాన్యం కొనుగోలు చేయడంలో వైఫల్యం. కొన్న ధాన్యానికి డబ్బులు చెల్లించడంలో వైఫల్యం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే రాష్ట్రంలో కొనుగోలు చేసిన సన్ ఫ్లవర్ పంటకు డబ్బులు విడుదల చేయాలని, అదేవిధంగా సన్నాలకు బోనస్ డబ్బులు కూడా విడుదల చేయాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

## కాళేశ్వరం దండగమారి ప్రాజెక్ట్

- దానిపై మరిన్నినిధులు వృధా చేయడం తగదు
- సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్,జూన్20( వెలుతురు):**

కాళేశ్వరం ప్రాజెక్టు దండగమారి ప్రాజెక్ట్ అని, దానిపై అనవసరంగా నిధులు వృధా చేయవద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగిందని, ఇంకా నష్టాలను ప్రజలపై రుద్దవద్దన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు తీసేసి.. వాటిలోని పైపులను వాడుకోవాలని సూచించారు. ఆ మూడు బ్యారేజీల మరమ్మతులకు రూ.20వేల కోట్లు ఖర్చు అవుతోందని, అంత ఖర్చు పెట్టినా వరద ఉధృతి వల్ల బ్యారేజీలు కొట్టుకుపోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారని అన్నారు. ఆ మూడు ప్రాజెక్టులకు పెట్టే ఖర్చుకు బదులు ప్రాణహిత పూర్తి చేస్తే సరిపోతుందని అభిప్రాయపడ్డారు. 3 ప్రాజెక్టులు తీసేయడం వల్ల కేవలం రూ.10వేల కోట్ల నష్టం వస్తుంది. వీటికి మరమ్మతులు చేసే బదులు శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టులో గోదావరిపై 14 చిన్న ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం వృథా అని నేను చెప్పలేదు. కేవలం ఆ మూడు బ్యారేజీలపై మాత్రమే మా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాం. తెలంగాణను సంప్రదించకుండా ఏపీ



సీఎం చంద్రబాబు ప్రాజెక్టులు చెపడుతున్నారు. బనకచర్ల ప్రాజెక్టును ఆపేయాలి. పరివాహక ప్రాంతాల వారీగా నిబంధనల మేరకు నీటి వాటాలు జరగాలి. ఇద్దరు సీఎంలు కూర్చొని బనకచర్ల ప్రాజెక్టుపై మాట్లాడుకోవాలన్నారు. నీటి ప్రాజెక్టులపై రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదు. పోలవరం ప్రాజెక్టు కడుతున్న ఏపీకి కొత్త ప్రాజెక్టులు ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే కూనంనేని కోరారు. ఉన్న ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలన్నారు.

# ప్రజల సమస్యలపై అభివృద్ధి పనుల కోసం ప్రశ్నిస్తే తప్పేంటి

## బిజెపి జిల్లా నాయకులు గోలి రాజు నోముల శంకర్ గౌడ్




**వెలుతురు న్యూస్, అమ్రాబాద్ జూన్ 20:**
అమ్రాబాద్ మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మెయిన్ రోడ్లు వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నుండి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అభివృద్ధి పనుల కోసం శంకుస్థాపనచేసి ఐదు నెలలు గడుస్తున్న పనులు ముందుకు సాగకపోవడంతో నిరసన వ్యక్తం చేస్తే అమ్రాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు బిజెపి నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని బిజెపి జిల్లా నాయకులు గోలి రాజు నోముల శంకర్ గౌడ్ లు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలలో ప్రశ్నించే గొంతులను విమర్శించే పద్ధతి సరైనది కాదని స్థానికంగా అందరము కలిసికట్టుగా ఉండి ఈ ప్రాంత అభివృద్ధి కోసం పని చేయాలి తప్ప చౌకబారు విమర్శలు చేస్తూ రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం సరైనది కాదని అన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులకు గుర్తు చేస్తున్నాం. ఈ ప్రాంతంలో ఉన్న నాయకులు గత ప్రభుత్వాల నిర్లక్ష్యం అని మాట్లాడడం తగదని ఇది ప్రజలు గుర్తిస్తున్నారు.కానీ గతాన్ని గురించి మాట్లాడకుండా ప్రస్తుత అమ్రాబాద్ మండలాన్ని అభివృద్ధి చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసి మన ముఖ్యమంత్రి నిర్మల రేవంత్ రెడ్డి మాచారం సభలో నల్లమల్ల డిక్లరేషన్ లో మాట్లాడినట్లుగా ప్రపంచంలోనే అమ్రాబాద్ మండలాని అభివృద్ధిలో గుర్తింపు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు.దానికి భారతీయ జనతా పార్టీ నాయకులు కూడా అనుకూలంగా ఉంటారని. ఈ ప్రాంత సమస్యలపై ప్రశ్నిస్తే పక్క పార్టీతో కుమ్మక్కై మాట్లాడుతున్నారని మాట్లాడడం సిగ్గుచేటని మండిపడ్డారు చౌకబారు రాజకీయాలు చేస్తున్న నాయకులారా బిజెపి ఏ ప్రభుత్వం ఉన్నా ప్రజల పక్షాన ప్రజల గొంతుకై ఉద్యమాలు చేస్తుందని కావాలంటే బిజెపి నాయకుల గత సోషల్ మీడియా లోకి వెళ్లి గత ప్రభుత్వాలను కూడా ప్రశ్నించిన విధానాన్ని చూసి మాట్లాడితే బాగుంటుందని అన్నారు.ప్రజల పక్షాన పోరాడిన ఏకైక పార్టీ బిజెపి పార్టీ అని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి అమ్రాబాద్ మండల అధ్యక్షులు బొడ్డుపల్లి శ్రీనివాస్ బిజెపి జిల్లా నాయకులు నోముల చంద్రయ్య గౌడ్, గాదే అశోక్ కుమార్, పగిడి పాల అనిల్, గోలి శివ, మాధగోని సతీష్ కుమార్ ,జంపుల క్రాంతి, నోముల లక్ష్మీనారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బిల్లులు చెల్లించే వరకు పోరాటం కొనసాగిస్తాం

## - సుర్వి యాదయ్య గౌడ్





**హైదరాబాద్ వెలుతురు జూన్ 20:**
ఇంద్ర పార్క్ లో సర్పంచుల సంఘం ప్రతినిధులు సమావేశం జరిగింది సమావేశంలో గ్రామాలలో అభివృద్ధి పనులు చేసిన పెండింగ్ బిల్లులు ప్రభుత్వ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి పార్టీ కేంద్ర కార్యాలయంలో తెలంగాణ మాజీ మంత్రివర్యులు వి శ్రీనివాస్ గౌడ్ వినతిపత్రం అందజేయడం వారు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కేటాయించి సర్పంచులు అభివృద్ధి పనులు చేసిన పెండింగ్ బిల్లులు చెల్లించి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు జరిగింది సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ తెలంగాణ సర్పంచ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనరసింహారెడ్డి ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ గుంటి మధుసూదన్ రెడ్డి రాంపాక నాగయ్య కేశబోయిన మల్లయ్య నెమలి సుభాష్ గౌడ్ మెడబోయిన గణేష్ రాజేందర్ బొల్లం శారద బీరప్ప దుర్గం నరేష్ యాదవ్ అంజయ్య గౌడ్ పాండురంగారెడ్డి కే వెంకటరామిరెడ్డి అరుణ్ కుమార్ హేమలత రవీందర్ రెడ్డి కొండ ప్రకాష్ ఇతరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోట్ బుక్స్ అందించిన ఎం. ఉదయ టీచర్



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 20**
ప్రాథమిక పాఠశాల కొమ్మాయిగూడం నందు మన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం. ఉదయ మేడం తన యొక్క ఆర్థిక సహకారంతో, సుమారు 4000 రూపాయల వ్యయంతో మన పాఠశాల విద్యార్థిని విద్యార్థులందరికీ నోటు పుస్తకాలను బహుకరించడం జరిగింది.ఇట్టి సహాయ సహకారాలకు పాఠశాల తరపున ప్రత్యేకమైన హృదయపూర్వక కృతజ్ఞతలు,తెలియజేస్తున్నాం.మన గ్రామ ప్రజలు ఒక్కసారి ఆలోచించండి. మేము పలుమార్లు మీ ఇల్లు సందర్శించి మీ పిల్లలను మా పాఠశాలలో చేర్పించవలసిందిగా మనవి చేశాము.కానీ ఏ ఒక్కరు కూడా చొరవ తీసుకో లేకుండా ప్రైవేట్ పాఠశాలలే మాకు ముద్దని పంపిస్తున్నారు. ఒక్కసారి ఆలోచించండి.మేము నాణ్యమైన విద్య అందించడానికి, పిల్లలకు మెరుగైన బోధన చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేస్తూ, విన్నవించుకుంటున్నాం. మీరు సరైన ఆలోచనతో సరైన నిర్ణయం తీసుకొని ఇప్పటికైనా మీ పిల్లలను మన ప్రభుత్వ బడిలో చేర్పించవలసిందిగా కోరుకుంటున్నాం.

# మా గుర్తింపు మాకు ఇవ్వాల్సిందే రేవంత్....!?

- కాంగ్రెస్ కార్యకర్తలను గుర్తించకుంటే కాలం చెల్లినట్టే...!?
- గ్రామల నుండి మీ సీఎం, మంత్రుల పదవుల వరకు కేసులు ఎదుర్కొన్నాం..!
- బిఆర్ఎస్ పెట్టిన నరకయాతనను అనుభవించాం...!
- పోలీస్ లాటిలను ఒంటిపై విరగ్గొట్టించుకున్నాం..!
- ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని నిలబెట్టాం...!
- కాంగ్రెస్ అంటేనే ప్రజాస్వామ్యం అని గొంతెత్తి చెప్పాం...!
- మీపై నమ్మకం ఒమ్ము కాకుండా చూసుకోండి...!
- గత బిఆర్ఎస్ బాట వీడండి...! ఎందుకంటే
- ఉద్యమకారులను మరిచింది కనుకే నేడు బిఆర్ఎస్ కు ఈ గతి...!
- కార్యకర్తలే కాంగ్రెస్ బలం మీనాక్షి నటరాజన్ మాట నిలబెట్టుకుంటుందా...!?




**డాక్టర్ మురహరి బుద్ధారం**
సీనియర్ జర్నలిస్ట్, ఐ ఎన్ టి యు సి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు రాస్తున్న బహిరంగ లేఖ 9441739988

హైదరాబాద్ వెలుతురు జూన్ 20, 2025:
తెలంగాణ...! దేశంలో ఏండ్ల తరబడి ఎదురు తిరిగిన రాష్ట్రం...! రాష్ట్ర సాధన కోసం ఎదురు నిలబడి, ఎన్నో ప్రాణాలను అర్పించిన రాష్ట్రం...! నీళ్లు నిధులు, నియామకాలు, ప్రాంతం ప్రాంతాభిమానం అంటూ అందరి మన్ననలు పొంది అవతరించిన రాష్ట్ర తెలంగాణ రాష్ట్రం...! ఈ క్రమంలో ఏర్పాటు అయిన రాష్ట్రము రాక్షస పాలన నుండి విముక్తి ప్రజా పాలనగా ప్రజలచేత కీర్తింప బడుతుంది అనుకునే క్రమంలో చింత చచ్చిన పులుపు చావదు అన్న చందంగా బి ఆర్ ఎస్ కు మేము తక్కువేమి కాదు అన్న చందంగా తెలంగాణ సర్కార్ పాలన కొనసాగుతుంది అనేలా ప్రజల ఆశలపై నీళ్లు చల్లుతున్న గడ్డు పరిస్థితులప్రదర్శనగా పాలన కొనసాగటం సీఎం చేతిలో పాలనను మంత్రుల కుతంత్రంతో సాఫీగా కొనసాగనివ్వక పోవటం.. ప్రజల్లో సహనం కోల్పోయేలా సహచరులకు ప్రాధాన్యం ఇవ్వటం నిత్యం ఏదో ఒక కుట్రతో ప్రజాక్షేత్రం యుద్ధక్షేత్రంలా స్టేషన్ల గడపలు తట్టటం, చోటా నాయకుల చెప్పుచేతల్లో నియోజకవర్గాల ప్రజల బ్రతుకులు గడవటం, కట్టెవిరగని పాము చావని పరిస్థితిలో సమస్య చిన్నదైనా..! వారి దయనందన జీవితంలో ఓ పెద్ద పెనుమార్పులా చూపటంతో ఎవరిని నమ్మాలో మరెవరిని నమ్మరాదో తెలియని దారుణ బ్రతుకుజీవనం గడపటంతో ప్రజా పాలనపై ప్రజల్లో వ్యతిరేక ధోరణి ప్రారంభం అయ్యిందని కళ్ళకు అద్దం పట్టినట్టు కనిపిస్తుంది.

## మార్పు మొదలైంది...!?

కావున ప్రజల్లో స్థానిక చోటా నాయకుల ప్రభావం, బిఆర్ఎస్ వలసవాదుల పెత్తనం, గత దుర్మార్గపు పాలనను సైతం ఎదురొడ్డి నిలిచిన పార్టీని నిలబెట్టిన అనేకమంది హార్డ్ కోర్ కాంగ్రెస్ కార్యకర్తలను పక్కన పెట్టటం, తో అనేకమంది కార్యకర్తలు దారుణంగా ఇబ్బందులు ఎందుర్కొంటున్నారు. ఇదిలా ఉంటే ఉమ్మడి మెదక్, ఉమ్మడి మహబూబ్ నగర్, నిజామాబాద్, కరీంనగర్ వంటి జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశాలు మెండుగా ఉన్నప్పటికీ ఓటమిని చవి చూసిన కొందరు మూర్ఖుల వలే ప్రభుత్వం మాది ఓడినా మేము ఎమ్మెల్యే లమే అంటూ కార్యకర్తలతో నిస్సిగ్గుగా ప్రగల్బాలు పలకటం చూస్తుంటే ఈ దద్దమ్మలకు టిక్కెట్ ఎందుకిచ్చిందా పార్టీ అని నిర్మొహమాటంగా మాట్లాడుకుంటున్న పరిస్థితి పార్టీకి అతిపెద్ద ఇబ్బందిగా మారింది. ఎందుకంటే ఓటమి లో కూడా కార్యకర్తలతో వారి ప్రవర్తన మారకపోవటం దీనికి అత్యంత ప్రధాన కారణం. ఇక నూతనంగా గెలిచిన ఎమ్మెల్యే ల పరిస్థితి మంత్రుల సమన్వయలోపంతో ఇండిపెండెంట్ అభ్యర్థుల విధానాన్ని ఫాలో అవుతున్న పరిస్థితి కొందరిదైతే, సీనియర్ కాంగ్రెస్, జూనియర్ కాంగ్రెస్, హార్డ్ కోర్ కాంగ్రెస్, వలస కాంగ్రెస్ అంటూ అత్యంత నీచమైన స్థానిక రాజకీయాలు పట్టణాల్లో చేయటంతో గ్రామాల్లో బూతు స్థాయిలో పార్టీ పట్టుత్వం కోల్పోతుంది. కావున ఇంచార్జి మంత్రులకు ఖచ్చితమైన ఆదేశాలు జారీ చేస్తూ పార్టీ బలోపేతమే ప్రత్యేక ఎజెండాగా ముందుకు వెళ్లాలని లేని పక్షంలో మనుగడ అసాధ్యం అని నిర్మొహమాటం ప్రతి నియోజకవర్గంలో ఆదేశాలు జారీ చేయాలని ఈ బహిరంగ లేక రాయటమైనది.

# డిగ్రీ అడ్మిషన్లు ఈనెల 25 వరకు గడువు పెంపు

## కొండనాగుల శ్రీ ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పరంగి రవి




**వెలుతురు న్యూస్, అమ్రాబాద్ /బల్మూరు జూన్ 20:**
ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు తమ అడ్మిషన్లు చేసుకొనుటకు కొండనాగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని నాగర్ కర్నూల్ జిల్లా బల్మూరు మండలం కొండనాగుల గ్రామంలోని శ్రీ ఉమామహేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పరంగి రవి తెలిపారు.మా కళాశాలలో మూడవ విడత డిగ్రీ అడ్మిషన్లు ఈనెల 25వ తేదీ వరకు గడువు పెంచడం జరిగినదని ఆయన అన్నారు. అన్ని హంగులతో కొనసాగుతున్న కొండనాగుల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రస్తుత 2025-26 విద్యా సంవత్సరంలో (NCC) “నేషనల్ క్యాడెట్ కార్ప్స్” ప్రారంభమైందని, దీనిని సద్వినియోగం చేసుకొని ఉద్యోగ0 పొందాలని విద్యార్థులకు విజ్ఞప్తి చేశారు. దోస్త్ వెబ్సైట్ ద్వారా శ్రీ ఉమా మహేశ్వరీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లను అందజేస్తున్నామని ప్రిన్సిపల్ సూచించారు. ఇప్పటికే రెండవ విడత అడ్మిషన్ల ప్రక్రియ పూర్తికాగా.. మూడవ విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని, ఈనెల 25వ తేదీ వరకు కొనసాగుతుందని.. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. కళాశాలలో బిఏ, బీకాం, బీఎస్సీ ఎంపీసీ, బిజెడ్సి కోర్సులు అందుబాటులో ఉన్నాయని వారు తెలిపారు.డిగ్రీ అడ్మిషన్ దోస్తు సందేహాలకు క్రింది ఫోన్ నంబర్స్ 94 92209234, 6300292563, సంప్రదించాలని కోరారు.

# చండూరు మున్సిపాలిటీ 9వార్డు లో ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



**చండూరు వెలుతురు జూన్ 20:**
ఇందిరమ్మ ఇళ్లు వచ్చినందుకు లబ్దిదారాలు అయిన నాంపల్లి శోభా శేఖర్ ఆనందం వ్యక్తం చేశారు తనకు కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని నిజమైన పేదలకు లబ్ది చేకూరుతుందని తెలియజేశారు

# చేనేత సహకార సంఘాలకు ఉన్న క్యాష్ క్రెడిట్ ను మాఫీ చేయాలి.



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 20**
చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ ను మాఫీ చేసి నూతన క్యాష్ క్రెడిట్ లు మంజూరు ఇప్పించి చేనేత సహకార సంఘాలను బ్రతికించాలని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, టిస్ డిడి సి చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి వారి నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగినది.ఈ సందర్భంగా చేనేత రాష్ట్ర నాయకులు రాపోలు నరసింహ, సిరిపురం చేనేత సహకార సంఘం అధ్యక్షులు అప్పం రామేశ్వరం, చౌటుప్పల్ చేనేత సహకార సంఘం అధ్యక్షులు కందగట్ల బిక్షపతి, నకిరేకల్ చేనేత సహకార సంఘం అధ్యక్షులు చిలుకూరి లక్ష్మీ నరసయ్య, మోత్కూరు చేనేత సహకార సంఘం అధ్యక్షులు జల్ది రాములు చేనేత సమస్యలు తెలియజేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా చేనేత సహకార సంఘాలకు ఉన్న క్యాష్ క్రెడిట్ కేవలం 50 కోట్ల రూపాయల లోపు మాత్రమేనని ఈ క్యాష్ క్రెడిట్ లు మాఫీ చేసి నూతన క్యాష్ క్రెడిట్ లు మంజూరు చేపిస్తే చేనేత సహకార సంఘాలు మరల పునర్ వైభవం చెందుతాయని చేనేత కార్మికులకు పని కల్పించే అవకాశం దొరుకుతుందని అన్నారు.ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్ రెడ్డి టీఎస్ డిడీసీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి ఇట్టి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి, తప్పకుండా క్యాష్ క్రెడిట్ మాఫీ చేయించి నూతన క్యాష్ క్రెడిట్ లు మంజూరు ఇప్పించి, చేనేత సహకార సంఘాల పునర్ వైభవానికి కృషి చేస్తామని అన్నారు.

# ఆయిల్ ఫామ్ పంట పై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

- ఆయిల్ ఫామ్ లాభసాటి పంట,
- ప్రభుత్వం సబ్సిడీలు ఇస్తుంది
- రైతులు ఉపయోగించుకోవాలి
- ఉద్యానవన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు కవిత, నాగరాజు




**చౌటుప్పల్, జూన్ 20 (వెలుతురు) :**
ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను ఉపయోగించుకొని రైతులు ఆయిల్ ఫామ్ పంటను సాగు చేసి అధిక లాభాలను గడించాలని ఉద్యానవన శాఖ అధికారి కే కవిత, మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు లు తెలిపారు. చౌటుప్పల్ మండలంలోని నక్కలగూడెం గ్రామంలో రైతు వాకిటి యుగేందర్ రెడ్డి తోటలో శుక్రవారం రైతులందరితో కలిసి ఆయిల్ పామ్ పంట పైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు కవిత, నాగరాజు లు మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంట అవశ్యకత, వాటి లాభాలు, గవర్నమెంట్ నుండి వచ్చే సబ్సిడీలు, తోటల యాజమాన్య పద్ధతులు ఎరువుల వాడకం, నీటి యాజమాన్యం, కొమ్మల కత్తిరింపులు అంతర పంటలు, అంతరకృషి చర్యలు, పుష్పాలను తొలగించడం, అబలేషన్ ప్రాక్టీసెస్ గురించి క్లుప్తంగా రైతులకు వివరించారు. యాజమాన్య పద్ధతులను క్రమానుసారంగా పాటిస్తే నాణ్యమైన, అత్యధిక పంట దిగుబడులను సాధించవచ్చునని తెలిపారు. ఆయిల్ పామ్ పంటను ప్రస్తుతం వాణిజ్య పంటగా సాగు చేయడం జరుగుతుందని, పంట వేసిన 4వ సంవత్సరం నుండి ఆయిల్ పామ్ లో పంట చేతికి అంది వస్తుందని, ఈ పంట సాగులో మొదటి నాలుగు సంవత్సరాలు అంతర పంటగా పెసర, పత్తి, మిర్చి, బొప్పాయి, వేరుశనగ వంటి పంటలను సాగు చేసుకుని రైతు ఆదాయం పొందవచ్చునన్నారు. ఈ పంట సాగుతో రైతుకు ఎకరాకు 1.5 నుండి 2 లక్షల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉన్నందున ఈ పంటను సాగు చేయడం ఎంతో లాభదాయకం. ఈ పంట సాగులో చీడపీడల సమస్య, కోతుల బెడద, ప్రకృతి వైపరీత్యాల సమస్య ఉండదు. దళారీ వ్యవస్థ కూడా ఉండదు. ఎకరాకు 57 మొక్కల చొప్పున రాయితీపై 20 రూపాయలకే రైతుకు అందజేయడం జరుగును. డ్రిప్పు పైపులకు కూడా రాయితీలు అందించబడును. ఎస్సి ఎస్టిలకు 100శాతం, బీసీలకు 90శాతం, ఓసీలకు 80 శాతం రాయితీతో డ్రిప్పు పైపులు సరఫరా చేయబడును. తోట నిర్వహణ, యాజమాన్య ఖర్చుల కొరకు, అంతర పంట సాగు కొరకు ప్రభుత్వం నుండి రైతుకు నాలుగు సంవత్సరాల వరకు ఎకరానికి సంవత్సరానికి రూ. 4,200 లు చొప్పున రైతు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కవిత, నాగరాజు లు తెలిపారు. కార్యక్రమంలో డీసీవో ప్రవీణ్, పీఎంఓ శ్రీరామ్, ఫీల్డ్ ఆఫీసర్ హరీష్, రైతులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ లో అడిషనల్ కోర్టు, సబ్ కోర్టులను ఏర్పాటు చేయాలి

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటాచలపతి

**చౌటుప్పల్, జూన్ 20 (వెలుతురు) :**
చౌటుప్పల్ లో అడిషనల్ కోర్టును, సబ్ కోర్టు లను ఏర్పాటు చేయాలని చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాల్యం వెంకటాచలపతి కోరారు. బార్ అసోసియేషన్ విస్తృతస్థాయి సమావేశం చౌటుప్పల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు బాల్యం వెంకటాచలపతి అధ్యక్షతన బార్ అసోసియేషన్ హాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలు తీర్మానాలు చేసి ఆమోదించారు. చౌటుప్పల్ లో అదనపు న్యాయస్థానాన్ని, సబ్ కోర్టును, కోర్టు నూతన భవన సముదాయ నిర్మాణానికి సంబంధిత హైకోర్టు న్యాయమూర్తులను కలిసి విజ్ఞప్తి చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు, బార్ అసోసియేషన్ ఆదాయ, వ్యయాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అదేవిధంగా స్థానిక శాసనసభ్యులు, న్యాయశాఖ మంత్రి గతంలో ఇచ్చిన వినతి పత్రాలపై పునర్ సమీక్ష చేసి బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం, కోర్టు భవన సముదాయాల నిర్మాణానికి, అదనపు కోర్టుల మంజూరీ కోసం



విస్తృతంగా ప్రయత్నం చేయాలని, బార్ అసోసియేషన్ హాల్లో మౌలిక వసతుల ఏర్పాటు కొరకు విస్తృతంగా చర్చించి ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పడమటి మహిపాల్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ స్వాతి, కోశాధికారి జెల్ల రమేష్, క్రీడలు సాంస్కృతిక కార్యదర్శి జెక్కర్తి శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి దేశగోని శ్రీశైలం, కార్యవర్గ సభ్యులు పిల్లలమర్రి కిరణ్, ఎండి ఖయ్యూం పాషా, మాజీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఊడుగు శ్రీనివాస్, తాడూరి పరమేష్, సీనియర్ న్యాయవాదులు ముత్యాల సత్తిరెడ్డి, తడక మోహన్, కానుగు వెంకటయ్య, రాధా కిషన్ రావు, వాకిటి నరసింహారెడ్డి, పాల పరమేశం, నర్రి స్వామి, జంపాల శ్రీశైలం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ రవీందర్ రావు, డాక్టర్ భూంరెడ్డి కుటుంబాలను పరామర్శించిన కేంద్ర మంత్రి బండి సంజయ్











## ఆర్ఎస్ఎస్ ప్రముఖులు దక్షిణామూర్తిని పరామర్శించిన బండి సంజయ్

### బీజేపీ కార్యకర్తలకు పరామర్శ

**కరీంనగర్ వెలుతురు జూన్ 20:**

కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు బోయినపల్లి మండలం కోరెం గ్రామంలో పర్యటించారు. ప్రముఖ వైద్య నిపుణులు, ఎంతో మందికి వైద్య సేవలందించిన డాక్టర్ సీహెచ్. రవీందర్ రావు ఇటీవల మరణించిన నేపథ్యంలో కోరెం గ్రామంలోని రవీందర్ రావు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా రవీందర్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు కరీంనగర్ లో ఇటీవల అనారోగ్యంతో మరణించిన డాక్టర్ భూంరెడ్డి నివాసానికి వెళ్లారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భూంరెడ్డి కుమారుడితోపాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. డాక్టర్ భూంరెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఎంతో మంది పేదలకు వైద్య సాయం అందించిన డాక్టర్ భూంరెడ్డి, డాక్టర్ రవీందర్ రావుల మరణం బాధాకరమని ఈ సందర్భంగా బండి సంజయ్ పేర్కొన్నారు. మరోవైపు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రముఖులు బూర్ల దక్షిణామూర్తి మాతృమూర్తి ఇటీవల మరణించిన నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా ఎలిగేడులోని వారి నివాసానికి వెళ్లారు. దక్షిణామూర్తిని పరామర్శించారు. అట్లాగే ఇటీవల మరణించిన కరీంనగర్ లోని గాయత్రినగర్ బీజేపీ బూత్ అధ్యక్షులు వెంకటరమణ కుటుంబాన్ని, ఇటీవల ప్రమాదవశాత్తు గాయపడ్డ చర్లబూత్కూర్ బీజేపీ కార్యకర్త జడ కుమార్ లను సైతం కేంద్ర మంత్రి బండి సంజయ్ పరామర్శించారు.

# నర్సిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ మాధవరెడ్డి తదితరులు

- కాసర్ల నర్సిరెడ్డి ఆశయాలను సాధించాలి
- మార్కెట్ చైర్మన్ వెంకటయ్య, మాజీ చైర్మన్ డాక్టర్ మాధవరెడ్డి



**చౌటుప్పల్, జూన్ 20 (వెలుతురు) :**

చౌటుప్పల్ మున్సిపాలిటీలోని లక్కారం నీటి సంఘం మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాసర్ల నర్సిరెడ్డి ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, మార్కెట్ మాజీ చైర్మన్, రాజీవ్ స్మారక ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ రావుల మాధవరెడ్డి కోరారు. మున్సిపాలిటీలోని లక్కారం గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సంతాప సభలో పార్టీలకు అతీతంగా పలువురు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని కాసర్ల నర్సిరెడ్డి చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం, ప్రధానంగా రైతుల సమస్యల పరిష్కారం కోసం నర్సిరెడ్డి చేసిన కృషి మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తాడూరి వెంకట్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెల్గ రాజశేఖర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, ఏసీపీ మధుసూదన్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ సైదులు గౌడ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, తిరుపతి రవీందర్, నీటి సంఘం మాజీ చైర్మన్ కంచరకుంట్ల వెంకట్ రెడ్డి, ఇన్స్పెక్టర్ మన్మధకుమార్, ఆకాష్ ఫౌండేషన్ చైర్మన్ దుబ్బాక ఆకాష్ రెడ్డి, నాయకులు దుబ్బాక శశిధర్ రెడ్డి, కానుగు బాలరాజు, కంచరకుంట్ల రాంరెడ్డి, గుండెబోయిన వెంకటేష్, కొంతం దామోదర్ రెడ్డి, అనంతరెడ్డి, ముత్యాల మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ లో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలి

- లింగస్వామి మాదిగ

**చౌటుప్పల్, జూన్ 20 (వెలుతురు) :**

చౌటుప్పల్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ను ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయ లింగస్వామి మాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల ప్రాంత పరిధిలో గత 30 సంవత్సరాలుగా డిగ్రీ కాలేజీ లేక ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల అగ్రవర్ణ పేద ప్రజలు విద్యకు దూరమవుతూ ఇబ్బందులకు గురవుతున్నారని, గతపాలకులు ఈ ప్రాంత అభివృద్ధి గురించి పట్టించుకోలేదని, హైదరాబాదుకు కూతవేటు దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న ఇప్పటివరకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గురించి పట్టించుకోకపోవడం బాధాకరమని, ఇప్పటికైనా ప్రభుత్వ పెద్దలు ఈ ప్రాంతంలో ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని, లేనియెడల భవిష్యత్తులో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని లింగస్వామి మాదిగ పేర్కొన్నారు.

# 56వ డివిజన్ భాగ్యనగర్ లో రచ్చబండ సమావేశం



**కరీంనగర్ వెలుతురు జూన్ 20:**

నగర పశ్చిమ జోన్లోని 56 వ డివిజన్ మరియు 37వ డివిజన్ శక్తి కేంద్రం ఇన్చార్జీలు ఏన్నం ప్రకాష్, వరాల దేవేందర్ ఆధ్వర్యంలో శనివారం భాగ్యనగర్ లో రచ్చబండ సమావేశం నిర్వహించారు, సమావేశముఖ్య అతిథి శానగొండ శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ ప్రధాని మోడీ 11 సంవత్సరాల సుపరిపాలనలో భారతదేశం ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా, వేగంగా అభివృద్ధి చెందుతూ దేశ ప్రజలకు కావలసిన సౌకర్యాలు కల్పిస్తూ దేశాన్ని ముందుకు నడిపిస్తున్న మోడీ గారికి భారత ప్రజలు జేజేలు పలుకుతున్నారని తెలిపారు, పశ్చిమ జోన్ మాజీ అధ్యక్షులు నరహరి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరించి ,కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపిస్తే ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ సర్కార్ విఫలమైందని అన్నారు, ఎన్నం ప్రకాష్ మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో మేయర్ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి బిజెపి అభ్యర్థులను గెలిపించుకోవలని బూత్ స్థాయి నుండి కార్యకర్తలు కష్టపడి పని చేయాలని తెలిపారు సమావేశంలో సీనియర్ కార్యకర్తలు బండారీ శ్రీనివాస్, కొంగల రాజిరెడ్డి, పాశం నరసింహారెడ్డి, బూత్ అధ్యక్షులు గోలి సత్యనారాయణ రెడ్డి, గాదగోని రమేష్, ఆకారపు శ్రీనివాసరెడ్డి, దేవేందర్ రెడ్డి, రాజు, మెరుగు పరశురాము, వంగల రవీందర్, ముదిగంటి ప్రవీణ్, కుసుంబ ఆదర్శ్, మురళి మనోహర్, తాడూరి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు

# రాగి ఆకుపై యోగా చిత్రం

**వెలుతురు నారాయణఖేడ్ జూన్ 20 :**




నారాయణఖేడ్ నియోజకవర్గం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ రావి ఆకులపై జూన్ 21 సందర్భంగా 21 ఆసనాలు చిత్రాలతో ప్రత్యేక శుభాకాంక్షలు ప్రతి వ్యక్తి కూడా ప్రతిరోజు యోగా చేసినట్లయితే సంపూర్ణ ఆయురారోగ్యంతో ఉండగలుగుతారు ఇప్పుడు ఉన్నటువంటి సమాజానికి ఒత్తిడి అలసట ఎంత కూడా రెస్ట్ లేకుండా మనిషి శరీరానికి ఎంతో అలసిపోతున్నారు దానికి ఒకటే మార్గం యోగ ఒక మంచి సాధనంగా పనిచేస్తుంది ప్రతి ఒక్కరికి కూడా తెలియజేసేదేందంటే తప్పనిసరిగా ఉదయం సాయంత్రం ప్రశాంతమైన వాతావరణంలో యోగా చేసినట్లయితే ప్రతి ఒక్కరు కూడా ఆరోగ్యంగా జీవించడానికి అవకాశం ఉంటుంది మరియు ప్రతిరోజు యోగా చేద్దాం ఆరోగ్యంగా ఉందాం భారతీయ ప్రజలందరికీ అందరికీ కూడా అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు రావి ఆకులపై నేను వేసిన చిత్రాలతో.

# బండి సంజయ్ టార్గెట్ గా నాటి కేసీఆర్ ప్రభుత్వ అరాచకాలు

**సంజయ్ సన్నిహితుల, సిబ్బంది ఫోన్లను సైతం ట్యాప్ చేసిన పోలీసులు**

**సిట్ విచారణలో ఒక్కొక్కటిగా వెలుగు చేస్తున్న విషయాలు**

**బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు ఫోన్ ట్యాప్ చేసినట్లు నిర్ధారణ**

**ప్రవీణ్ రావుకు ఫోన్ చేసిన సిట్ పోలీసులు**

**నోటీసులు పంపిస్తాం... వచ్చి వివరణ ఇవ్వాలని సమాచారమిచ్చిన జూబ్లిహిల్స్ పోలీసులు**

**317 జీవో, టెన్త్ పేపర్ లీకేజీ, బైంసా అల్లర్లుసహా రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పలు ఘటనల్లో సంజయ్ తోపాటు వెన్నంటే ఉన్న ప్రవీణ్ రావు**

**కరీంనగర్ వెలుతురు జూన్ 20:**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో అనేక మంది రాజకీయ నేతల ఫోన్లను ట్యాప్ చేశారనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ విచారణ చేస్తున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తున్న బండి సంజయ్ లక్ష్యంగా 100కు పైగా కేసులు నమోదు చేసిన విషయం విదితమే.

తనను రాజకీయంగా ఎదుర్కోవడం చేతగాని బీఆర్ఎస్ ప్రభుత్వం చట్టవిరుద్ధంగా తన ఫోన్ తోపాటు తన కుటుంబ సభ్యుల, సిబ్బంది ఫోన్లను కూడా ట్యాప్ చేశారంటూ బండి సంజయ్ గతంలో పలుమార్లు కేసీఆర్ ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు నిజమని తేలింది.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫోన్ ట్యాపింగ్ పై విచారణ చేస్తున్న సిట్ బృందం బండి సంజయ్ ఫోన్ ను కూడా ట్యాప్ చేసినట్లు గతంలోనే నిర్ధారించింది. తాజాగా ఆయన వ్యక్తిగత సిబ్బంది, సన్నిహితుల ఫోన్లను సైతం ట్యాప్ చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈరోజు సిట్ పోలీసులు బండి సంజయ్ కేంద్ర మంత్రి సంజయ్ ప్రధాన అనుచరుడు, బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ ప్రవీణ్ రావు ఫోన్ ట్యాపింగ్ అయినట్లు నిర్ధారించారు. ప్రవీణ్ రావు కు కొద్దిపాటి క్రితం ఫోన్ చేసి "మీరేం చేస్తుంటారు? గతంలో మీ ఫోన్ ట్యాప్ చేశారు. మీకు నోటీసులు పంపిస్తాం. విచారణకు హాజరు కావాల్సి ఉంటుంది. అందుబాటులో ఉండండి" అని పేర్కొన్నారు.

బోయినిపల్లి ప్రవీణ్ రావు తొలి నుండి బండి సంజయ్ వెన్నంటి ఉన్నారు. బండి సంజయ్ 3సార్లు ఎమ్మెల్యేగా, 2సార్లు ఎంపీగా, కార్పొరేటర్ గా పోటీ చేసిన సమయంలో సంజయ్ రాజకీయ వ్యవహారాలను చూసేవారు. గత కొన్నేళ్లుగా బండి సంజయ్ వ్యక్తిగత సహాయకుడిగా, బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ నియోజవర్గ కన్వీనర్ గా కొనసాగుతున్నారు. నియోజకవర్గ పర్యటనలు, వివిధ కార్యక్రమాల అమలు బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు.

బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న సమయంలో కేసీఆర్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను తీవ్రస్థాయిలో ఎండగట్టడంతోపాటు ప్రజా సంగ్రామ యాత్ర పేరుతో రాష్ట్రమంతా పాదయాత్ర చేస్తూ ప్రజలతో మమేకం అవుతున్న సమయంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కార్యక్రమాల బాధ్యతలను ప్రవీణ్ రావు చూసేవారు.



ముఖ్యంగా 317 జీవో, టెన్త్ హిందీ పేపర్ లీకేజీ, బైంసా అల్లర్లు, ఇండియా పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా కరీంనగర్ లో జరిగిన అల్లర్లు, మనువాదాన్ని అడ్డుపెట్టుకుని భరతమాతను కించపర్చిన వ్యవహారంలో శాతవాహన యూనివర్సిటీ వద్ద పతాక స్థాయిలో జరిగిన ఆందోళనసహా అనేకమైన ముఖ్యమైన సంఘటనల్లో బోయినిపల్లి ప్రవీణ్ రావు బండి సంజయ్ వెన్నంటే ఉన్నారు. అనేక ప్రజా ఉద్యమాల కేసుల్లో సంజయ్ తోపాటు ప్రవీణ్ రావును కూడా నిందితుడిగా చేర్చారు.

317 జీవో విషయంలో కరీంనగర్ ఎంపీ కార్యాలయంవద్ద పెద్ద ఎత్తున బండి సంజయ్ చేసిన దీక్ష, టెన్త్ హిందీ పేపర్ లీకేజీ ఘటనలు దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. 317 జీవో దీక్షను అడ్డుకోవాలంటూ కేసీఆర్, కేటీఆర్ ల నుండి వస్తున్న ఒత్తిళ్లను తట్టుకోలేక పోలీసులు ఏకంగా ఎంపీ కార్యాలయాన్ని బద్దలు కొట్టి బీజేపీ కార్యకర్తలపై విచక్షణారహితంగా దాడులు చేసి బండి సంజయ్ ను అదుపులోకి తీసుకున్న ఘటన దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. నాటి కరీంనగర్ పోలీస్ కమిషనర్, నేటి ఐజీ సత్యనారాయణ ఏకంగా ఆ ఘటన సమయంలో అక్కడే ఉన్న ప్రవీణ్ రావును ఉద్దేశించి "నీ ఫోన్ నీ దగ్గర ఉందనుకుంటున్నావ్. నీ జాతకం అంతా నా దగ్గర ఉంది. నువ్వు ఏమేం చేస్తున్నావో మాకు తెలుసు. నీ అంతు చూస్తా. నీ పొలిటికల్ కెరీర్ ఖతం చేస్తా"నంటూ హెచ్చరిస్తూ ఆయనను అదుపులోకి తీసుకుని ఇబ్బంది పెట్టారు. అట్లాగే టెన్త్ పేపర్ లీకేజ్ పేరుతో అర్ధరాత్రి కరీంనగర్ పోలీసులు బండి సంజయ్ నివాసంలోకి చొరబడి ఆయనను ఎత్తుకుపోయి తెల్లవార్లు అనేక స్టేషన్లు తిప్పుతూ ఇబ్బంది పెట్టిన సంగతి తెలిసిందే. సంజయ్ పై కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నమోదైన దాదాపు అన్ని కేసుల్లోనూ బోయినిపల్లి ప్రవీణ్ రావును నిందితుడిగా ఉన్నారు. టెన్త్ పేపర్ లీకేజె సమయంలోనూ నాటి సీఐ తుల శ్రీనివాసరావు సైతం తన సంగతి చూస్తామంటూ బెదిరించడంతోపాటు తనపట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు ప్రవీణ్ రావు తెలిపారు.

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన బైంసా అల్లర్లు, హిందూ ఏక్తా యాత్ర, కరీంనగర్ లో ఇండియా గెలిస్తే నల్లజెండాలతో నిరసన తెలిపిన ఒక వర్గం నాయకులతో జరిగిన ఘర్షణ, శాతవాహన వర్శిటీ ఆందోళనలోనూ బండి సంజయ్ కు వెన్నంటి ఉంటూ బోయినిపల్లి ప్రవీణ్ రావు ముఖ్య పాత్ర పోషించారు. బండి సంజయ్ నాడు చేపట్టిన కార్యక్రమాలన్నీ పెద్ద ఎత్తున సక్సెస్ కావడం, తద్వారా ప్రభుత్వ వ్యతిరేకత పెల్లుబీకడుతుండటంతో బీఆర్ఎస్ ప్రభుత్వానికి బండి సంజయ్ కొరకరాని కొయ్యగా మారడంతో బండి సంజయ్ ను దెబ్బతీసేందుకు ఆయన ఫోన్లను ట్యాప్ చేసిన విషయం తెలిసిందే. దీంతోపాటు బండి సంజయ్ రాజకీయ కార్యక్రమాలతోపాటు, నియోజకవర్గ పర్యటనలు, సభలు, సమావేశాల ఖరారు వంటి అంశాలను ప్రవీణ్ రావు పర్యవేక్షిస్తుండటంతో ఆయన ఫోన్లను సైతం ట్యాప్ చేయడం ద్వారా బండి సంజయ్ చేపట్టబోయే కార్యక్రమాలను ముందే నిలువరించడంతోపాటు సంజయ్ ను రాజకీయంగా దెబ్బతీయవచ్చని కేసీఆర్ ప్రభుత్వం ప్లాన్ వేసి చట్టవిరుద్ధంగా పోలీసులను అడ్డుపెట్టుకుని ఫోన్ ట్యాపింగ్ చేసింది.

ప్రస్తుతం ఈ వ్యవహారంపై కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన సిట్ పోలీసులు విచారణ చేస్తుండటంతో ఈ విషయాలన్నీ వెలుగులోకి వస్తున్నాయి. అందులో భాగంగా బండి సంజయ్ ఫోన్ ట్యాప్ చేసినట్లు ఇప్పటికే నిర్ధారించిన పోలీసులు ఈరోజు రెండు దశాబ్దాలుగా సంజయ్ వెన్నంటి ఉంటూ బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ గా కొనసాగుతున్న ప్రవీణ్ రావుకు ఫోన్ చేశారు. 'మీ ఫోన్ ట్యాప్ చేశారు. విచారణకు సహకరించాలి. ఎప్పుడు రావాలనే అంశంపై నోటీసులు పంపిస్తాం.

అందుబాటులో ఉండండి"అంటూ పేర్కొనడం గమనార్హం. ప్రవీణ్ రావుతోపాటు సంజయ్ వ్యక్తిగత సిబ్బంది ఫోన్లు కూడా ట్యాప్ అయిన నేపథ్యంలో పోలీసులు త్వరలోనే వారికి కూడా నోటీసులు జారీ చేసి సాక్షులుగా పిలిచి విచారించాలని భావిస్తున్నట్లు సిట్ వర్గాలు తెలిపాయి.

# బెంగాల్‌లో లారీని ఢీకొన్న బొలెరీ వాహనం

## రోడ్డు ప్రమాదంలో 9మంది దుర్మరణం

**కోల్‌కతా,జూన్20( వెలుతురు):**

పశ్చిమ బెంగాల్‌లోని పురులియా జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తొమ్మిది మంది మరణించారు. శుక్రవారం ఉదయం జాతీయ రహదారి-18పై నోమిషల్ గ్రామ సమీపంలో బొలెరో వాహనం.. ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న వారంతా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే స్పందించి వారిని సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అయితే వారంతా అప్పటికే మృతి చెందారని వైద్యులు వెల్లడించారు. ఆస్పత్రి సిబ్బంది సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అందులో భాగంగా మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే పురులియాలోని బారాబజార్ పోలీస్ స్టేషన్ పరిధి అడబానా గ్రామంలో జరిగిన వివాహానికి వీరంతా హాజరై.. కారులో తిరిగి వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు తెలిపారు.

జార్ఖండ్ రాష్ట్రం నిమ్డిహ్ సమీపంలోని తిలైతాండ్‌కు వారంతా వెళ్తున్నారని వివరించారు. అతి వేగంతోపాటు నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ప్రమాద వార్త తెలియగానే వారి కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కొన్ని గంటల క్రితమే వీరంతా వివాహ వేడుకల్లో పాల్గొని.. సందడి చేశారని.. పెళ్లికి వచ్చిన బంధువులు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. వీరు బయలుదేరిన కొన్ని గంటలకే మృతిచెందారని తెలుసుకుని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

# అవినీతితో నిండిన ఐదు శాఖలు



**హైదరాబాద్, జూన్20 ( వెలుతురు): .**

ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న వారు ఉద్యోగం వస్తే బాగా లంచాలు తీసుకుని సంపాదించుకోవచ్చు అని భావిస్తున్నారు. అటెండర్ నుంచి ఐఏఎస్ వరకు ఇదే ధోరణితో ఉన్నారు. రాబోయే అవినీతి విస్పృంకల రూపం దాల్చే ప్రమాదం ఉంది. : లంచం.. అవినీతి.. ఇవి దేశాన్ని పట్టి పీడిస్తున్న అత్యంత ప్రమాదకరమైన జబ్బు. ఇది ఉగ్రవాదం కన్నా భయంకరమైనది. ఒకప్పుడు ప్రభుత్వ ఉద్యోగి అంటే.. ప్రజలకు సేవ చేయాలని అనుకునేవారు. కానీ నేడు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న వారు ఉద్యోగం వస్తే బాగా లంచాలు తీసుకుని సంపాదించుకోవచ్చు అని భావిస్తున్నారు. అటెండర్ నుంచి ఐఏఎస్ వరకు ఇదే ధోరణితో ఉన్నారు. రాబోయే అవినీతి విస్పృంకల రూపం దాల్చే ప్రమాదం ఉంది. ఇక ప్రజలు కూడా లంచం ఇస్తేనే ప్రభుత్వ శాఖల్లో పని అవుతుంది అన్న భావన పెరుతోంది.ప్రభుత్వ శాఖల్లో ఏ పని కావాలన్నా లంచం ఇవ్వాల్సిందే. డబ్బులు ఇస్తేనే అధికారులు పని చేస్తున్నారు. కొన్ని శాఖల్లో ఈ లంచం వందల రూపాయల్లో ఉంటే కొన్ని శాఖల్లో వేలు, తర్వాత లక్షలు, కోట్లలో కూడా ఉంది. ఇక ప్రజలు కూడా లంచాలు ఇస్తేనే పని అవుతంది అన్న బావనలో ఉన్నారు. కొందరు ధైర్యంగా ఏసీబీకి పట్టిస్తున్నారు. కఠిన శిక్షలు లేకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగుల తీరులో మార్పు రావడం లేదు.ఇక తెలంగాణలో అన్ని శాఖల్లో అవినీతి జరుగుతోంది. ఆ శాఖ ఈ శాఖ అనే తేడా లేకుండా ఎందెందు వెతికినా అవినీతి విస్తరించింది. అయితే కొన్ని శాఖల్లో విపరీతంగా ఉంది. ఎక్కువ అవినీతి జరిగే ఐదు శాఖలు ఇలా ఉన్నాయి.

రెవెన్యూ శాఖ..

భూమి రిజిస్ట్రేషన్, ఆస్తి బదిలీలు, భూ సంబంధిత సమస్యలలో అవినీతి ఆరోపణలు తరచూ వినిపిస్తాయి. భూ రికార్డుల సవరణలు, లైసెన్స్‌లు, క్లియరెన్స్‌లలో లంచాలు ఇవ్వడం లేదా అక్రమ లావాదేవీలు జరగడం వంటి ఫిర్యాదులు ఉంటాయి.

పౌర సరఫరాల శాఖ:

రేషన్ కార్డుల పంపిణీ, సబ్సిడీ పథకాలు మరియు ఆహార ధాన్యాల సరఫరా వంటి కార్యకలాపాలలో అవినీతి ఆరోపణలు ఎదురవుతాయి. సబ్సిడీల దుర్వినియోగం లేదా నకిలీ లబ్ధిదారుల సష్టి వంటి సమస్యలు తలెత్తవచ్చు.

ఎక్సైజ్ శాఖ..

మద్యం లైసెన్స్‌లు, చట్టవిరుద్ధమైన మద్యం వ్యాపారం, ఎక్సైజ్ రెవెన్యూ సేకరణలో అవినీతి ఆరోపణలు ఉంటాయి. ఈ శాఖ మద్యం, మాదక ద్రవ్యాలకు సంబంధించిన చట్టాలను అమలు చేస్తుంది, ఇక్కడ లంచాలు లేదా అక్రమ కార్యకలాపాలు జరిగే అవకాశం ఉంది.

రవాణా శాఖ..

వాహన రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ, రోడ్ టాక్స్ సేకరణలో అవినీతి ఆరోపణలు సాధారణం. అక్రమ రవాణా లేదా నిబంధనలను ఉల్లంఘించడానికి లంచాలు ఇవ్వడం వంటి సంఘటనలు నమోదవుతాయి.

మున్సిపల్ శాఖ:

భవన నిర్మాణ అనుమతులు, జోనింగ్ క్లియరెన్స్, మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్టులలో అవినీతి ఆరోపణలు తలెత్తుతాయి. కాంట్రాక్ట్‌లు, టెండర్‌లలో అవకతవకలు జరిగే అవకాశం ఉంది.

# హైదరాబాద్ నగరంలో మరో ఫ్లై ఓవర్.




**హైదరాబాద్, జూన్20 ( వెలుతురు): .**

హైదరాబాద్ ట్రాఫిక్‌కి గుడ్‌బై చెప్పే రోజులు దగ్గరపడుతున్నాయి. ఒకేసారి పలు ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచే ఫ్లైఓవర్‌లు, ర్యాంప్‌లు, అండర్‌పాస్‌లు హైదరాబాద్ నగర రూపాన్ని మార్చేస్తున్నాయి. తాజాగా, కొండాపూర్ నుంచి గచ్చిబౌలి వరకు వెళ్లే మార్గంలో 'శిల్పా లేఅవుట్ ఫేజ్-2 ఫ్లైఓవర్' నిర్మాణం పూర్తి కావచ్చింది. ఈ నెల 28వ తేదీన ఈ ఫ్లైఓవర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించనున్నారు. ప్రస్తుత నగర పరిస్థితుల్లో ఇది చాలా మంచి వార్తగా నగరవాసులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ ఉద్యోగులకు ఇది సాఫ్ట్‌వేర్ కారిడార్‌లో బిగ్ రిలీఫ్‌గా మారనుంది. ఈ ఫ్లైఓవర్‌కు మాజీ మంత్రి, ప్రజాకవి, మాస్ నాయకుడిగా గుర్తింపు పొందిన పి. జనార్దన్ రెడ్డి (పీజెఆర్) పేరు పెట్టడం మరో విశేషం. ప్రజల్లో తనదైన ముద్ర వేసిన ఈ నేత పేరు మీదుగా ఓ ప్రధాన మార్గాన్ని అభివృద్ధి చేయడం పీజేఆర్ మిత్రులకు గర్వకారణంగా మారింది. పీజెఆర్ ఫ్లైఓవర్ ప్రత్యేకతలు ఇవే ఇది సుమారు 2 కిలోమీటర్ల పొడవునా నిర్మించబడింది. హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ అమలు చేస్తున్న వ్యూహాత్మక రోడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ కింద రూ.172 కోట్ల వ్యయంతో ఈ ఫ్లైఓవర్‌ను నిర్మించారు. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైటెక్ సిటీ, మాదాపూర్, కొండాపూర్, గచ్చిబౌలి మధ్య ట్రాఫిక్ క్లియర్‌గా సాగేందుకు ఇది కీలకం కానుంది. ఫ్లైఓవర్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయడమే కాకుండా, దాని పరిసరాల్లో సుందరీకరణ పనులు, స్ట్రీట్ లైటింగ్, సోషల్ వాల్ ఆర్ట్ వంటి వాటిని కూడా త్వరగా పూర్తిచేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. అలాగే, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కూడా అన్ని పనులను జూన్ 28కి ముందు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మొత్తం ఎన్ని ఫ్లైఓవర్లు ఉన్నాయంటే? ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 35కి పైగా ఫ్లైఓవర్లు ఉన్నాయి. వీటిలో చాలావరకు SRDP కింద నిర్మించబడ్డవే. గత ఏడేళ్లలో హైదరాబాద్ ట్రాఫిక్ స్మార్ట్‌గా మారడానికి జీహెచ్ఎంసీ, HRDCLలు ఎంతో కీలకంగా పనిచేశాయి. 2024 చివరి నాటికి మరో 8-10 ఫ్లైఓవర్లు, స్కైవాక్‌లు, అండర్‌పాస్‌లు పూర్తి కానున్నాయి. దీని ద్వారా ట్రాఫిక్‌ను మరింత సులభతరం చేయాలని లక్ష్యం పెట్టుకున్నారు. గచ్చిబౌలి మధ్య ప్రయాణ సమయం 20 నిమిషాల నుంచి 5 నిమిషాలకు తగ్గే అవకాశం ఉంది. రోజు ప్రయాణించే లక్షలకు పైగా ఐటీ ఉద్యోగులకు ఊరట లభించనుంది. సమీప ప్రాంతాలైన మాదాపూర్, హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లోకి రాకపోకలు సులభం కానున్నాయి. ట్రాఫిక్ వల్ల వృథా అయ్యే ఇంధనం, సమయాన్ని ఆదా చేస్తుంది. వాహనాల వేగాన్ని తగ్గించకుండా నిరీక్షణ లేకుండా ప్రయాణించేందుకు వీలవుతుంది. ఫ్యూచర్ హైదరాబాద్- ఫ్లైఓవర్ హబ్! హైదరాబాద్ ఇప్పుడు మెట్రో, మల్టీలెవల్ జంక్షన్, స్మార్ట్ ఫ్లైఓవర్‌ల నగరంగా పేరుగాంచుతోంది. రాబోయే రోజుల్లో మెట్రో రూట్లతో పాటు, రింగ్ రోడ్డు ప్రాజెక్టులతో పాటు మరిన్ని స్మార్ట్ కనెక్టివిటీలు వచ్చే అవకాశాలున్నాయి. ఫ్లైఓవర్‌లు వేగంగా పూర్తవుతున్న తీరును చూస్తే.. ట్రాఫిక్‌తో వేదన భరించాల్సిన రోజులు ముగిసినట్టే అనిపిస్తుంది. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే దిశగా అడుగులు వేస్తోంది జీహెచ్ఎంసీ. పీజెఆర్ ఫ్లైఓవర్ ప్రారంభంతో నగరంలోని ముఖ్య మార్గాల్లో రద్దీ తగ్గుతుంది. ముఖ్యంగా ఐటీ హబ్ పరిధిలో ఇది కీలకమవుతుంది. హైదరాబాద్ నగరాన్ని వరల్డ్ క్లాస్ మాడల్‌గా తీర్చిదిద్దేందుకు జరుగుతున్న ఈ మార్పులు నిజంగా అభినందనీయమని నగరవాసులు అంటున్నారు.

# కలహాల కమలం...

## ముందుకు సాగని కార్యాచరణ



**హైదరాబాద్, జూన్20 ( వెలుతురు): .**

తెలంగాణలో అధికార పీఠాన్ని దక్కించుకోవడమే టార్గెట్‌గా అడుగులు వేస్తున్న కమలదళం వ్యూహాలు అంతగా వర్కౌట్ అవ్వడం లేదా? కొత్త కొత్త కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లాలన్న ఆలోచనలు.. కార్యరూపం దాల్చడంలో ఎదురు దెబ్బలు తగులుతున్నాయా? అందుకే ఇప్పుడు కాషాయ నేతలు సరికొత్త స్ట్రాటజీతో ప్రజల ముందుకు వస్తున్నారా? అసలు తెలంగాణ బీజేపీలో ఏం జరుగుతుందో చూద్దాం. ప్రతి రోజు ప్రజలకు అందుబాటులో ఒక ప్రజా ప్రతినిధి. పులిని చూసి ఇంకేదో వాత పెట్టుకున్నట్టు ఉంది ప్రస్తుత బీజేపీ వ్యవహారం.. బీజేపీ భరోసా పేరుతో ప్రజలకు అండగా నిలవాలని.. ప్రజల నుంచి వారి సమస్యలపై ఫిర్యాదులు తీసుకోవడం మొదలుపెట్టింది. రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ప్రతి రోజు ఒక ప్రజా ప్రతినిధి ప్రజలకు అందుబాటులో ఉంటూ.. ప్రజల నుంచి ఫిర్యాదులు సేకరించడం ప్రారంభించారు. దీనికి తగ్గట్టుగానే ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పార్టీ కార్యాలయంలో రోజుకొక ప్రజా ప్రతినిధి అందుబాటులో ఉంటున్నారు. ఇక్కడి వరకు అంతా బాగానే ఉంది. కానీ బీజేపీ తల పెట్టిన ఈ కార్యక్రమంపై ఇప్పుడు అనేక విమర్శలు వస్తున్నాయట. గాంధీభవన్ వేదికగా ప్రజలకు అందుబాటులో ఓ మంత్రి. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన మంత్రులతో ముఖాముఖి సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతుంది. ప్రజా సమస్యలను తీర్చేందుకు వారంలో ఓ మంత్రి గాంధీభవన్ వేదికగా ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఫిర్యాదులను స్వీకరిస్తున్నారు. వీలైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అంతే కాదు తాజా ప్రజాప్రతినిధులతో పాటు, పార్టీ కీలక ప్రతినిధులు సైతం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా రేవంత్ సర్కార్ ప్లాన్ చేస్తోంది. మరోవైపు పూలే భవన్ వేదికగా వారంలో రెండు రోజులు అంటే.. మంగళవారం, శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహిస్తూ ప్రజా సమస్యలపై ఫోకస్ చేస్తున్నారు. ఇప్పుడు బీజేపీపై వస్తున్న విమర్శలు ఏంటంటే.. కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ చేస్తున్న కార్యక్రమాన్ని.. బీజేపీ కాపీ చేస్తోందని విమర్శిస్తున్నారు ఆ పార్టీ నేతలు. బీజేపీ భరోసాకు ప్రజలే కరువయ్యారనే చర్చ. అంతేకాదు బీజేపీ భరోసాకు ప్రజలే కరువయ్యారనే చర్చ మొదలైందట. ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రజలు బీజేపీ పార్టీ ఆఫీస్ మెట్లు ఎక్కడం లేదనే టాక్ వినిపిస్తోంది. రోజుకొక ప్రతినిధి పార్టీ కార్యాలయానికి చేస్తూ వెళ్తున్నారు. ఎన్ని ఫిర్యాదులు వచ్చాయో చెప్పలేని పరిస్థితుల్లో నాయకత్వం ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయట. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి రైతులు, కార్మికులు, వివిధ వర్గాల నుంచి వేలాదిగా ఫిర్యాదులు వస్తున్నాయి అంటూ బుకాయింపులు తప్పితే బీజేపీ చేపట్టిన భరోసాలో ప్రజలు, ప్రజా సమస్యలపై ఫిర్యాదులు లేవనే కామెంట్లు ఇటు పొలిటికల్ సర్కిల్లో.. అటు కాంగ్రెస్ సర్కిల్లో వినిపిస్తున్నాయట. రియల్ ఎస్టేట్ దందాలకు సంబంధించిన సెటిల్‌మెంట్ అంశాలే ఎక్కువనే చర్చ. బీజేపీ భరోసా కార్యక్రమాన్ని ప్రారంభించింది రెండు వారాలు గడుస్తోంది. ఇందులో ప్రజా సమస్యలు కాకుండా రియల్ ఎస్టేట్ దందాలకు సంబంధించిన సెటిల్ మెంట్ అంశాలే ఎక్కువగా వస్తున్నాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అంతేకాదు గత బీఆర్ఎస్ పార్టీ చేసిన ఆగడాలు మినహాయిస్తే ప్రజా పాలనపై బీజేపీ తలపెట్టిన భరోసా కార్యక్రమానికి ఎలాంటి ఫిర్యాదులు ఇప్పటి వరకు రాకపోవడం ఆ పార్టీలో చర్చనీయాంశంగా మారిందట. కాంగ్రెస్ పాలనపై పొద్దున లేస్తే దుమ్మెత్తి పోయడమే పనిగా పెట్టుకున్న బీజేపీ నేతలకు ప్రజా పాలనపై క్లారిటీ వచ్చిందనే విమర్శలు కాంగ్రెస్ నుంచి వినిపిస్తున్నాయి. ముగియనున్న జీహెచ్ఎంసీ కౌన్సిల్ గడువు. త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయి. అంతేకాదు 9 నెలల్లో జీహెచ్ఎంసీ కౌన్సిల్ గడువు కూడా ముగియనుండటంతో బీజేపీ రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ సంస్థాగత బలం పెంచుకోవడానికి వ్యూహాలు పన్నుతోంది. పార్టీ కార్పొరేటర్లు ఉన్న డివిజన్లలో వారిని, కార్పొరేటర్లు లేని చోట డివిజన్ స్థాయి నాయకులు కాస్త ముందు నుంచే ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ ఆదేశించినట్లు కాషాయ శ్రేణులు చెబుతున్నాయి. అందుకే కొత్త కొత్త కార్యక్రమాలతో ప్రజల్లో ఉండాలని చూస్తోంది. 2020లో జరిగిన గ్రేటర్ ఎన్నికల్లో 40కి పైగా సీట్లు సాధించిన బీజేపీ, మజ్లిస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే హైదరాబాద్ ప్రజలను అకట్టుకునేందుకు జీహెచ్ఎంసీ లోకల్ బాడీ ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేసి, హైదరాబాద్‌లో ఎంఐఎంను టార్గెట్ చేస్తూ హిందుత్వ ఎజెండాను సమర్థంగా వినిపించిందని, భవిష్యత్తులో తమకు కావలసిన మైలేజీని పెంచుకుందంటున్నారు. నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలే మైనస్. తెలంగాణలో సంస్థాగతంగాపార్టీ బలోపేతమే లక్ష్యంగా కాషాయ పార్టీ అడుగులు వేస్తోంది. ఎమ్మెల్సీ ఎన్నికల జోష్‌ను కంటిన్యూ చేయాలనే ఆలోచనలో అధిష్టాన పెద్దలు ప్రణాళికలకు పదును పెడుతున్నారంట. కానీ రాష్ట్ర నేతల వ్యవహారం మాత్రం అందుకు భిన్నంగా కనిపిస్తుండటంతో అధిష్టానం తలలు పట్టుకుంటుందంటున్నారు. పార్టీలో ఉన్న నేతల మధ్య అంతర్గత కుమ్ములాటలు పార్టీ ఎదుగుదలకు మైనస్ అవుతున్నాయనే టాక్ వినిపిస్తోంది. వీటన్నింటిని కవర్ చేస్తూ కొత్త కొత్త కార్యక్రమాలను డిజైన్ చేస్తోంది కమలం పార్టీ. 11 ఏళ్ల పాలనపై ప్రజల్లోకి వెళ్లాలని బీజేపీ భావిస్తోంది. వరుసగా మూడుసార్లు అధికారంలోకి వచ్చి హ్యాట్రిక్ కొట్టడంతో పాటు ఈ 11 ఏళ్లలో తెలంగాణ అభివృద్ధికి కేటాయించిన నిధులు వంటి వివరాలను ప్రజలకు వివరించేందుకు కాషాయ దళం సిద్ధమవుతోంది. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధులు, పథకాలపై చర్చలు. వికసిత్ భారత్ లక్ష్యానికి 11 ఏండ్లు అంటూ ప్రజల్లో మమేకం అయ్యేందుకు కసరత్తులు చేస్తున్నారు ఆ పార్టీ నేతలు. మరోవైపు తెలంగాణలో 8 ఎంపీ, 8 ఎమ్మెల్యేలు, 3 ఎమ్మెల్సీ లను కైవసం చేసుకున్న కాషాయా పార్టీ పూర్తి స్థాయిలో రాబోయే సమరానికి గ్రౌండ్ ప్రిపేర్ చేసుకుంటుంది.

గెలిచిన వారంతా కూడా తమ తమ అసెంబ్లీ, పార్లమెంట్ సెగ్మెంట్ లకు తీసుకొచ్చిన నిధుల వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంపై దృష్టిసారిస్తున్నారు. అందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలతో పాటు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్నా నిధులు, సంక్షేమ పథకాలపై మరిన్ని కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లోకి విస్తృతంగా చొచ్చుకెళ్లి పార్టీకి మైలేజ్ వచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. ప్రతి గ్రామానికి ఏమిచ్చాం? ఎంత మేరకు నిధులు కేటాయించామనే వివరాలు వారికి వివరించేలా బీజేపీ ప్రణాళికలు చేపడుతోందనీ పార్టీ వర్గాలు చెప్పుకొస్తున్నాయి. మొత్తానికి ఇటు తెలంగాణలో బీజేపీ భరోసా, అటు 11 ఏళ్ల మోడీ పాలనా భరోసా రాష్ట్ర బీజేపీకి ఏ విధంగా సహకరిస్తాయి అనేది చూడాలి.

# 650 ఫోన్ల ట్యాపింగ్... జెట్ స్పీడ్ లా విచారణ..

**హైదరాబాద్, జూన్20 ( వెలుతురు): .**



ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏ1 ప్రభాకర్ రావు అమెరికా నుంచి భారత్‌కు రావడంతో.. విచారణ జెట్ స్పీడ్‌లో కొనసాగుతుంది. ఇప్పటికే పలుమార్లు సిట్ విచారణకు హాజరైన ప్రభాకర్ రావు.. గురువారం మరోసారి విచారణకు వెళ్లారు. దాదాపు 8 గంటలపాటు సుదీర్ఘంగా ప్రశ్నించారు సిట్ అధికారులు. మావోయిస్టుల సానుభూతిపరులని వందల మంది ఫోన్లను ట్యాపింగ్ చేసినట్టు గుర్తించారు. అయితే ఆ లిస్ట్ లో ఒక్కరిపై కూడా కేసులు నమోదు కాలేదు. అప్పుడు మావోయిస్టు సానుభూతిపరులు ఎలా అవుతారంటూ ప్రభాకర్ రావును సిట్ ప్రశ్నించింది. ఈ కేసులో ఇప్పటికే పలువురు బాధితుల నుంచి సిట్ అధికారులు వాంగ్మూలాలు నమోదు చేసుకున్నారు. మరికొంతమందిని విచారించారు. ఈ క్రమంలో ఇవాళ మరోసారి సిట్ ముందుకు వెళ్లనున్నారు ప్రభాకర్ రావు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు. 2023 నవంబర్ 15న 650 మంది ఫోన్లు ట్యాప్ చేసిన వ్యవహారంపై ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. మావోయిస్ట్ సానుభూతిపరుల పేరుతో రాజకీయ నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్లు సిట్ గుర్తించింది. పదవీ విరమణ పొందిన తర్వాత.. ఓఎస్డీగా ఉన్న ప్రభాకర్ రావును.. గత ప్రభుత్వ హయాంలో.. ఫోన్ లీగల్ ఇంటర్ సెప్షన్ డిజిగ్నేటెడ్ అథారిటీగా నియమించడంపైనా సిట్ విచారిస్తోంది. డిజిగ్నేటెడ్ అథారిటీ హోదాలో కేవలం.. 7 రోజులు మాత్రమే అనుమానిత ఫోన్లపై నిఘా పెట్టాలి. 7 రోజుల తర్వాత ఫోన్ కాల్స్‌పై నిఘా పెట్టాలంటే.. రివ్యూ కమిటీ అనుమతి పొందాలి. కానీ గడువు ముగిసినా.. ఎలాంటి అనుమతులు లేకుండా.. ఇష్టమొచ్చినట్లుగా.. చట్ట విరుద్ధంగా ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడినట్లు గుర్తించారు. నిందితులు, బాధితుల వాంగ్మూలాల ఆధారంగా విచారణ. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నిందితులు, బాధితులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా ప్రభాకర్ రావును విచారిస్తున్నారు. ఇప్పటికే.. 650 మంది ఫోన్ ట్యాపింగ్ బాధితుల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. ఫోన్ ట్యాపింగ్‌తో వారు ఇబ్బందులకు గురైన తీరుపై ఆయనేం చెబుతారన్నది నమోదు చేయనున్నట్లు తెలుస్తోంది. దర్యాప్తు బృందం ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పని ప్రభాకర్ రావు. ప్రభాకర్ రావు విషయంలో సిట్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయన విచారణకు సహకరించక పోవడం వల్ల.. త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయించే యోచనలో ఉన్నారు. ఆయనకు ఇచ్చిన రిలీఫ్‌ని రద్దు చేయాలని కోరనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు.. ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణకు నాంపల్లి కోర్టులో పిటిషన్ వేసే అవకాశం ఉంది. త్వరలోనే.. మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి, మాజీ సీఎస్ సోమేశ్ కుమార్ స్టేట్‌మెంట్‌ని కూడా పోలీసులు నమోదు చేయనున్నారు. ప్రభాకర్ రావు టీం వందల పెన్ డ్రైవ్స్ కొనుగోలు చేసి.. ప్రభాకర్ రావు టీం వందల పెన్ డ్రైవ్స్ కొనుగోలు చేసి కాల్స్ రికార్డ్ చేసి వాటిని కాపీ చేసి కావలసిన వారికి ఇచ్చినట్టు సిట్ గుర్తించింది. ఆ పెన్ డ్రైవ్ లు ఎవరెవరికి ఇచ్చారనే దానిపై ప్రభాకరావ్ ను సిట్ అధికారులు ప్రశ్నించారు. ఈ కేసులో ఆ పెన్ డ్రైవ్ లు దొరికితే కీలక సాక్ష్యాలుగా మారనున్నాయి. ప్రభాకర్‌రావు విచారణకు సహకరించకపోతే సుప్రీంను ఆశ్రయించనున్న సిట్. ఈ నేపథ్యంలో ప్రభాకర్ రావుకున్న రిలీఫ్‌ను రద్దు చేయాలని సుప్రీంకోర్ట్‌ను కోరనున్నారు సిట్ అధికారులు. ఇప్పటికే ప్రభాకర్ రావు వాంగ్మూలాన్ని రికార్డ్ చేసిన అధికారులు ఆయన ఇచ్చిన కీ డీటెయిల్స్ ఆధారంగా ప్రణీత్ రావును విచారించారు. కొట్టివేయాలని కోరనున్న సిట్ బృందం. అటు ఫోన్ ట్యాపింగ్ మంటలు ఏపీని చుట్టేశాయి. వైవీ సుబ్బారెడ్డి వద్ద ట్యాప్ అయిన తన ఆడియో ఉందని బాంబు పేల్చారు షర్మిల. ఈ విషయం నిజమో కాదో తన కుటుంబసభ్యుల మీద ప్రమాణం చేసి చెప్పాలని డిమాండ్ చేశారు. వైవీ చేతికి ఆ ఆడియో ఎలా వచ్చింది? వైవీని విచారణకు పిలిస్తే అసలు విషయాలు వెలుగుచూస్తాయని షర్మిల డిమాండ్ చేశారు

# ఆర్టీసీ లో కండక్టర్ల కొరత

**వరంగల్, జూన్20 ( వెలుతురు): .**

ప్రస్తుతం ఆర్టీసీలో 2 వేల కండక్టర్ పోస్టుల కొరత ఉంది. గత కొన్ని నెలల్లో 1,500 మంది కండక్టర్లు ఉద్యోగ విరమణ చేయనున్నారు.తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మానవ వనరుల కొరత సమస్యను పరిష్కరించేందుకు ఔట్సోర్సింగ్ పద్ధతిని ఆశ్రయిస్తోంది. రెండు నెలల క్రితం డ్రైవర్ల నియామకం తర్వాత, ఇప్పుడు సుమారు 800 మంది కండక్టర్లను తాత్కాలికంగా ఔట్సోర్సింగ్ ద్వారా నియమించుకోవాలని నిర్ణయించింది. ఈ చర్య హైదరాబాద్, సికింద్రాబాద్, వరంగల్ రీజియన్లలో అమలు కానుంది.ప్రస్తుతం ఆర్టీసీలో 2 వేల కండక్టర్ పోస్టుల కొరత ఉంది. గత కొన్ని నెలల్లో 1,500 మంది కండక్టర్లు ఉద్యోగ విరమణ చేయనున్నారు. 500 మంది రెగ్యులర్ కండక్టర్లు కార్గో సర్వీసులు, పెట్రోల్ బంకులు వంటి అనుబంధ విభాగాల్లో పనిచేయడం ఈ కొరతకు కారణాలు. ఫలితంగా, ప్రస్తుత సిబ్బందిపై అదనపు డ్యూటీ భారం పడుతోంది. రోజుకు 10-12 గంటలు పనిచేయాల్సి రావడంతో కండక్టర్లు శారీరక, మానసిక అలసటకు గురవుతున్నారు. అదనపు డ్యూటీకి ఓవర్‌టైమ్ చెల్లింపులు అందినప్పటికీ, ఈ ఒత్తిడి వారిలో అసంతృప్తిని పెంచుతోంది.ఆర్టీసీ హైదరాబాద్‌లో 600, వరంగల్‌లో 200 మంది కండక్టర్లను ఔట్సోర్సింగ్ ద్వారా నియమించనుంది. రెండు నెలల క్రితం వెయ్యి మంది డ్రైవర్లను ఇదే పద్ధతిలో నియమించిన అనుభవం ఈ నిర్ణయానికి ఆధారం. ఔట్సోర్సింగ్ కండక్టర్లకు నెలవారీ కన్సాలిడేటెడ్ వేతనం రూ.17,969, అదనపు గంటకు రూ.150, రాత్రి డ్యూటీకి గంటకు రూ.200 చెల్లిస్తారు. ప్రతి ఆరు రోజులకు ఒక రోజు వీక్లీ ఆఫ్ కల్పిస్తారు.ఈ నియామకాల కోసం త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. రవాణా మంత్రి కార్యాలయం అనుమతి ఇవ్వడంతో, సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం ఇప్పటికే 4 వేల పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపినప్పటికీ, టీఎస్పీఎస్సీ, వైద్యారోగ్య శాఖ, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియ ఆలస్యమవుతోంది. నియామక క్యాలెండర్, ఎస్సీ వర్గీకరణ రోస్టర్ ఖరారు వంటి అడ్మినిస్ట్రేటివ్ సమస్యలు ఈ జాప్యానికి కారణాలు. ఫలితంగా, ఆర్టీసీలో ఖాళీల సంఖ్య పెరిగి, సేవల నాణ్యతపై ప్రభావం పడుతోంది.తాత్కాలిక నియామకాలు కండక్టర్ల కొరతను తగ్గించి, సేవలను సాఫీగా నిర్వహించడానికి దోహదపడతాయి. రెగ్యులర్ సిబ్బందిపై ఒత్తిడి తగ్గుతుంది. ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానమైన స్థిరత్వం, ప్రయోజనాలు లభించవు. శిక్షణ, సమన్వయంలో ప్రారంభ సవాళ్లు ఉండవచ్చు. ఔట్సోర్సింగ్ తాత్కాలిక పరిష్కారం మాత్రమే. రెగ్యులర్ నియామకాలు వేగవంతం కాకపోతే, ఈ సమస్య మళ్ళీ తీవ్రమవుతుంది.ఆర్టీసీలో కండక్టర్ల కొరతను పరిష్కరించేందుకు ఔట్సోర్సింగ్ ఒక ఆచరణీయమైన దశ అయినప్పటికీ, రెగ్యులర్ నియామకాల ఆలస్యం సమస్యకు మూల కారణం. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం ఈ ఖాళీల శాశ్వత భర్తీకి చర్యలు తీసుకోకపోతే, సేవల నాణ్యత, ఉద్యోగుల సంక్షేమం దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ సందర్భంలో, ఔట్సోర్సింగ్, రెగ్యులర్ నియామకాల మధ్య సమతుల్య విధానం ఆర్టీసీకి కీలకం.

## మాగంటి వారసులకు టిక్కెట్ కష్టమేనా



**హైదరాబాద్, జూన్ 20, ( వెలుతురు)**

జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఇటీవల మరణించారు. ఆయన అకాల మరణంతో జూబ్లీ హిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. దీంతో తెలంగాణలో ఉప ఎన్నికల హీట్ మొదలయింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 2014లో టీడీపీ నుంచి, 2018, 2023 నుంచి మాగంటి గోపీనాథ్ విజయం సాధించారు. ఆయన మూడు దఫాలుగా ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గాన్ని ఆయన కుటుంబంలో టిక్కెట్ ఇచ్చే అవకాశం తక్కువగానే కనిపిస్తున్నాయి. అందుకే వేరే వారికి ఉప ఎన్నికలో సీటు ఇస్తారన్న ప్రచారం జరుగుతుంది. సహజంగా ఎమ్మెల్యే ఆకస్మికంగా మరణిస్తే కుటుంబ సభ్యులు పోటీ చేస్తే ఎన్నిక ఏకగ్రీవం కావడం మామూలుగా జరుగుతుంది. అయితే ప్రస్తుతం తెలంగాణలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా మాగంటి కుటుంబం నుంచి ఎవరూ పోటీ చేసే అవకాశం లేదంటున్నారు. వారు కూడా రాజకీయాల్లో మాగంటి వారసత్వాన్ని కొనసాగించేందుకు సుముఖంగా లేరని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే వేరే వారికి టిక్కెట్ ఇస్తే మిగిలిన పార్టీలు కూడా పోటీకి దిగే అవకాశముంటుంది. అందుకే ఇప్పటి నుంచే బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు జూబ్లీ హిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి ఇప్పటి నుంచే అభ్యర్థులను సిద్ధం చేస్తున్నాయి. బీఆర్ఎస్ తమ అడ్డాగా భావించిన జూబ్లీ హిల్స్ ఉపఎన్నికలలో గెలవాలని భావిస్తుంది. ఇందుకోసం పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి పేరును పరిశీలిస్తుంది. ఇక కాంగ్రెస్ పార్టీలో గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అజారుద్దీన్ కూడా తనకు టిక్కెట్ ఇవ్వాలని పట్టుబడుతున్నారు. ఇప్పుడు ఎంఐఎంతో సఖ్యత ఉండటంతో ఈసారి గెలుపు తథ్యమని అజార్ భాయ్ భావిస్తున్నారు. ఇక శ్రీశైలం యాదవ్ కుమారుడు నవీన్ యాదవ్ కూడా టిక్కెట్ ఆశిస్తున్నారు. 2014 ఎన్నికల్లో నవీన్ యాదవ్ ఎంఐఎం నుంచి పోటీ చేసి దాదాపు నలభై వేల కు పైగానే ఓట్లు సాధించారు. ఇక పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి కూడా తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. దీంతో కాంగ్రెస్, ఎంఐఎం లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుంటే గెలుపు తథ్యమని భావిస్తుండటంతో పోటీ ఎక్కువయిందంటున్నారు. భారతీయ జనతా పార్టీకి హైదరాబాద్ నగరంలో మంచి పట్టుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు ముందే వస్తున్న ఈ ఉప ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలనుకుంటోంది. ఏపీలో టీడీపీ తో పొత్తులో ఉండటం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో తమకు కలసివస్తుందని కమలనాధులు అంచనా వేస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిని నిలబెట్టగలిగితే విజయం తమదేనన్న ధీమాలో ఉన్నారు. గత ఎన్నికల్లో బీజేపీ నుంచి జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన దీపక్ రెడ్డి పేరు పరిశీలనలో ఉన్నా మరొక కొత్త పేరు కమ్మ సామాజికవర్గానికి చెందిన ఒకపారిశ్రామిక వేత్త పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఇటీవల కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చంద్రబాబుతో భేటీ అయినప్పుడు జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై కూడా చర్చించినట్లు తెలిసింది. మొత్తం మీద మూడు పార్టీ తమదైన వ్యూహాలతో ఉప ఎన్నికకు సిద్ధమవుతున్నాయి.

## రైతులకు మళ్లీ సంకెళ్లా...




**మహబూబ్ నగర్, జూన్ 20, ( వెలుతురు)**

గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దధన్వాడ వద్ద ఇథనాల్ పరిశ్రమ వద్దని ధర్నా చేసిన రైతులను పోలీసులు అరెస్టు చేశారు. వారిని కోర్టుకు తరలించే క్రమంలో సంకెళ్లు వేయడం సంచలనంగా మారింది. దీనిపై ప్రతిపక్షాలు భగ్గుమన్నాయి. చర్యను తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం పోలీసు అధికారులపై చర్యలు తీసుకుంది. నాడు లగర్లలో కూడా రైతును సంకెళ్లతోనే ఆసుపత్రికి తరలించారు. గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దధన్వాడలో ప్రభుత్వం ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. దీన్ని వ్యతిరేకించిన స్థానిక రైతులు జూన్ 4న ఆందోళన చేశారు. అక్కడ పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన సంస్థ ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. దీంతో ఆ సంస్థ ఫిర్యాదు మేరకు పోలీసులు కొందరు రైతులను అరెస్టు చేశారు. దాదాపు 41 మందిపై కేసులు పెడితే 12 మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రిమాండ్‌లో ఉన్న రైతులను మహబూబ్‌నగర్ జైలు నుంచి అలంపూర్ కోర్టుకు తరలించారు. ఈ క్రమంలో ఇద్దరికి సంకెళ్లు వేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రతిపక్షాలు కూడా ప్రభుత్వాన్ని, అధికారుల చర్యలను ప్రశ్నించాయి. కంపెనీకి కొమ్ముకాస్తు రైతులపై కేసులు పెట్టడమే కాకుండా వారికి సంకెళ్లు వేసి తరలించడం ఏంటని నిలదీశాయి. మాజీ మంత్రి హరీష్‌రావు సోషల్ మీడియా వేదికగా ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. "లగచర్ల నుంచి రాజోలి దాకా రైతు చేతులకు సంకెళ్లు.. పౌర హక్కుల నేతలపై నిర్బంధాలు. ఇవే రేవంత్ రెడ్డి చెప్పే ఇందిరమ్మ రాజ్యం ఆనవాళ్లు!" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరో మాజీ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ..."జోగులాంబ గద్వాల్ జిల్లా పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడిన రైతుల చేతులకు సీఎం రేవంత్ బేడీలు వేయడం అత్యంత దుర్మార్గమైన చర్య. అలంపూర్ కోర్టు వద్ద అన్నదాతలకు పోలీసులు సంకెళ్లు వేసిన ఘటన ముఖ్యమంత్రి రాక్షస మనస్తత్వానికి పరాకాష్ట. పెద్ద ధన్వాడలో గత కొన్ని నెలలుగా ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న అనేక గ్రామాల ప్రజలపై అక్రమ కేసులు పెట్టి వేధించడమే దారుణమైతే.. చివరికి దొంగలు, నేరస్తుల లాగా బేడీలు వేయడం క్షమించరాని నేరం. గతంలో లగచర్లలో అల్లుడి ఫార్మా కంపెనీని అడ్డుకున్నారనే కోపంతో గుండెపోటు వచ్చిన రైతుపై కనికరం కూడా లేకుండా బేడీలు వేసి, ఈ ముఖ్యమంత్రి మహాపాపాన్ని మూటగట్టుకున్నారు. ఇప్పుడు పెద్ద ధన్వాడ రైతుల విషయంలో కూడా ఇంత నిరంకుశంగా వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డికి అన్నదాతల చేతిలో గుణపాఠం తప్పదు. ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుంది కాబట్టి రేవంత్ వెంటనే రైతులందరికీ క్షమాపణ చెప్పాలి. " అని డిమాండ్ చేశారు. సర్వత్రా విమర్శలు రావడంతో సంకెళ్లు వేసిన అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఒక ఆర్ఎస్ఐ. ఇద్దరు ఏఆర్ఎస్ఐలను సస్పెండ్ చేసింది. ఇలా సంకెళ్లు వ్నేకొని కోర్టులో హాజరుపరిచిన రైతులకు జిల్లా న్యాయమూర్తి ప్రేమలత షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. దీంతో వాళ్లను మహబూబ్‌నగర్ జైలుకు తరలించి విడుదల చేశారు.

## అరెస్ట్ చేద్దామా... వద్దా... మథనంలో రేవంత్ సర్కార్

**హైదరాబాద్, జూన్ 20, ( వెలుతురు)**



ఫార్ములా ఈ రేసు నిర్వహణలో అక్రమాలు జరిగాయని తెలంగాణ రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ రెండోసారి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను విచారించింది. కేటీఆర్ అరెస్టుకు రంగం సిద్ధమవుతున్నట్లే అన్న ప్రచారం తెలంగాణ వ్యాప్తంగా విస్తృతంగా సాగుతోంది. అయితే ఇది కాంగ్రెస్ కుట్రలో భాగమని, రాజకీయ కక్ష సాధింపు చర్యగా బీఆర్ఎస్ పార్టీ చెబుతుంటేబీ అవినీతిని వెలికి తీసి, పారదర్శక ప్రభుత్వం తమదని, అందులో భాగమే ఈ విచారణలని కాంగ్రెస్ సర్కార్ చెబుతోంది. అయితే రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాజకీయ లాభనష్టాలను అంచనా వేసుకునే ఏ పనైనా చేస్తాయన్నది మాత్రం వాస్తవం. లండన్‌కు చెందిన 'ఫార్ములా ఈ ఆపరేషన్స్' తో కలిసి 4 సంవత్సరాలపాటు హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేసును నిర్వహించడానికి 2022 అక్టోబర్ 25న బీఆర్ఎస్ ప్రభుత్వం, ఎఫ్ఈఓ, గ్రీన్‌కో గ్రూప్‌ల మధ్య త్రైపాక్షిక ఒప్పందం జరిగింది. మొదటి రేసు 2023 ఫిబ్రవరి 11న జరిగింది. ఆ తర్వాత 2024 ఫిబ్రవరి 10న రెండో విడత రేసు జరగాల్సి ఉంది. కానీ 2023 డిసెంబర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రెండో రేసును ప్రభుత్వం రద్దు చేసింది. ఒప్పందంలోని షరతులను కాంగ్రెస్ సర్కార్ తప్పుబట్టింది. ఆర్థిక లావాదేవీలలో అవినీతి జరిగిందని, నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా విదేశీ కంపెనీకి రూ. 55 కోట్లు చెల్లించారని ఈ రేసును రద్దు చేసింది. దీనికి కారణమైన అధికారులను, నాటి మాజీ మంత్రి కేటీఆర్ పై ఏసీబీ కేసు నమోదు చేసి విచారణకు పిలిపించిందిమున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ మంత్రిగా కేటీఆర్ ఈ మొత్తాన్ని హెచ్ఎండీఏ ద్వారా చెల్లింపులు జరపాలని ఆదేశించారని, క్యాబినెట్, ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా ఈ లావాదేవీ జరిగిందన్నది ఆరోపణ. అంతే కాకుండా, ఎన్నికల కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లో ఉన్నప్పుడు, ఎన్నికల సంఘం అనుమతి తీసుకోలేదన్నది మరో ఆరోపణ. సరైన అనుమతులు తీసుకోకపోవడం వల్ల హెచ్ఎండీఏకు రూ. 8.06 కోట్లు అదనపు పన్నుల భారం పడిందని ఏసీబీ తన ఫిర్యాదు పత్రంలో పేర్కొంది. దీనిపై ఇప్పటికే ఏసీబీ రెండు సార్లు మాజీ మంత్రి కేటీఆర్‌ను పిలిపించి విచారణ జరిపింది. అయితే ఈ కేసులో ఏ పార్టీకి ఏం లాభం, ఏం నష్టం జరుగుతుందో చూద్దాం.బీఆర్ఎస్ పాలనలో అవినీతి జరిగిందని, ఇందులో కేసీఆర్ కుటుంబ సభ్యులు భారీగా లబ్ధిపొందారని కాంగ్రెస్ నేతలు విస్తృతంగా ప్రచారం చేశారు. తాము అధికారంలోకి వస్తే కేసీఆర్ కుటుంబ సభ్యులపై విచారణ జరుపుతామని ప్రతీ వేదికపైనా చెప్పారు. అందుకు అనుగుణంగా, ఓ వైపు కాళేశ్వరం ప్రాజెక్టుపైన, విద్యుత్ కొనుగోళ్ల విషయంలో కేసీఆర్ పైన, హరీశ్ రావు పైనబీ ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో కేటీఆర్ పైన రేవంత్ రెడ్డి ప్రభుత్వం నోటీసులు జారీ చేసి విచారణ జరిపింది. ఇది ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చుకున్నామని చెప్పుకోవచ్చు. తాము చెప్పినట్లే పారదర్శకమైన పాలన అందిస్తున్నామని ప్రజలకు చెప్పుకునే అవకాశం కలుగుతుంది. పాలనలో జరిగే లోపాలను ఈ రాజకీయపరమైన కేసుల ద్వారా కప్పి పుచ్చడమే కాకుండా, ఇతర అంశాలపై ప్రజల మనసులు మళ్లించే వెసులుబాటు ఉంటుంది. అంతే కాకుండా, ఓటుకు నోటు కేసు విషయంలో తనను జైల్లో పెట్టినందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రతీకారం తీర్చుకున్నట్లవుతుంది. తద్వారా తన రాజకీయ శత్రువులకు స్పష్టమైన సంకేతం పంపే వీలు కలుగుతుంది. దీని ద్వారా ప్రతిపక్ష నేతలను, పార్టీలో తనకు పోటీగా ఉండే నేతలపైన సీఎం రేవంత్ రెడ్డి పైచేయి సాధించే వీలుంటుంది.బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్, పార్టీలో ట్రబుల్ షూటర్ హరీశ్ రావుపై కాళేశ్వరం కమిషన్ నోటీసులు ఇవ్వడం, అందులో అవినీతి జరిగిందని రేవంత్ సర్కార్ ఆరోపణలు, మరోవైపు లిక్కర్ కేసులో కవిత జైలుకు వెళ్లి రావడం గులాబీ పార్టీని గుక్కతిప్పుకోలేకుండా చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై ఫార్ములా ఈ రేస్ కార్ వ్యవహారంలో కేసు నమోదు కావడం పార్టీని తీవ్ర నిరాశలోకి నెడుతోంది. పార్టీలో నెంబర్ టూ నేతపై కేసులు, విచారణ పార్టీ ప్రతిష్ఠను దెబ్బ తీస్తాయి. కేటీఆర్ ప్రతిష్ఠకు మచ్చగా మారవచ్చు. పార్టీ కార్యకర్తలు నైతికంగా దెబ్బతింటారు. ఇలాంటి కేసులు, న్యాయస్థానాల చుట్టూ తిరగడంపై దృష్టి పెట్టాల్సి వస్తుంది. పార్టీ కార్యక్రమాల నిర్వహణ, బలోపేతం చేసే వ్యూహాలకు పదునుపెట్టే సమయం ఉండదు. మానసిక ఒత్తిడికి గురికావాల్సి వస్తుంది. ఇవన్నీ వ్యక్తిగతంగా కేటీఆర్ కు, పార్టీ భవిష్యత్తుకు నష్టం కలిగించే అంశాలు.ఈ కేసుల నుంచి బయటపడితే కేటీఆర్ కు పెద్ద ఎత్తున ప్రజల సానుభూతి లభిస్తుంది. అన్యాయంగా కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం జైలుకు పంపిందన్న ప్రజల సానుభూతి కేటీఆర్ పై వెల్లువెత్తుతుంది. కాంగ్రెస్ రాజకీయ వేధింపులు అని ఆ పార్టీ పట్ల ప్రజల్లో వ్యతిరేక భావజాలాన్ని రేకెత్తించవచ్చు. "జైలుకెళతా" అంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు పార్టీలో ఆయన లీడర్‌షిప్‌ను బలోపేతం చేయవచ్చు. ఈ కేసులో తన తప్పు లేదని ఆధారాలు చూపి బయటపడితే ఆ పోరాట పటిమ వల్ల కేటీఆర్ పటిష్టమైన నాయకుడిగా మరింత ఎదిగే అవకాశం ఉంది. ఈ విచారణలను ఎదుర్కోవడం వల్ల బలమైన నాయకుడిగా రూపొందడం జరుగుతుంది.తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ అధికార మార్పిడి చోటు చేసుకున్న తర్వాత జరుగుతున్న రాజకీయాలివి. ఇందులో అవినీతి జరిగిందా లేదా అన్నది పక్కన పెడితే, ప్రతీకార రాజకీయాలకు మాత్రం ఇది మూలంగా చెప్పవచ్చు. ప్రతిపక్షాలను బలహీనపర్చడానికి అధికార పక్షం వాడే ఆయుధంగా రానున్న రోజుల్లో ఈ కేసులు మారవచ్చు. ఒకవేళ బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే ఇలాంటి కేసులను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ పార్టీ, ఆ పార్టీ కీలక నేతలు సైతం సిద్ధపడాల్సి వస్తుంది. ఈ వ్యవహారం అంతా తెలంగాణ రాజకీయాలపైన, రాజకీయ నాయకుల భవిష్యత్తుపైన తీవ్ర ప్రభావం చూపే అవకాశం రానున్న రోజుల్లో ఉందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# పాకిస్తాన్, ఇరాన్ కకావికలం

**న్యూఢిల్లీ, జూన్ 20, ( వెలుతురు)**



ప్రపంచంలో అగ్రదేశాలతో సమానంగా తమ వద్ద కూడా అన్వాయుధాలు ఉండాలని ఇస్లామిక్ దేశాలు కలలు కన్నాయి. అయితే ఇందులో కేవలం మూడు దేశాలు మాత్రమే ఒక అడుగు ముందుకు వేశాయి. కానీ వాటి కలలను అమెరికా, భారత్, ఇజ్రాయెల్ కల్లలు చేశాయి.ఇరాక్, ఇరాన్, పాకిస్తాన్ దశాబ్దాలుగా అణు శక్తి ఆయుధాల రంగంలో తమ ఆధిపత్యాన్ని స్థాపించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ మూడు దేశాల అణు కార్యక్రమాలు వివాదాస్పదంగా, అంతర్జాతీయ ఒత్తిళ్లకు కేంద్రంగా ఉన్నాయి. అయితే, అమెరికా ఇరాక్ అణు కార్యక్రమాలను ఆదిలోనే తుంచేసింది. సద్దాం హుస్సేన్‌ను చంపడంతోపాటు అక్కడి ప్రభుత్వం మార్చడం, అమెరికా సైనిక చర్యలతో ఇరాక్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా చిన్నాభిన్నమైంది. దీంతో అణ్వాయుధం తయారు చేయాలన్న ఇరాక్ కల చెదిరిపోయింది. ఇక ఇటీవలి పరిణామాలు ఇరాక్, పాకిస్తాన్ దేశాల అణు ఆశలు సవాళ్లను ఎదుర్కొంటున్నాయి.ఇరాన్ అణు కార్యక్రమం, 2015లో జాయింట్ కాంప్రహెన్సివ్ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ద్వారా అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించింది. అయితే, 2018లో యునైటెడ్ స్టేట్స్ ఈ ఒప్పందం నుంచి వైదొలగడం, కఠిన ఆంక్షలు విధించడం వల్ల ఇరాన్ అణు కార్యక్రమం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. ఆర్థిక సంక్షోభం, అంతర్జాతీయ ఒడంబడికలలో విశ్వాసం కోల్పోవడం వల్ల ఇరాన్ అణు ఆకాంక్షలు దెబ్బతిన్నాయి. ఇటీవలి చర్చలు JCPOA ని పునరుద్ధరించడంలో విఫలమవడం, ఇజ్రాయెల్ నుంచి సైనిక ఒత్తిడి ఇరాన్‌ను మరింత ఇరుకున పెట్టాయిపాకిస్తాన్ 1998లో అణు పరీక్షలు నిర్వహించి, అణు శక్తి దేశంగా గుర్తింపు పొందింది. అయినప్పటికీ, ప్రస్తుత ఆర్థిక సంక్షోభం, రాజకీయ అస్థిరత, అంతర్జాతీయ ఆంక్షల భయం పాకిస్తాన్ అణు కార్యక్రమాన్ని దెబ్బతీస్తున్నాయి. అణు ఆయుధాల నిర్వహణ, ఆధునీకరణకు అవసరమైన ఆర్థిక వనరులు కొరవడటం, చైనాపై ఆధారపడటం పాకిస్తాన్‌ను ఒక గండిలో పడేసింది. అంతర్జాతీయ సమాజం నుంచి నిరంతర పరిశీలన, భారత్‌తో ఉద్రిక్తతలు ఈ సవాళ్లను మరింత తీవ్రతరం చేస్తున్నాయి.ఇరాన్, పాకిస్తాన్‌లు అంతర్జాతీయ సమాజం నుంచి విభిన్న ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ నుంచి ఆంక్షలు, సైనిక బెదిరింపులు ఉండగా, పాకిస్తాన్‌పై ఆర్థిక సంక్షోభం, ఉగ్రవాద ఆరోపణలు ఒత్తిడి తెస్తున్నాయి. అణు ప్రసార నిరోధక ఒప్పందం వంటి అంతర్జాతీయ చట్రంలో ఈ దేశాలు సమర్థవంతంగా సహకరించలేకపోవడం వాటి అణు కార్యక్రమాలకు అడ్డంకిగా నిలుస్తోంది.ఇరాన్, పాకిస్తాన్ అణు కార్యక్రమాలు విఫలమవడం దక్షిణాసియా, మధ్యప్రాచ్య ప్రాంతాలలో శక్తి సమతుల్యతను ప్రభావితం చేస్తుంది. ఇరాన్ విషయంలో, అణు కార్యక్రమం ఆగిపోవడం ఇజ్రాయెల్, సౌదీ అరేబియా వంటి దేశాలకు వ్యూహాత్మక ప్రయోజనం కల్పిస్తుంది. పాకిస్తాన్ విషయంలో, అణు ఆయుధాల ఆధునీకరణలో వెనుకబడటం భారత్‌తో రక్షణ సమతుల్యతను దెబ్బతీస్తుంది. ఈ రెండు దేశాలూ తమ అణు ఆకాంక్షలను కొనసాగించాలంటే, ఆర్థిక స్థిరత్వం, అంతర్జాతీయ సహకారం కీలకం.

### పాకిస్థాన్‌ను దెబ్బకొట్టిన భారత్..

పహల్గాం ఉగ్రదాడకి ప్రతీకారంగా భారత్ చేపిట్టిన ఆపరేషన్ సిందూర్‌తో 9 ఉగ్రస్థావరాలతోపాటు 11 ఎయిర్ బేస్‌లు ధ్వంసమయ్యాయి. కిరాణా హిల్స్‌లోని పాకిస్థాన్ అణు మానిటరింగ్ సిస్టం దెబ్బతిన్నది. నూర్‌ఖాన్ ఎయిర్ బేస్‌పై దాడితో అమెరికాకు నష్టం కలిగింది.ఇక ఇజ్రాయెల్ దాడితో ఇప్పుడు ఇరాన్ అణ్వాయుధాలు కూడా దెబ్బతిన్నాయి. కనీసం మూడు దశాబ్దాలు వెనక్కి వెళ్లింది. అంటే అణ్వాయుధాలు పునరుద్ధరించుకోవాలంటే మరో 30 ఏళ్లు పడుతుంది. అమెరికా సహకారంతో ఇజ్రాయెల్ టెహ్రాన్‌తోపాటు అణుస్థావరాలను ధ్వంసం చేసింది. ఆర్థికంగానూ ఇరాన్‌ను దెబ్బతీసింది.ఇరాక్, ఇరాన్, పాకిస్తాన్‌ల అణు కార్యక్రమాలు రాజకీయ, ఆర్థిక, అంతర్జాతీయ ఒత్తిళ్ల వల్ల చిన్నాభిన్నమవుతున్నాయి. ఈ దేశాలు తమ అణు ఆకాంక్షలను సాకారం చేసుకోవాలంటే, దౌత్యపరమైన సంబంధాలను మెరుగుపరచడం, ఆర్థిక స్థిరత్వాన్ని సాధించడం అవసరం. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ దేశాల అణు కలలు అంతర్జాతీయ ఒత్తిళ్ల నీడలో కమిలిపోతున్నాయి.

# అండమాన్ లో భారీగా చమురు నిల్వలు




**న్యూఢిల్లీ, జూన్ 20, ( వెలుతురు)**

ఇప్పటికే భారత్ నాలుగో ప్రపంచ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగింది. జపాన్ దేశాన్ని పక్కనపెట్టి.. జర్మనీని అధిగమించి.. మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి ప్రయత్నాలు చేస్తోంది. అదే గనక వాస్తవరూపం దాల్చితే జర్మనీ మన తర్వాతి స్థానంలోకి వెళ్లిపోతుంది.ఎలాగూ మూడో స్థానంలోకి వెళ్తాం కాబట్టి మన ముందు కేవలం డ్రాగన్, అమెరికా దేశాలు మాత్రమే ఉంటాయి. అప్పుడిక ఆ రెండు దేశాలను అధిగమించడానికి మనం ప్రయత్నాలు చేయాల్సి ఉంటుంది. అయితే అన్నీ మంచి శకునములే అన్నట్టుగా.. భారత్ రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగడానికి చేస్తున్న ప్రయత్నం ఫలించే విధంగా కనిపిస్తోంది. ఒకవేళ అదే గనుక వాస్తవరూపం దాల్చితే.. ప్రపంచంలోనే మనం రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉంటాం. చైనాను సైతం పడగొట్టి.. అమెరికాకు సవాల్ విసిరేస్థాయిలో ఉంటాం. ఇంతకీ మన శాస్త్రవేత్తలు ఏం కనుగొన్నారు? కేంద్ర మంత్రి ఎలాంటి కీలక వ్యాఖ్యలు చేశారు? ఇంతకీ అండమాన్ సముద్రంలో ఏముంది? అది వెలికి తీస్తే ఏం జరుగుతుంది?ప్రపంచ గమనాన్ని మార్చుతుంది కేవలం ఒకటే ఒకటి. అదే ముడిచమురు. ఆ చమురు నిల్వలు ఉన్న దేశాలు ఆర్థికంగా పరిపుష్టంగా ఉన్నాయి. దుబాయ్ ప్రపంచంలోనే అతిపెద్ద వాణిజ్య నగరంగా ఏర్పడిందంటే దానికి కారణం చమురు మాత్రమే. ఆ చమురు కోసమే అమెరికా ఇరాన్, ఇరాక్ వంటి దేశాలపై యుద్ధాలు చేసింది. చమరు నిల్వలపై గుత్తాధిపత్యాన్ని సాధించడానికి రకరకాల ప్రయత్నాలు చేసింది. చివరికి ఎంతో కొంత విజయం సాధించింది. ఇక ఉక్రెయిన్ తో ఏళ్ల పాటు యుద్ధం సాగిస్తున్న రష్యా.. ఆర్థికంగా ఇప్పటికీ అదే స్థాయిలో ఉండడానికి ప్రధాన కారణం చమురు మాత్రమే. అందువల్లే చమురు ప్రపంచ ఆర్థిక రంగాన్ని శాసిస్తోంది. అయితే ప్రపంచంలోనే అతిపెద్ద జనాభా ఉన్న మనదేశంలో చమురు నిల్వలు అంతంత మాత్రమే. పైగా అవి మన దేశీయ అవసరాలకు సరిపోవు. అందువల్లే విదేశాల నుంచి ముడిచమురు దిగుమతి చేసుకోవాల్సి ఉంటుంది. దీనికోసం భారీగా విదేశీ మారక ద్రవ్యాన్ని ఖర్చు చేయాల్సి వస్తోంది.ఇక మనదేశంలో విస్తారంగా సముద్రాలు ఉన్నాయి. అయితే ఇలాంటి సముద్రతీరం ఉన్న ప్రధాన ప్రాంతాలలో అండమాన్ ఒకటి. ఈ అండమాన్ సముద్రంలో కొంతకాలంగా మన శాస్త్రవేత్తలు ప్రయోగాలు చేస్తున్నారు. ఆ ప్రయోగాలు ఇప్పుడు సత్ఫలితాన్ని ఇచ్చినట్టు కనిపిస్తోంది. ఎందుకంటే అండమాన్ సముద్రంలో దాదాపు 11.6 బిలియన్ బ్యారెళ్ల చమురు నిల్వలు ఉన్నాయి. వీటిని కనుక వెలికి తీస్తే మన ఎకానమీ 3.7 ట్రిలియన్ డాలర్ల నుంచి 20 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని కేంద్ర మంత్రి హార్దీప్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు.. మన దేశం ముడిచమురు దిగుమతుల్లో ప్రపంచంలో మూడో స్థానంలో ఉంది. ఈ చమురు కోసం భారీగా విదేశీ మారక నిల్వలను ఖర్చు చేస్తోంది. ఒకవేళ ఈ చమురు గనుక వెలికి తీసినట్టయితే.. అప్పుడు దేశ అవసరాలతో పాటు.. ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేసే అవకాశం ఉంటుంది. అప్పుడు మన దేశం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగుతుంది. ప్రపంచ దేశాలను అధిగమించి.. రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా.. అన్ని అనుకూలిస్తే ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుంది.

# ప్రైవేట్ స్కూళ్ల విద్యా వ్యాపారం

● తడిసి మోపెడవుతున్న చదువు భారం

**నిజామాబాద్,జూన్20( వెలుతురు):**

ప్రైవేటు పాఠశాలల తీరుపై విద్యాశాఖ అధికారుల్లో పూర్తిగా నిర్లక్ష్యం కనిపిస్తోంది. కనీస వసతులు కరవైనా పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. అనుమతులు సహా ఇతర వ్యవహారాల్లోనూ పర్యవేక్షణ కొనసాగించడం లేదు. కమీషన్లతో వ్యాపారం .. కొన్ని పాఠశాలల యాజమాన్యాలు ఆయా పుస్తక విక్రయ దుకాణాలతో ముందస్తు ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్నాయి. కొన్ని ప్రైవేటు బడుల్లో ఫీజులుం కొనసాగుతోంది. ఫీజుల విషయంలో ఇప్పటికే విద్యార్థి సంఘాలు పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. వాటి నియంత్రణ దిశగా కనీస చర్యలకు చేపట్టలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బడి ఆవరణలో ఎట్టిపరిస్థితుల్లో విద్యను వ్యాపారం చేసేలా పుస్తకాలు, ఏకరూప దుస్తులను విక్రయించవద్దనే నిబంధనను ఉల్లంఘిస్తున్నా..చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. వసతులు, సౌకర్యాలు ఎలా ఉన్నా నాణ్యమైన విద్య ముసుగులో అక్రమార్జనకు కొన్ని పాఠశాలలు తెరతీస్తున్నాయి. బడుల్లో పుస్తకాలు, ఏకరూప దుస్తులను విక్రయించవద్దని.. ప్రభుత్వం, న్యాయస్థానం ఆదేశించినా జిల్లాలో ఆ వ్యవహారం బాహాటంగానే సాగుతోంది. కాసుల కక్కుర్తితో బడిలో వ్యాపారం నడుస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వారు చెప్పిన ఫీజును కాదనలేక.. పుస్తకాలను మరో చోట కొనలేక నానాతంటాలు పడుతున్నారు. ఎల్‌కేజీ విద్యార్థి పుస్తకాలకే రెండువేల వరకు ఖర్చవుతోంది. ఇక కెజీ పెరిగిన కొద్దీ రకరకాల పుస్తకాలు కావాలంటే జేబు గుల్లకాక తప్పడంలేదు. వీటికితోడుగా రాత కోసం మరో 10 నోటు పుస్తకాలను కొనాల్సిందే. బడికి బస్సులోనే పంపాలి. ఇందుకోసం నెలకు రవాణా రుసుం కట్టాలి. పుస్తకాలకు డ్రెస్‌లకు మరో రెండు వేలు, బెల్టు, బ్యాగు, బూట్లు ఇతర నోటు పుస్తకాలకు మరో మూడువేలు వసూల చేస్తున్నారు. పిల్లలుఫలానా షాపులోనే ఇవన్నీ కొనే విధంగా రహస్య ఒప్పందాలు కొందరు కుదుర్చుకున్నట్లు సమాచారం. పుస్తక దుకాణాల వారే అధికంగా అన్ని పా ఠశాలలతో ఒప్పందాన్ని



కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఒక్కో పాఠశాల నుంచి సుమారు 400 నుంచి 1200 మంది పిల్లలు ఉంటున్నారు. ఇలా వారి సంఖ్యను బట్టి బడులకు కమీషన్ అందిస్తున్నట్లు తెలుస్తోంది. పిల్లలకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, రాత పుస్తకాలన్నీ అక్కడే కొనాలే నిబంధనను పెడుతున్నారు. దీంతో విధిలేని పరిస్థితుల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వారి చెప్పిన ధరలకే తీసుకోవాల్సి వస్తోంది. ఇలా జిల్లా వ్యాప్తంగా కొన్ని విద్యాసంస్థలు కోట్ల రూపాయల్లో లావాదేవీలు చేస్తున్నాయంటే అతిశయోక్తి కాదు. ఒక్కో బడిలో ఒక్కో విధమైన ధరల్ని నిర్ణయించారు. తరగతుల వారీగా పాఠ్యపుస్తకాలతోపాటుగా నోటు పుస్తకాలను అమ్ముతున్నారు. ఏ ఒక్కటి తీసుకోకున్నా ఒప్పుకోవడం లేదు. సట్టణంలో ఒకటి రెండు బడులకు మినహాయిస్తే ఏ ఒక్క చోట విద్యార్థులు ఆడుకునేందుకు మైదానాలు లేవు. పైగా విద్యార్థులకు క్రీడల కోసం కొన్ని చోట్ల ప్రత్యేక ఫీజు వసూలు చేస్తున్నారు. మైదానం సంగతేంటని.. తల్లిదండ్రులు ప్రశ్నిస్తే వారంలో ఒక రోజు పట్టణశివారులో ఉన్న మైదానానికి పిల్లలను బస్సులో తీసుకెళ్తామనే సమాధానాలు వినిపిస్తున్నాయి.

# యోగాతో...ఆరోగ్యమే మహా భాగ్యం

**హైదరాబాద్,జూన్20( వెలుతురు):**

ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నారు పెద్దలు. శరీరం ఆరోగ్యంగా ఉంటేనే జీవితంలో సుఖం, సంతోషం, సమృద్ధి సాధ్యం. దీనికి ఆర్థిక ఆరోగ్యమూ ఎంతో ముఖ్యం. యోగా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. జూన్ 21, అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో ప్రపంచమంతా ఏటా ఈ కార్యక్రమంలో పాలుపంచుకుంటున్నారు. యోగాలో ఒక ఆసనాన్ని సాధన చేయాలంటే ఎంతో శ్రద్ధ, క్రమశిక్షణ అవసరం. ఒక్క రోజు సాధనతో పరిపూర్ణత రాదు. ఇది నిరంతర అభ్యాసం. ఇలా చేయడం వల్ల దీర్ఘకాలంలో గణనీయమైన ఆరోగ్యాన్ని సృష్టించవచ్చు. యోగా సాధనలో మనసు, శరీరం సమతుల్యంగా ఉండాలి. అప్పుడే ఆరోగ్యం సాధ్యం.యోగాలో ఒక ఆసనాన్ని పరిపూర్ణంగా చేయాలంటే ఓపిక అవసరం. ఒక్క రోజులోనే శరీరం ఆ ఆసనానికి అనువుగా మారదు. మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచేందుకు యోగా, ధ్యానం ఎంతో తోడ్పడతాయి. కష్టమైన ఆసనాల్ని వేసినప్పుడు వచ్చిన సంతృప్తి, మనల్ని ధైర్యవంతులుగా మారుస్తుంది. అదే విధంగా మన మీద మనకు విశ్వాసం అవసరం. యోగా ఒత్తిడిని తగ్గించడంలో సాయం చేస్తుంది. ప్రాణాయామం, ధ్యానం వంటివి మనసును ప్రశాంతంగా ఉంచుతాయి. ఆర్థిక జీవితంలోనూ ఒత్తిడిని ఎదుర్కోవడం కీలకం. ఈ సమయంలో ప్రశాంతంగా ఆసనాలు వేయడం అవసరం.

# మిర్చి కన్నా పత్తి సాగే బెటర్

● పత్తివైపు అధిక రైతుల మొగ్గు



**ఆదిలాబాద్,జూన్20( వెలుతురు):**

అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి.. అన్న చందంగా మారింది మిర్చి రైతుల పరిస్థితి. ప్రభుత్వాల అసమర్థత కారణంగా ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అల్లాడారు. కనీసం పండించిన పంటను అమ్మదామంటే మార్కెట్లో కొనేవారు కరవయ్యారు. దిక్కుతోచక పంటను కొందరు స్వయాన తగులబెట్టి తమ కడుపు మంటను వెళ్లగక్కారు. మరికొందరు కూలీ కూడా వెళ్లదని పంటను చేలల్లోనే వదిలేసారు. చేసేది లేక నిస్సహాయంగా ఆగ్రహాన్ని, ఆవేదనను తమలోనే అణచివేసుకున్నారు. దీంతో ప్రస్తుతం మళ్లీ మిర్చివేయాలంటేనే భయపడుతున్నారు. దీంతో మరోమారుపత్తి వేసేందుకు రైతులు సమాయత్తం అయ్యారు. మిరప పంట సాగు చేసినా అందుకు తగ్గట్లు మార్కెట్ సౌకర్యం లేకపోవడం, రోజురోజుకు ధర తగ్గడం వల్ల మిరప పంట సాగుచేసిన రైతులకు శాపంగా మారింది. పత్తి పంటకు బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ప్రభుత్వం సూచించిన మేరకు అన్నదాతలు పంట మార్పిడికి శ్రీకారం చుట్టారు. దీనికితోడు జిల్లాలో మిరప పంటకు అనువైన నేలలు ఉండటంతో ఎక్కువ మంది రైతులు పత్తికి బదులు మిరప వైపు మొగ్గుచూపారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా పత్తి, వరి పంటల తర్వాత మూడో పంటగా మిరప సాగు చేయడం విశేషం. పంటను మార్కెట్‌కు తరలిస్తే ఖర్చులు కూడా వెళ్లక మిరప రైతు కుదేలు అయ్యారు. మొదట తీసిన పంటే పూర్తి స్థాయిలో అమ్మకపోగా.. కనీసం మరో రెండు దఫాలుగా తీయాల్సిన పంట చేలోనే ఉండిపోయింది. దిగుబడులు ఆశాజనకంగా ఉన్నా.. అందుకు తగ్గట్లు ధర లేకపోవడం మిరప రైతులను కుదేలు అయ్యేలా చేసింది. స్థానికంగా మిరప పంటను కొనుగోలు చేసేందుకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో జిల్లా రైతులు పక్క రాష్ట్రంలోని నాగ్‌పూర్ మార్కెట్‌పై ఆధారపడ్డారు. గతేడాది పలికిన ధరే ఈసారి పలుకుతుందని.. కష్టాలు తీరుతాయని కౌలుకు తీసుకొని కొందరు పంట సాగు చేశారు. మిర్చి ద్వారా నష్టపోయిన రైతులు ఇప్పుఉడ పత్తి ద్వారా అదృష్టం పరీక్షించుకోబోతున్నారు.

# మత్తడివాగును ఆధునీకరించాలి

- ఆయకట్టు రైతుల వినతి


**ఆదిలాబాద్,జూన్20( వెలుతురు):**

జిల్లాలోని తాంసి మండలం వడ్డాడి సమీపంలో నిర్మించిన మత్తడివాగు ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణంతో 1200 ఎకరాలకు సాగునీరు అందనుంది. దీనిని పూర్తిస్థాయిలోకి అందుబాటులోకి తీసుకుని వస్తే రైతులకు మేలు జరుగనుంది. జిల్లాలోని తాంసి, ఆదిలాబాద్, జైనథ్ మండలాల రైతుల భూములకు సాగునీరు అందించేందుకు తాంసి మండలం వడ్డాడిలో 2004లో మత్తడివాగు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. 2008 ఆగస్టులో ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యాయి. ఈ కాలువ ద్వారా వడ్డాడి, కప్పర్ల, బండలనాగాపూర్, జామిడి, చాందా-టి. సిర్సన్న, భోరజ్, సావర్‌గాం, తరోడ, మల్లాపూర్ భీంసరి, జందాపూర్ గ్రామాల్లోని 8500 ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంగా పనులు చేపట్టారు. ప్రాజెక్టు కుడికాలువ నిర్మాణంతో 1200 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందనుంది. రైతులు పంటలు సాగుచేసే ప్రతి ఎకరానికి సాగునీరు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రాజెక్టుల ఆధునీకీకరణతో ఆయకట్టు భూములు సస్యశ్యామలంగా మారను న్నాయని రైతులు అంటున్నారు. రైతులు రెండు పంటలు సాగుచేసుకునే అవకాశాలుండడంతో ప్రభుత్వం ఈ కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.ఈ కాలువ నిర్మాణంతో తాంసి మండలం హస్నాపూర్, పొన్నారి, తలమడుగు మండలం ఖోడద్ గ్రామాలకు చెందిన రైతులకు ప్రయోజనం చేకూరనుంది.

# కార్పోరేట్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణ ఏదీ ?

**ఏలూరు,జూన్20( వెలుతురు):**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాల వల్ల ప్రభుత్వరంగం నిర్వీర్యమవుతుందని సిపిఐ జిల్లా కార్యదర్శి డేగా ప్రభాకర్ తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి బిసి, మైనార్టీలకు ప్రయివేటురంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని,కార్పొరేట్ కాలేజీల్లో, స్కూళ్లలో ఫీజుల నియంత్రణ ఉండాలని డిమాండ్ చేశారు. సహజ వాయువుల వెలికితీతతో సారవంతమైన భూములు నాశనం కావడమే కాకుండా పర్యా వరణానికి పెనుముప్పు వాటిల్లుతుందన్నారు. జిల్లాలోని అండలూరు, కృష్ణా జిల్లా మోదుగుమూడి, కొమరల్లపూడి తీరప్రాంతాల ప్రజలు భయాందోళన చెందుతున్నారన్నారు. దీనివల్ల ఉత్పన్నమయ్యే మిథేన్ భూతాపాన్ని పెంచుతుందని, అణుధార్మిక రాడన్ వాయువు వెలువడి వాయుకాలుష్యం ఏర్పడుతుందని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారని తెలిపారు.




# అంతరించిపోతున్న బీడీ పరిశ్రమ

● ప్రత్యామ్నాయ వృత్తుల్లో బీడి కార్మికులు


**నిర్మల్,జూన్20( వెలుతురు):**



ప్రస్తుతం మారిన పరిస్థితుల కారణంగా జిల్లాలో బీడీ పరిశ్రమ దాదాపుగా అంతరించిపోయిందనే అంటున్నారు. రోజురోజుకూ బీడీ పరిశ్రమ బలహీన పడుతుండటం కార్మికులకు శాపంగా మారుతోంది. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, పొగాకు వినియోగానికి వ్యతిరేకంగా ప్రభుత్వాలు చేస్తున్న ప్రచారాలు, సిగరెటఁ వినియోగ ప్రాబల్యం పెరగడం లాంటి అంశాలన్నీ బీడీ పరిశ్రమను దెబ్బతీస్తూ వస్తున్నాయి. వేలాది మంది బీడీ కార్మికులకు ఉపాధిపై భరోసా రోజురోజుకూ కరవవుతున్న క్రమంలో తప్పుకుంటు న్నారు. పొగాకు దుష్ఫలితాలపై సమాజంలో అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నం లక్షలాది మంది బీడీ కార్మికుల జీవనాన్ని ప్రభావితం చేస్తోంది. కారణం.. బీడీ పరిశ్రమ కేంద్రీకృతమైన ఈ ప్రాంతంలో ప్రత్యామ్నాయ ఉపాధి కరవైంది. బీడీ వినియోగం తగ్గిపోవడంతో ఈ పరిశ్రమ యజమానులు ఉత్పత్తిని తగ్గిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో బీడీకి డిమాండ్ వారిపై ఆధారపడి జీవిస్తున్న వారందరికీ స్వయం ఉపాధిపై, వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి తాత్కాలిక ఉద్యోగులుగా తీసుకోనున్నారు. ఎన్నో సంవత్సరాలుగా ఇదే వృత్తిని నమ్ముకొని వీరంతా జీవనం సాగిస్తున్నారు. బీడీ పరిశ్రమ సంక్షోభంలో నెట్టుకొస్తున్న తరుణంలో ప్రభుత్వం వీరికి ఉపాధి అవకాశాలు కల్పించడంతో బతుకులు బాగుపడనున్నాయి. నిర్మల్ జిల్లాలో ఉన్న 60 వేల మంది కార్మికులతో పాటు వారిపై ఆధార పడుతున్న దాదాపు మరో 1.50 లక్షల మందికి ఉంటారని కార్మికశాఖ అధికారులు అంచనా వేశారు. ఉద్యానవనం (పండ్లు, పూలు, కూరగాయల సాగు), కోళ్ల పరిశ్రమ, గేదెలు, గొర్రెల పెంపకం, కుట్టు శిక్షణ, ఎంబ్రాయిడరీ, చేతి వృత్తులు, అగర్‌బత్తుల తయారీ, పాపడ్, పచ్చళ్ల తయారీపై ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు వివిధశాఖల్లో దినసరి ఉద్యోగాలుగా పనులు చేసేందుకు కూడా శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో టైలరింగ్, బ్యూటీషియన్, బ్యాంకింగ్, ౖ÷నాన్స్, బీమా ఏజెంట్లు, ఆసుపత్రుల్లో సేవలు, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్, పశు వైద్య సేవలపై శిక్షణ ఇవ్వనున్నారు. బీడీ కంపెనీలు ఎప్పుడు మూతపడుతున్నాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. బీడీలు చుట్టుడమే జీవనాధారంగా ఉన్న అనేక కుటుంబాల భవితవ్యం ప్రశ్నార్థకం అవుతుంది. స్వయం ఉపాధి పొందేందుకు రుణ సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

# అస్తవ్యస్థంగా డ్రైనేజీ వ్యవస్థ

- పట్టణాల్లో మారని పరిస్థితులు



**వరంగల్,జూన్20( వెలుతురు):**

అసంపూర్తి డ్రైనేజీలు, నివాసాల మధ్య ఖాళీ స్థలాల్లో మురుగు గుంతలు అభివృద్ధిని వెక్కిరిస్తుంటాయి. ఏటా కోట్ల నిధులు ఖర్చుచేస్తున్నా ఏ కాలనీకి మురుగు నుంచి విముక్తి దక్కడంలేదు. దశాబ్దాల కాలంగా మున్సిపల్ పట్టణాలకు డ్రైనేజీలకు వెచ్చిస్తున్న నిధులు నిష్ఫలం అవుతున్నాయి. నిధులు ఖర్చు అవుతున్నా మురుగు నీటికి పరిష్కారం లభించడం లేదు. ఇలా పెద్ద నగరాల్లో సైతం డ్రైనేజీ అవ్యవస్థను చూస్తే ఈ అనుమానాలు కలగకమానవు. దశాబ్ద కాలంలో సుమారుగా కోట్ల వరకు వ్యయం చేసి ఉంటారని అంచనా. ఏటా బల్దియాకు విడుదలయ్యే నిధుల్లో మొదటి ప్రాథమ్యంగా డ్రైనేజీలకే కేటాయిస్తుంటారు. ఇన్ని నిధులు కేటాయించినా ప్రణాళిక లేని నిర్మాణాలతో నిధులు నిష్ప్రయోజనంగా మారుతున్నాయి. కాలువల నిర్మాణం చేపట్టే సమయంలో నిర్దేశిత ప్రమాణాలు పాటించక పోవడం, నాణ్యతకు తిలోదకాలివ్వడంతో మురుగు నీటి పారుదల వ్యవస్థ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పాత కాలువల స్థానంలో కొత్తవి వేస్తున్నా పైపులు వేయకుండా మళ్లీ ఓపెన్ డ్రైనేజీ కొనసాగిస్తున్నారు. దీంతో మళ్లీ చెత్తాచెదారం నిండడం మినహా ప్రయోజనం ఉండదు. ఆర్థిక సంఘం, రాష్ట్ర ఆర్థిక సంఘం, ప్రణాళిక, ప్రణాళికేతర, ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక పద్దుల కింద వచ్చిన నిధులతో వీటి నిర్మాణాలు చేపట్టారు. ఈ ఒక్క ఏడాదిలోనే పెద్ద మొత్తంలో ఖర్చు చేశారు. అంతకుముందు వివిధ పథకాల్లో వచ్చిన నిధులు ఈ పనులకే వెచ్చించారు. ఇళ్ల నిర్మాణ అనుమతుల్లో బెటర్‌మెంట్, డెవలప్‌మెంట్ పేరిట రుసుములు వసూలు చేస్తారు. ఇందుకు తగ్గట్లుగానే మురుగు కాలువలు, రహదారులు, తాగు నీటి సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. లేఅవుట్ లేకుండా రోజుకో కాలనీ పుట్టుకొస్తున్న తరుణంలో భగర్భ మురుగు నీటి పారుదల వ్యవస్థ పెద్ద సవాలుగా మారింది. ఈ నేపథ్యంలో వచ్చిన నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీలు ప్రణాళికా బద్ధంగా ఉండటంలేదు. వచ్చిన నిధులతో డ్రైనేజీలు నిర్మించామా లేదా అన్నదే ప్రధానంగా మారింది. నిధుల రాకను బట్టి ఒక్కో వీధికి ఒక్కోసారి ప్రాధాన్యతనిస్తున్నారు. ప్రమాణాలు పాటించకుండా నిర్మిస్తున్న కాలువలు ప్రజలకు సౌకర్యవంతంగా ఉండటం లేదు. నిధులు బురదలో పోసినట్లవుతుంది. పట్టణానికి మురుగు సమస్య తీరడం లేదు.

# జోరుగా మంచినీటి వ్యాపారం

- నిబంధనలు పాటించని ప్లాంట్లు



**జగిత్యాల,జూన్20( వెలుతురు):**

నీటిశుద్ధి కేంద్రాల ఏర్పాటులో నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. ఇళ్ల సమీపంలోనే గొట్టపుబావులను తవ్విస్తూ అనుమతులు లేకుండానే కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే వందలాది నీటిశుద్ధికేంద్రాలు ఏర్పాటు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న వ్యక్తి పర్యవేక్షణలో వివిధ రసాయనాలను కలిపి నీటిని శుద్ధి చేయాల్సి ఉండగా అవేమీ పట్టించుకోవడం లేదు. ఫలితంగా నీటిలో ఉండే ఖనిజలవణాలు, పోషకాలు పూర్తిగా తొలగిపోతున్నాయి. ఇలాంటి నీరు తాగడంతో కొద్ది రోజులకే ఎముకలు, కీళ్ళ సంబంధిత వ్యాధులు సోకుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల జిల్లాలో తాగునీటికి తీవ్ర ఎద్దడి నెలకొనడంతో కరవులోనూ కొందరు వ్యాపారులు శుద్ధజలం పేరిట సొమ్ముచేసుకున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో మూడు పువ్వులు ఆరు కాయలుగా నీటిదందా కొనసాగుతోంది. ఈ నీటిని తాగిన ప్రజల ఆరోగ్యం మెరుగు పడకపోగా మరింత క్షీణించే పరిస్థితి నెలకొంటుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లలో వినియోగం ఎక్కువగా ఉండటంతో పాటు శు భకార్యాలు ఎక్కువగా జరిగే ప్రస్తుత వేసవిలో సాంకేతికకు తిలోదకాలు ఇస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొందరు చల్లని నీటి పేరుతో మరింతగా సొమ్ముచేసుకుంటున్నారు. చల్లని నీటి క్యాన్‌కు రూ.20నుంచి రూ.40వరకు వసూలు చేస్తున్నారు. వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే సంబంధిత పురపాలక, నగరపాలక సంస్థలతోపాటు గ్రామ పంచాయతీ, వాణిజ్య పన్నులు, రెవెన్యూ, ఆహార నియంత్రణశాఖ, భూగర్భజలవనరుల శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. చాలామంది నిర్వాహకులు పన్నులను ఎగ్గొట్టడంతో ప్రభుత్వ ఖజానాకు చిల్లు పడుతుంది.

# సంక్షోభంలో వ్యవసాయ రంగం

- కౌలు రైతులను ముంచుతున్న విధానాలు

**ఏలూరు,జూన్20( వెలుతురు):**

దేశంలో వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని కౌలు రైతు సంఘ నేతలు అన్నారు. బడా కంపెనీలకు లాభం చేకూర్చేందుకు వ్యవసాయ భూములు లాక్కుని రైతులను నట్టేట ముంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2011 కౌలు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు, సామాజిక భద్రత పథకాలు అమలు చేయాలని కోరారు. వ్యవసాయ రంగాన్ని రక్షించుకునేందుకు రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతులు ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. ఉపాధి హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రపంచంలో భూతాపం పెరిగిపోయి వాతావరణ సమతుల్యం దెబ్బతిన్నదన్నారు. వ్యవసాయరంగంపై అధ్యయనం చేసేందుకు 52 కమిషన్లు వేశారని, ఒక్క కమిటీ సిఫారసు కూడా అమలు చేయలేదని తెలిపారు. ఆర్థిక సంస్కరణల కారణంగా దేశంలో వ్యవసాయ రంగం కుదేలైందన్నారు. స్వదేశంలో ఉత్పత్తి అవుతున్న వస్తువులను కూడా దిగుమతి చేసుకుంటున్నారని పేర్కొన్నారు. దీంతో దేశంలోనూ, రాష్ట్రంలోనూ కుటీర పరిశ్రమలు దెబ్బతిన్నాయని వివరించారు. చంద్రబాబు హయాంలో నీటి తీరువా వసూలు చేసే పద్ధతి ప్రవేశపెట్టారని అన్నారు. తెలిపారు. విద్యుత్ ఛార్జీలు వసూలు చేయడం, మార్కెట్ నియంత్రణ లేకపోవడం వంటివి ఆయన హయాంలోనే చోటు చేసుకున్నాయన్నారు.

# 8 వసంతాలు...కొత్త ప్రయత్నం

అగ్ర నిర్మాణ సంస్థలు అప్పుడప్పుడూ కొత్తతరంతో... పరిమిత వ్యయంతో కూడిన సినిమాలు కూడా నిర్మిస్తుంటాయి. అలా మైత్రీ మూవీ మేకర్స్ నుంచి వచ్చిన చిత్రమే... '8 వసంతాలు'. పలువురు కొత్తతరం నటులు కలిసి నటించిన ఈ చిత్రం శుక్రవారం పరేక్షకుల ముందుకు వచ్చింద. ఓ ప్రేమజంట జీవితంలోని 8 వసంతాల కథ ఇది. శుద్ధి అయోధ్య (అనంతిక సనీల్‌కుమార్) అనే యువతి ఓ రచయిత. ఊటీలో ఉంటూ తన టీనేజ్‌లోనే ఓ పుస్తకం రాస్తుంది. దాంతో ఎంతోమంది అభిమానుల్ని సొంతం చేసుకుంటుంది. మార్షల్ ఆర్ట్స్‌లోనూ ఆమె ప్రావీణ్యం సంపాదిస్తుంది. ప్రయాణాలు, రచనలు, మార్షల్ ఆర్ట్స్‌తో గడుపుతున్న ఆమె జీవితంలోకి వరుణ్ (హను రెడ్డి) వస్తాడు. కొన్ని రోజుల్లోనే ఇద్దరి మనసులు కలుస్తాయి. వరుణ్ తన మనసులోని మాటని చెబుతాడు. శుద్ధి కొంత సమయం కావాలని కోరుతుంది. అందుకు వరుణ్ కూడా అంగీకారం చెబుతాడు. అలా కొన్ని నెలలు గడిచిపోతాయి. ఆ తర్వాత శుద్ధి తన మనసులోని ప్రేమని వ్యక్తపరచాలని ఎంతో ఆత్రుతగా వరుణ్ దగ్గరికి వస్తుంది. మరి వరుణ్... ఆమె ప్రేమని స్వీకరించాడా? ఈ మధ్యలో వరుణ్ జీవితంలో ఏం జరిగింది? వరుణ్ విదేశాలకు వెళ్లిపోయిన తర్వాత ఆమె జీవితంలోకి వచ్చిన సంజయ్ (రవి దుగ్గిరాల) ఎవరు? శుద్ధి ఎనిమిది వసంతాల ప్రేమ ప్రయాణంలో ఎన్నో మలుపులు చోటుచేసుకున్నాయన్నది చిత్ర కథ. 8 వసంతాలు కవితాత్మకంగా సాగే ఓ ప్రేమకథ ఇది. తెరపైన కనిపించే ప్రతి ఫ్రేమ్... ప్రతి సంభాషణ భావుకతని నింపుకొని ఉంటాయి. విజువల్స్ వరకూ కట్టిపడేసినా... ఒక దశ దాటిన తర్వాత సంభాషణలే కృత్రిమంగా అనిపిస్తాయి. అవి సినిమాపై ఏమాత్రం ప్రభావం చూపించకపోగా, పాత్రలతో పనిగట్టుకొని పలికించినట్టుగా అనిపిస్తాయి. భావుకత గురించి ఎక్కువగా ఆలోచించిన దర్శకుడు... భావోద్వేగాల సంగతిని మరిచిపోయాడు. దాంతో కథ హృదయాల్ని తాకదు. కథనం నెమ్మదిస్తుంది. కొంతలో కొంత ప్రథమార్ధం ఈ సినిమాకి బలం. వరుణ్, శుద్ధి కలవడం, ఆ ఇద్దరి మధ్య ప్రేమ చిగురించే సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. విరామ సన్నివేశాలు ద్వితీయార్ధంపై ఆసక్తిని పెంచుతాయి. అందంగా కనిపించిన హను రెడ్డి, అనంత మధ్య కెమిస్ట్రీ, హెషామ్ సంగీతం సినిమాని ఆకర్షణీయంగా మార్చేశాయి. అయితే విరామం తర్వాత సినిమా పూర్తిగా గాడి తప్పినట్లు అనిపించింది. ద్వితీయార్ధంలోని ప్రేమకథలో ఏమాత్రం బలం లేకపోగా, చాలా సన్నివేశాలు మెలో డ్రామాని తలపిస్తాయి. సంజయ్ రాసిన రాణిమాలిని అనే వేశ్య కథని చదివి, అతనితో ప్రేమలో పడటం కానీ, ఆ ప్రేమని త్యాగం చేయాలనుకోవడం కానీ ఏమాత్రం సహజంగా అనిపించదు. ప్రథమార్ధంలో శుద్ధి పాత్ర ఎంత బలంగా, ఎంత హుందాగా కనిపిస్తుందో... చివరికి వచ్చేసరికి ఆ పాత్ర తాలూకు ప్రభావం తగ్గిపోతుంది. అనంతిక సనిల్‌కుమార్ అందం, ఆమె నటన ఈ సినిమాకి ప్రత్యేకం. ఆమె స్క్రీన్ ప్రజెన్స్ ప్రేక్షకుల్ని కళ్లు తిప్పుకోనీయకుండా చేస్తుంది. హావభావాలు అద్భుతం అనిపిస్తాయి. లవర్‌బాయ్‌గా కనిపించిన హను రెడ్డి ప్రేమకథలకి తగ్గ హీరో అనిపిస్తాడు. అతని స్క్రీన్ ప్రజెన్స్ కూడా చాలా బాగుంది. భావోద్వేగాలతోనూ మెప్పిస్తాడు. మరో నటుడు రవి దుగ్గిరాల తన పాత్రకు న్యాయం చేశాడు. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. ముఖ్యంగా విశ్వనాథ్ రెడ్డి కెమెరా పనితనం అద్భుతం అనిపిస్తుంది. ఊటీ, కశ్మీర్ అందాల్ని ఆయన తన కెమెరాతో చూపించిన తీరు మణిరత్నం సినిమాల్ని గుర్తు చేస్తుంది. హెషామ్ సంగీతం మరో హైలైట్. దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి కవితాత్మక స్పర్శతో కథని చెప్పాలనుకోవడం మెచ్చుకోదగ్గ ప్రయత్నమే.




## నాని హిట్-3 సినిమాకు చిక్కులు

### కథను కాపీ కొట్టారంటూ కోర్టుకెక్కిన రచయిత

నాచురల్ స్టార్ నాని హీరోగా, శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హిట్-3'. మే 1వ విడుదలైన ఈ సినిమా ఘన విజయం సాధించింది. నాని కెరీర్‌లోనే 100 కోట్ల క్లబ్‌లో చేరింది. అయితే తాజాగా ఈ సినిమా చిక్కుల్లో పడింది. ఈ సినిమాలో తన కథను కాపీ కొట్టారని అంటూ.. ఓమహిళ కోర్టుకెక్కింది. హిట్-1, హిట్-2 చిత్రాల సిరీస్‌లో భాగంగా శైలేష్ హిట్-3ని తెరకెక్కించారు. అయితే తన స్టోరీని కాపీ కొట్టారంటూ మహిళా రచయిత విమల్ సోని మద్రాస్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. అంతేకాక విమల్ సోని నానికి వీరాభిమాని అని పేర్కొన్నారు. తాను రాసిన ఏజెంట్ 11, ఏజెంట్ కథల నుంచి హిట్-3 సినిమాను తీశారని ఆమె తెలిపారు. దీంతో హిట్-3 మేకర్స్‌పై కాపీరైట్ కేసు వేశారు. ఆమె రచించిన ఒరిజినల్ కాపీని కోర్టుకు సమర్పించారు. అయితే గతంలో కూడా దర్శకుడు శైలేష్ కొలను ఇలాంటి వివాదాన్ని ఎదురుకున్నారు. వెంకటేష్ హీరోగా ఆయన 'సైంధవ్' అనే సినిమాను తెరకెక్కించిన విషయం తెలిసిందే. ఈ సినిమా కథను కూడా కాపీ కొట్టారు అంటూ అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.




## అల్లు అర్జున్, అట్లీ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్

### యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ఫిక్స్ అయినట్లు టాక్

పాన్ ఇండియా స్టార్ అల్లు అర్జున్ హీరోగా కోలీవుడ్ స్టార్ దర్శకుడు అట్లీ డైరెక్షన్ లో సినిమా వస్తున్నా సంగతి తెలిసిందే. బన్నీ కెరీర్ లో 22వ సినిమాగా వస్తున్న ఈ సినిమాపై ఇప్పటి నుండే అంచనాలు ఓ రేంజ్ లో ఉన్నాయి. కోలీవుడ్ బిగ్గెస్ట్ ప్రొడక్షన్స్ లో ఒకటైన సన్ పిక్చర్స్ అత్యంత భారీ బడ్జెట్ పై ఈ సినిమాను నిర్మిస్తోంది. దీపికా పాడుకొనే, మృణాల్ ఠాకూర్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. కాగా ఈ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్ ఎవరు అనే క్యూరియాసిటీ నెలకొంది. అనిరుధ్, సాయి అభ్యాంకర్ వీరి ఇద్దరు పేర్లు గత కొన్ని నెలలుగా వినిపిస్తున్నాయి. కానీ ఎవరిని లాక్ చేయలేదు మేకర్స్. ఇప్పుడు అందుతున్న విస్వసనీయ సమాచారం ప్రకారం అల్లు అర్జున్, అట్లీ సినిమాకు కోలీవుడ్ యంగ్ సెన్సేషన్ సాయి అభ్యంకర్ ను ఫిక్స్ చేసారని తెలిసింది. త్వరలోనే ఈ విషయాన్నీ అధికారకంగా ప్రకటించ బోతున్నారట మేకర్స్. కోలీవుడ్ లో ఇప్పుడు సాయి సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాడు. ఇప్పటికే సూర్య నటిస్తున్న భారీ యాక్షన్ చిత్రం కరుప్పు తో పాటు లోకేష్ కనగరాజ్ నిర్మిస్తున్న బెంజ్, ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్ సినిమాలకు మ్యూజిక్ అందిస్తున్నాడు. ఇప్పుడు అల్లుఅర్జున్ ? అట్లీ కాంబోకు కు కూడా ఈ యువ సంచలం మ్యూజిక్ ఇస్తుండడం మనోడి క్రేజ్ ఎలా ఉందొ తెలుస్తోంది.



## శేఖర్ కమ్ములకు పరీక్ష పెట్టిన కుబేర

ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల రూపొందించిన తొలి మల్టీస్టారర్, పాన్ ఇండియా మూవీ 'కుబేర'. సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ నిర్మించిన ఈ చిత్రానికి శేఖర్ కమ్ముల సైతం నిర్మాణ భాగస్వామి. నాగార్జున, ధనుష్, రశ్మికా మందణ్ణ కీలక పాత్రలు పోషించిన 'కుబేర' ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దాదాపు 140 కోట్ల జనాభా ఉన్న భారతదేశంలో ఉన్నవారికి, లేనివారికి మధ్య వ్యత్యాసం నానాటికి పెరిగిపోతోంది తప్పితే తగ్గడం లేదు. ధనవంతులు మరీ ధనవంతులు అవుతుంటే, బీదవారు ప్రభుత్వాల సబ్సిడీలతో జీవితాల్ని వెళ్ళబుచ్చుతున్నారు. ఈ సబ్సిడీలు రాజకీయ పార్టీలు ఎన్నికల సందర్భంగా ఇచ్చే తాయిలాలు మాదిరిగా అయిపోయాయి. ప్రభుత్వాధీనంలో ఉండాల్సిన ప్రధాన రంగాలు సైతం నిదానంగా కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్ళిపోతున్నాయి. వాటి ద్వారా కోటాను కోట్లు సంపాదిస్తున్న ఆ కంపెనీలే ప్రభుత్వాలను ఆటాడిస్తున్నాయి. అలాంటి ఓ కార్పొరేట్ టైకూన్ కథే 'కుబేర'. దేశంలోనే అత్యంత ధనికుడైన నీరజ్ మిత్ర (జిమ్ సార్భ్) కు వరల్డ్ రిచెస్ట్ పర్సన్ గా నిలవాలనే కోరిక. దాంతో కేంద్ర మంత్రి సిద్ధప్ప (హరీశ్ పేరడి)తో డీల్ కుదుర్చుకుని లక్షల కోట్ల లంచం ఇచ్చి బంగాళఖాతంలోని ఆయిల్ డిగ్గింగ్ ఏరియాను తన వశం చేసుకుంటాడు. ప్రభుత్వానికి ఇవ్వాల్సిన లంచంలో సగం వైట్ లో, సగం బ్లాక్ లో ఇవ్వాల్సి వస్తుంది. దాంతో నిజాయితీతో నడుచుకుని జైలు పాలైన సస్పెండెడ్ సీబీఐ ఆఫీసర్ దీపక్ రాజ్ (నాగార్జున) సాయం తీసుకుంటాడు. అతన్ని జైలు నుండి బయటకు తీసుకొచ్చి... ఈ డీల్ ను ఫుల్ ఫిల్ చేసే పనిని అప్పగిస్తాడు. రంగంలోకి దిగిన దీపక్... నలుగురు బిచ్చగాళ్ళను ఎంచుకుని వారి ద్వారా కథ నడుపుతాడు. అలా వీరు ఎంచుకున్న దేవా (ధనుష్) అనే బిచ్చగాడి కారణంగా పరిస్థితులు చేజారిపోతాయి. ప్రభుత్వానికి, సంబంధిత అధికారులకు నీరజ్ ఇవ్వాల్సిన లక్షల కోట్ల లంచం ముట్ట చెప్పగలిగాడా? వరల్డ్ రిచెస్ట్ పర్సన్ కావాలనుకున్న నీరజ్ కోరిక నెరవేరిందా? తిరుపతిలో బిచ్చగాడిగా ఉన్న దేవా... ప్రభుత్వాలను శాసించగలిగే కార్పొరేట్ టైకూన్ జీవితాన్ని ఎలా అల్లకల్లోలం చేశాడు? అనేది 'కుబేర' కథ. రాజకీయ నాయకులకు బినామీలు ఉన్నట్టే... కార్పొరేట్ సంస్థలు బినామీలతో షెల్ కంపెనీస్ నిర్వహిస్తుంటాయి. వాటి ద్వారా కోటానుకోట్ల ట్రాన్సాక్షన్స్ చేస్తుంటాయి. ఒకవేళ అవినీతి నిరోధక శాఖ వంటి వారు వీరిని టచ్ చేసినా... చేతికి మట్టి అంటకుండా హాయిగా దులిపేసుకుంటారు. అనామకుల పేర్లతో దందాను సజావుగా నడిపేస్తుంటారు. ఇందులో ఆ అనామకులు నలుగురు బిచ్చగాళ్ళు! అదే ఈ కథలోని కొత్తదనం. దాంతో ఇది కోట్లకు పడగలెత్తిన ఓ మల్టీ మిలియనీర్ వర్సెస్ బెగ్గర్ కథగా మారిపోయింది. వీరిద్దరి మధ్యలో కథను నడిపేది ఓ సస్పెండెడ్ సీబీఐ ఆఫీసర్!! ఇలాంటి ఓ కథను మూడు గంటల సినిమాగా తీసి... ప్రేక్షకులను మెప్పించడం అనేది చాలా కష్టసాధ్యం. దర్శకుడిగా పాతికేళ్ళ అనుభవం ఉన్న శేఖర్ కమ్ముల వల్ల కూడా అది కాలేదు. ఈ మధ్య కాలంలో స్టార్ హీరోలు బిచ్చగాడి పాత్రలు చేయడానికి పోటీ పడుతున్నట్టుగా ఉంది. సినిమా మొత్తం కాకపోయినా.. కొన్ని సన్నివేశాలలో అయినా ఇలా డీ గ్లామర్ గా కనిపించడం జరుగుతోంది. ఇందులోనూ మల్టీమిలియనీర్ అయిన విలన్ తన డబ్బుల్ని కాపాడుకోవడానికి అలాంటి పనే చేస్తాడు. ధనుష్ బిచ్చగాడి పాత్రలో ఒదిగిపోయాడు. అతని నటనను వంక పెట్టడానికి లేదు. నిజానికి ఇందులో ధనుష్ కంటే నాగార్జున పాత్రకే నిడివి ఎక్కువ. అతని క్యారెక్టర్రే 360 డిగ్రీస్ ఉంది. తీవ్ర మానసిక సంఘర్షణకు లోనయ్యే ఆ పాత్రను నాగ్ బాగానే చేశాడు. అయితే ఆ క్యారెక్టర్ కు సినిమాటిక్ ముగింపు ఇవ్వడంతో తేలిపోయింది. ఇక రశ్మిక మందణ్ణ పాత్రను చూస్తుంటే 'చూడాలని ఉంది'లో సౌందర్య గుర్తొస్తుంది. ఆమె ప్రమేయం లేకుండానే పలు సంఘటనల్లో ఇరుక్కుపోతుంది. ఈ సినిమా చేయడం కూడా అలాంటిదే అనిపిస్తోంది. నటీనటుల్లో చెప్పుకోవాల్సిన మరో వ్యక్తి జిమ్ సార్భ్. కార్పొరేట్ టైకూన్ గా అదరగొట్టేశాడు. మిగిలిన వారూ సందర్భోచితంగా నటించారు. నాగ్ భార్య పాత్రను సునయన చేసింది. అయితే ఎంచుకున్న కథలో దమ్ములేకపోవడం, దాన్ని సరిగా తెర మీద ప్రెజెంట్ చేయక పోవడంతో ప్రేక్షకులు నిరాశకు గురికాకతప్పదు. సగటు ప్రేక్షకుడు కనెక్ట్ కాలేని కథను రాసుకుని శేఖర్ కమ్ముల తప్పుచేశారనిపిస్తుంది.




## సినిమా వాళ్ల కోసం సితారే జమీన్ పర్

### ప్రియురాలు గౌరీ స్ప్రాట్‌తో కలసి వచ్చిన అమీర్ ఖాన్

బాలీవుడ్ స్టార్‌హీరో ఆమిర్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సితారే జమీన్ పర్'. స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో ఆర్.ఎస్.ప్రసన్న దీనిని రూపొందించారు. ఆమిర్‌ఖాన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించింది. సినీ తారల కోసం గురువారం సాయంత్రం ఈ సినిమా ప్రీమియర్ షో ముంబయిలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి బాలీవుడ్ స్టార్ హీరోలు షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్, అలనాటి నటి రేఖ, నటుడు విక్కీ కౌశల్‌తోపాటు పలువురు హాజరయ్యారు. సినిమా వీక్షించిన అనంతరం చిత్రబృందంతో తమ అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆమిర్ ప్రత్యేకాకర్షణగా నిలిచారు. తన ప్రియురాలు గౌరీ స్ప్రాట్‌తో కలిసి ఆయన ఈ వేడుకలో సందడి చేశారు. ఆమెతో చిరునవ్వులు చిందిస్తూ ఫొటోలకు పోజులిచ్చారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న సల్మాన్‌ఖాన్.. తన స్నేహితుడు ఆమిర్‌పై జోకులు వేశారు. ఈ సినిమా తానే చేయాల్సిందని మధ్యలో ఆమిర్ వచ్చి చేరారంటూ సరదాగా చెప్పారు. 'ఈ సినిమా తెరకెక్కించడానికి ముందు ఏం జరిగిందో మీకు తెలియదు. ఈరోజు నేను మీతో ఆ కథంతా చెబుతా. ఓసారి ఆమిర్ నన్ను ఇంటికి ఆహ్వానించి ఈ కథ గురించి చెప్పాడు. కథ నాకెంతో నచ్చింది. తప్పకుండా చేస్తానని చెప్పా. కొన్నిరోజుల తర్వాత ఆయన నుంచి ఫోన్ వచ్చింది. తానే ఈ సినిమా చేస్తున్నానని చెప్పాడు. అందుకు నేను సంతోషించాను. తన నిర్ణయాన్ని మెచ్చుకున్నాను' అని అన్నారు. అనంతరం ఆమిర్ ఖాన్ – కిరణ్‌రావు విడాకుల పైనా సల్మాన్ సరదాగా వ్యాఖ్యలు చేశారు. 'నిజం చెప్పాలంటే ఆమిర్ ఈ కథ నాకెప్పుడో చెప్పారు. ఆయన అప్పుడే ఈ సినిమాపై వర్క్ చేయాల్సింది కాకపోతే ఆ సమయంలో వేరే పేపర్ వర్క్‌లో బిజీగా ఉన్నారు' అని అన్నారు. సల్మాన్ మాటలతో అక్కడున్న ఫొటోగ్రాఫర్లు అందరూ నవ్వులు పూయించారు. ఈ ఏడాది తన 60వ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో గౌరీ స్ప్రాట్‌తో రిలేషన్ గురించి ఆమిర్ బయటపెట్టారు. ఏడాదిన్నర నుంచి ఆమె తో డేటింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా ఆమెను మీడియాకు పరిచయం చేశారు. గౌరీ కొంతకాలంగా ఆమిర్‌ఖాన్ నిర్మాణసంస్థలో సహాయకురాలిగా పనిచేస్తున్నారు. వీరి మధ్య 25 ఏళ్ల స్నేహబంధం ఉంది.



## పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని చెప్పారు. ప్రతి గ్రామంలోని పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చేలా కృషి చేస్తామని అన్నారు. పేదరికాన్ని దూరం చేయాలని ఇందిరాగాంధీ గరీబ్ హటావో పేరుతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇచ్చిందని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ పేదలకు మంచి చేయాలనే 200యూనిట్ల ఉచిత కరెంట్ ఇస్తున్నారని పేర్కొన్నారు మంత్రి వివేక్ వెంకటస్వామి. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కొండా భూదేవి గార్డెలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను మంత్రి వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మీడియాతో మాట్లాడుతూ.. సిద్దిపేటలో అడ్వాన్స్ టెక్నాలజీతో స్కిల్ డెవలప్‌మెంట్‌ని ప్రారంభిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే హామీలు నెరవేరుస్తారా అని ప్రజల్లో అనుమానం ఉండేదని చెప్పారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక రూ. 8లక్షల కోట్లు అప్పు అయిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కంకణం కట్టుకుందని మంత్రి వివేక్ తెలిపారు. మ ప్రభుత్వం పేదలను ఆదుకోవాలని ఆలోచన చేస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. మహిళలకు రూ.500లకు గ్యాస్ సిలిండర్, ఉచిత బస్ సౌకర్యం అందిస్తున్నామని వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దేశంలో ఎక్కడ లేని విధంగా రైతులకు రూ. 23వేల కోట్ల రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. సుమారు రూ.10వేల కోట్ల రైతు భరోసా నిధులను సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల విడుదల చేశారని తెలిపారు. రూ.10 లక్షల వరకు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని తమ ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని చెప్పారు. సన్నవడ్లు పండించే రైతులకు ప్రభుత్వం రూ.500ల బోనస్ ఇస్తోందని వెల్లడించారు మంత్రి వివేక్ వెంకటస్వామి. అంతకుముందు గజ్వేల్‌లో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలను మంత్రి వివేక్ వెంకటస్వామి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, జిల్లా కలెక్టర్ హేమావతి పాల్గొన్నారు. గజ్వేల్‌లో 3వేల డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఎన్నికలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు. గృహజ్యోతి కింద 79 వేల మంది లబ్దిదారులకు గ్యాస్ సబ్సిడీ అందిస్తున్నామని చెప్పారు మంత్రి వివేక్ వెంకటస్వామి. ÷ళిదలకు రేషన్‌కార్డ్ ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి వెల్లడించారు. 600 గజాల స్థలంలో ప్రతి నిరుపేద ఇండ్లు కట్టుకునేందుకు తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. విద్య, వైద్యం, ఇండ్లు, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. 600 గజాల కంటే ఎక్కువ ఇంటి నిర్మాణం ఉండేలా లబ్దిదారులు చూసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

## యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

- ప్రజలకు సిఎం చంద్రబాబు పిలుపు

**విశాఖపట్నం,జూన్ 20( వెలుతురు):**

ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని సిఎం చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. ఇందులో అందరూ పాల్గొని మన ఐక్యత చాటాలన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నం చేరుకున్నారు. జిల్లా నాయకులు సీఎంకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎం మీడియాతో మాట్లాడారు. 'యోగా మన సంస్కృతి, మన సంపద. శారీరక, మానసిక ఒత్తిడిని తగ్గించే యోగాను నిత్యం ఆచరిద్దాం. విశాఖ వేదికగా జరిగే 11వ అంతర్జాతీయ యోగా డే నుంచి దీనికి నాంది పలుకుదాం. ప్రధాని మోదీ సమక్షంలో విశాఖ ఆర్కే బీచ్‌లో జరుగనున్న యోగా డే కార్యక్రమాన్ని గ్రాండ్ సక్సెస్ చేద్దాం. రాష్ట్రంలో వాడవాడలా యోగా సాధనతో సరికొత్త రికార్డు సృష్టిద్దాం. వారసత్వంగా వచ్చిన యోగాను మనమంతా ఆచరించటంతో పాటు భవిష్యత్ తరాలకూ అందిద్దాం' అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

# సినిమా డైలాగులు హాలు వరకే బాగుంటాయి

చెబుతూ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పవన్ స్పందించారు. 'సినిమాలో చెప్పే డైలాగ్‌లు సినిమా హాల్ వరకే బాగుంటాయి. వాటిని అనుసరిస్తామంటే ప్రజాస్వామ్యంలో సాధ్యం కాదు. ఎవరైనా చట్టం, నియమ నిబంధనలను పాటించాల్సిందే. ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించే అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరించాల్సిందే. దీనిపై పోలీసులకు ప్రభుత్వం ఇప్పటికే దిశానిర్దేశం చేసింది. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారిని కూటమి ప్రభుత్వం ఉపేక్షించదు. రౌడీషీట్లు తెరిచి అసాంఘిక శక్తులను అదుపు చేస్తాం. చట్టవిరుద్ధంగా ప్రవర్తిస్తామని బహిరంగంగా ప్రదర్శనలు చేసేవారిని కట్టడి చేయాలి. కట్టడి చేయకపోగా సమర్థించేలా మాట్లాడేవారి నేర ఆలోచనను ప్రజలంతా గమనించాలని పవన్ అన్నారు. . అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడటం కూడా నేరమే అని మరచిపోవద్దని పవన్ కల్యాణ్ తెలిపారు. వైఎస్ జగన్ పల్నాడు జిల్లా, సత్తెపల్లి పర్యటనలో వైసీపీ పార్టీ నేతలు చంపేస్తాం, నరికేస్తాం అంటూ బహిరంగంగానే విధ్వంసం సృష్టించడంపై.. పవన్ కళ్యాణ్ స్పందించారు. అనుమతులు లేకుండా డీజేలు, ర్యాలీలు నిర్వహించడంతో పాటు నిబంధనలు తుంగలో తొక్కి ఇరువురు వ్యక్తుల మరణానికి కారణమైనందుకు ఇప్పటికే పోలీసులు చర్యలకు దిగారు. అల్లర్లకు కారణమైన వారిపై వరసగా కేసులు నమోదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అసాంఘిక శక్తులపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని ఉపముఖ్యమంత్రి పవన్ ఆదేశమిచ్చారు. అప్రజాస్వామిక ధోరణిలో మాట్లాడేవారిని ప్రజలు ఓ కంట కనిపెట్టాలని సూచించారు. జగన్ ఓదార్పు పర్యటనలో వైసీపీ నేతలు సృష్టించిన హడావుడి అంతా ఇంతా కాదు. 2029లో తాము అధికారంలోకి వస్తే రప్పా రప్పా నరికేస్తామంటూ పుష్ప డైలాగులతో కూడిన ప్లకార్డులు ప్రదర్శించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించి ఇద్దరు వ్యక్తుల మృతికి కారణమయ్యారు. ఈ విషయమై డిప్యూటీ సీఎం పవన్ ఘాటుగా స్పందించారు. సినిమాలో చెప్పే డైలాగులు సినిమా హాలు వరకూ బాగుంటాయి..వాటిని ఆచరణలో పెడతాము. ఆ డైలాగులకు అనుగుణంగా మేం ప్రవర్తిస్తాం అంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

## కాన్వాయ్ ఢీకొని మృతి చెందిన సింగయ్య

- కుటుంబానికి పదిలక్షల సాయం ప్రకటించిన జగన్
- సింగయ్య భార్యను కలిసి చెక్కును అందించిన అంబటి

**గుంటూరు,జూన్20( వెలుతురు):**

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సత్తెనపల్లి పర్యటన సందర్భంగా ఏటుకూరు బైపాస్ వద్ద కారు ఢీకొని మృతి చెందిన వెంగళాయపాలెంకు చెందిన చీలి సింగయ్య కుటుంబానికి జగన్ పదిలక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. వైసీపీ నేతలు అంబటి రాంబాబు, మోదుగుల వేణుగోపాల్ రెడ్డి, లేళ్ల అప్పిరెడ్డి, బలసాని కిరణ్ కుమార్, నూరిఫాతిమాలు శుక్రవారం వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వైసీపీ పార్టీ తరఫున 10 లక్షల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును అందజేశారు. సింగయ్యను ఢీకొట్టిన వాహనం వైసీపీ నేత దేవినేని అవినాష్ ప్రధాన అనుచరుడు గొట్టిపాటి హరీష్‌కు చెందినదిగా పోలీసులు గుర్తించారు. గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ 'సింగయ్య వైసీపీ కార్యకర్త, వైఎస్ జగన్ అభిమాని. జగన్ పర్యటనలో కారు యాక్సిడెంట్‌తో సింగయ్య మృతి చెందారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుంది. విషయం తెలిసిన వెంటనే జగన్ ఆయన కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. 10 లక్షల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును సింగయ్య భార్యకు అందించాం. సింగయ్య మృతిని కూడా ప్రభుత్వం రాజకీయం చెయ్యాలని చూసింది. జగన్ పర్యటనపై వైసీపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు కేసులు పెడుతున్నారు. పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా ఎవరూ భయపడరు, వాటిపై న్యాయపోరాటం చేస్తాం. వైసీపీ



నాయకులు, కార్యకర్తలను పోలీసులు అక్రమంగా నిర్బంధిస్తే చూస్తూ ఊరుకోం అని హెచ్చరించారు. జగన్ పర్యటనకు ప్రజలను రానివ్వకుండా చేయాలని ప్రభుత్వం, పోలీసులు ద్వారా కుట్ర పన్నింది. ఆ కుట్రను ఛేదించుకుంటూ వేలాది మంది జనం తరలివచ్చారని అన్నారు. 'సింగయ్య వైసీపీకి కరుడుగట్టిన కార్యకర్త. యాక్సిడెంట్‌లో ఆయన చనిపోవడం బాధాకరం. ఈ విషయం తెలుసుకోగానే వైఎస్ జగన్ మమ్మల్ని అందరినీ సింగయ్య ఇంటికి వెళ్లి ఆ కుటుంబానికి అండగా ఉండమని ఆదేశించారు. జగన్ పంపిన 10 లక్షలు ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కును ఆ కుటుంబానికి అందించాం. సింగయ్య కుటుంబానికి పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు.

## దుబ్బాకలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్

- మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా వివేక్ వెల్లడి
- ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ చేసిన మంత్రి

**సిద్దిపేట,జూన్ 20( వెలుతురు):**

దుబ్బాకలో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మిస్తామని మంత్రి వివేక్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా వివేక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..12 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిందని గుర్తు చేశారు. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు పంపిణీ చేస్తోందన్నారు. ప్రజలందరూ ఇందిరమ్మ ఇల్లు కోసం ఎదురుచూస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రజలకు స్వేచ్ఛనిచ్చామని చెప్పారు. ప్రజలకు మేలు చేయాలనదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్, రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వంటి ఎన్నో మంచి పనులు చేసిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసినట్లుగా రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని అన్నారు. రైతులందరికి పెట్టుబడి సాయం కింద రైతు భరోసా అందిస్తున్నామని, సన్న వడ్లు పండించిన వారికి రూ.500 బోనస్ ఇస్తున్నామని పేర్కొన్నారు. పేద ప్రజలు కూడా సన్న బియ్యం తినాలనే సదుద్దేశంతో రేషన్ ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రజలకు అన్ని స్కీములు అమలు చేస్తామన్నారు. త్వరలోనే రాజీవ్ యువ వికాసం పథకం కూడా ప్రారంభమవుతోందని చెప్పారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రిగా ప్రజలు, అధికారులకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని అన్నారు.







Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICCATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com